- సిస్టమాటిక్ రీడింగ్ ఎప్పుడు? గుండెపోటు రావొచ్చు!
- రైతులు, ప్రభుత్వం మధ్య విశ్వాసలోపం: సుప్రీం
- బ్యాంకుల్లో నగదు చెల్లింపు నిబంధనలు కఠినం
- త్వరలో 2,500 సాధారణ రైల్వే కోచ్‌లు
- రూ.72 వేల దిగువకు బంగారం ధర

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

గురువారం THURSDAY 25.7.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 | సంచిక (Issue): 50 | వెల (Price) రూ.6.50 | పంచమి

గురువారం, సూర్యోదయం: 5-53, సూర్యాస్తమయం: 6-52. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం కృష్ణ పక్షం తిథి: పంచమి రాత్రి 1-58 వరకు. నక్షత్రం: పూర్వాభాద్ర సాయంత్రం 6-16 వరకు. వర్జ్యం: రాత్రి 1-10 నుండి రాత్రి 2-39 వరకు. రాహుకాలం: పగలు 1-59 నుండి పగలు 3-36 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-13 నుండి పగలు 11-04 వరకు, పగలు 3-23 నుండి సాయంత్రం 4-15 వరకు. అమృతకాలం: ఉదయం 8-55 నుండి ఉదయం 10-23 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

గుండు సున్నాపై సమర భేరి

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయంపై దద్దరిల్లిన అసెంబ్లీ

- మోదీ అంటే భయమెందుకు రేవంత్.. కేటీఆర్ సూటి ప్రశ్న
- కేసీఆర్ పేరెత్తకుంటే ముఖ్యమంత్రికి బతుకుదెరువు లేదా?
- సీఎం, మంత్రులు ఢిల్లీలో ధర్నా చేయాలి.. మేం మద్దతిస్తం
- రాజకీయాలకన్నా రాష్ట్ర ప్రయోజనాలే బీఆర్‌ఎస్‌కు ముఖ్యం
- లోక్‌సభలో బీఆర్‌ఎస్ లేకపోవడం వల్లే రాష్ట్రానికి అన్యాయం
- తెలంగాణ వ్యతిరేకుల మెడలు వంచేది బీఆర్‌ఎస్ మాత్రమే
- కాంగ్రెస్, బీజేపీలపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి కేటీఆర్
- బడ్జెట్‌లో అన్యాయంపై తీర్మానానికి సభ ఏకగ్రీవ ఆమోదం

రాష్ట్రానికి నిధులివ్వని కేంద్రంపై కలిసి పోరాడుదాం

కేంద్రానికి రూపాయి ఇస్తే తిరిగొచ్చేది 47 పైసలు మాత్రమే!

దక్షిణాదిపై కేంద్రం కక్ష సాధింపు

కేసీఆర్ వస్తే ఢిల్లీలో దీక్ష చేస్త

27న నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తాం: సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 24(నమస్తే తెలంగాణ): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై అసెంబ్లీ దద్దరిల్లింది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల ప్రదర్శిస్తున్న వివక్షపై రాష్ట్ర ప్రజల ఆగ్రహం సభలో ప్రతిధ్వనించింది. బుధవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయం తర్వాత కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టగా, సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ తీర్మానానికి ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెట్టిన ఈ తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసిన 2వ పేజీలో

క్యాబినెట్ దీక్ష చేయాలి

ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ఆమరణ దీక్షకు మొత్తం మంత్రివర్గం కూర్చోండి. మేము అండగ ఉంటం. మేం నుట్ల కూడుంటం. కేంద్రంతో కొట్లాడుదాం. అందరంపోయి కూర్చుందాం. ఎందుకంటే ముఖ్యమంత్రిగారు ఈ మధ్య ఒక్క సారి కాదు.. రుణమాఫీ అంటే హరీశ్‌రావు దీక్ష చేయాలంటడు. నిరుద్యోగుల సమస్యలంటే నన్ను ఆమరణ నిరాహార దీక్ష చేయమంటడు.. అందుకే నేను అడుగుతున్న. మొత్తం క్యాబినెట్ కూర్చోండి. మేం వెయ్యిమందిమి వస్తం.

రేవంత్‌లా పరాన్నజీవులం కాదు

మాకు చీకటి స్నేహాలు అలవాటు లేదు. రేవంత్‌రెడ్డికి ఉన్నాయి.. ఢిల్లీలో బీజేపీ క్యాంటీన్ స్నేహం చేయడం, ఇప్పటికీ ఆయన పనులన్నీ బీజేపీ ఎంపీలే చేస్తరు. ఆయన ఎటుంటే అటు మాట్లాడవద్దా? కేసీఆర్‌గారి మీద ఇష్టం వచ్చినట్టు మాట్లాడినారు. విలీనం చేయడానికి మేమేమీ రేవంత్‌రెడ్డిలాగా పరాన్నజీవులం కాదు. వారు పదవుల కోసం పార్టీలు మారిండ్రు. మేముట్లగాదు. పదవులు వదులుకున్నం తెలంగాణ కోసం. ఒక్కసారి కాదు పలుసార్లు రాజీనామా చేసినం.

-కేటీఆర్

సభా పర్వం



రేవంత్ మాటలు కేటీఆర్ పంచ్‌లు

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): శాసనసభలో బుధవారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ మధ్య పలుమార్లు సంవాదం జరిగింది. ఇద్దరి మధ్య మాటలు తూటాలు పేలాయి. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు మాజీ మంత్రి కేటీఆర్ ఎటాకింగ్ కౌంటర్లు ఇచ్చారు.

సీఎం రేవంత్: 15 ఏండ్ల ఉద్యమ కారుడు, పదేండ్లపాటు సీఎం అయిన కేసీఆర్ సభకు రాకుండా శిక్షను పంపించి మాట్లాడిస్తున్నారు.

కేటీఆర్: ఈ విధంగా అయినా కేసీఆర్ గురించి మాట్లాడినందుకు ధన్యవాదాలు. ఆయన (సీఎం రేవంత్) స్థాయికి మేం చాలు. కేసీఆర్ అవసరం లేదు. ఆయనకు సమాధానం చెప్పే సత్తా మాకుంది.

సీఎం రేవంత్: కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటాలో అనుకున్నా. అంత కన్నా దారుణంగా 2వ పేజీలో




• నూరేండ్లు వర్ధిల్లు

పుట్టిన రోజును పురస్కరించుకుని కేటీఆర్ బుధవారం తన తండ్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు. సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షు, కుమార్తె అలేఖ్యతో కలిసి నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్లిన కేటీఆర్ తల్లిదండ్రులు కేసీఆర్, శోభమ్మను కలిసి ఆశీర్వాదం అందుకున్నారు.

25 వేలతో మెగా డీఎస్సీ ప్రకటించాలి

- లేదంటే నిరుద్యోగులకు రేవంత్ క్షమాపణ చెప్పాలి
- ఎనిమిది నెలలు గడిచాయి.. నాలుగు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తరు? 3
- మండలిలోనూ మా గొంతు నొక్కుతరేమో కానీ, ఆర్టీసీ కార్మికుల హృదయాలను గెలువలేరు
- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద హరీశ్‌రావు ఫైర్



ఆర్టీసీ విలీనం ఇంకెప్పుడు?

- యూనియన్లను ఎప్పుడు పునరుద్ధరిస్తారు? 3
- 300 కోట్ల చెక్కు ఇంకా బస్సుభవన్ చేరలేదు
- ప్రభుత్వానికి మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నలు
- రాజకీయ విమర్శలకు దిగిన మంత్రి పొన్నం
- సర్కారు తీరుపై బీఆర్‌ఎస్ శాసనసభ్యుల నిరసన



3

నేడు రాష్ట్ర బడ్జెట్

- అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న భట్టి
- మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు
- కేటాయింపులపైనే అందరి దృష్టి
- ఉదయం 9 గంటలకు అసెంబ్లీ హాల్‌లో క్యాబినెట్ సమావేశం

నేతన్నకు నా వంతుగా..

- ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను ఆదుకుంటా
- బర్త్‌డే సందర్భంగా కేటీఆర్ మానవీయ నిర్ణయం
- కుటుంబసభ్యులతో స్టేట్‌హోంలో జన్మదిన వేడుకలు
- 100 మంది విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌ల అందజేత

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఈ ఏడు నెలల కాలంలో ఆత్మహత్య చేసుకున్న నేతన్న కార్మికుల కుటుంబాలను తన వంతుగా ఆదుకుంటా.. అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఏటా 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం ద్వారా స్ఫూర్తిని పంచుతున్న ఆయన ఈసారి నిరుపేద కుటుంబాల పిల్లలకు చేయూతనందించారు. బుధవారం కేటీఆర్ పుట్టినరోజు వేడుకలను తన సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షు, కూతురు అలేఖ్యతో కలిసి హైదరాబాద్ స్టేట్‌హోంలో విద్యార్థుల సమక్షంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి 100 మంది విద్యార్థినులకు కేటీఆర్ ల్యాప్‌టాప్‌లను అందజేశారు. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం ద్వారా నవ్వులు పూయించే కేటీఆర్.. ఈసారి నేతన్న కుటుంబాలకు అండగా నిలిచి మానవీయతను చాటుకున్నారు. ఆత్మహత్య చేసుకున్న నేతన్న కుటుంబాలకు 6వ పేజీలో

జ్వరమూ.. మంచిదే!

7

- రోగనిరోధక శక్తి మెరుగు
- హీట్ షాక్ ప్రొటీన్స్ చైతన్యం
- అధ్యయనాల్లో తేలింది ఇదే!



తక్కువ ఖర్చుతో టీబీ పరీక్ష

టెక్నాలజీని అభివృద్ధి చేసిన 'ఐసీఎంఆర్' 7



మేడిగడ్డకు బీఆర్‌ఎస్

- నేడు, రేపు ప్రాజెక్టుల పరిశీలన
- తరలివెళ్లనున్న ప్రజాప్రతినిధులు

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : గోదావరిలో నీటి ప్రవాహం ఉన్నా రైతులకు సాగునీటిని అందివ్వటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందనే అంశాన్ని ప్రజలకు తెలియజేసేందుకు, సర్కారుపై ఒత్తిడి తెచ్చేందుకు బీఆర్‌ఎస్ మేడిగడ్డ బాట పట్టనున్నది. గురు, శుక్రవారాల్లో కన్నెపల్లి పంప్‌హౌస్, మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించనున్నది. గురువారం శాసనసభలో బడ్జెట్ ప్రసంగం ముగిశాక అక్కడి నుంచే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం మేడిగడ్డకు బయలుదేరనున్నది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన మంగళవారం జరిగిన పార్టీ శాసనసభా పక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా ముందుగా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల బృందం కరీంనగర్‌లోని ఎల్‌ఎండీ (లోయర్ మానేర్ డ్యామ్)ని పరిశీలించి రాత్రి రామగుండంలో బస చేసి శుక్రవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శిస్తుంది. అక్కడి నుంచి మేడిగడ్డకు వెళ్లి బ్యారేజీని పరిశీలించి తిరిగి హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ మేరకు బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల శ్రేణులు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల బృందానికి స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యాయి.

నేడు సిరిసిల్ల బంద్

- ఈ నెల 27న అసెంబ్లీ ముట్టడికి నేతన్నల పిలుపు
- మూడు రోజులుగా పట్టణంలో నిరాహార దీక్షలు

కరీంనగర్, జూలై 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నేతన్న రంగ సంక్షోభ నివారణకు కాంగ్రెస్ సర్కార్ దృష్టిసారించడంలేదని నిరసిస్తూ గురువారం సిరిసిల్ల బంద్‌కు పవర్‌లూం వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక (జేఏసీ) పిలుపునిచ్చింది. 3 రోజులుగా సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. జేఏసీ పోరాటానికి బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ, సీఐటీయూ వంటి సంఘాలు మద్దతు ప్రకటించాయి. పవర్‌లూం పరిశ్రమను 6వ పేజీలో



తుక్కు కింద అమ్మిన సాంచాలను వ్యాన్‌లో వేసి తరలిస్తున్న దృశ్యం



మరో నేతన్న ఆత్మహత్య

- ఏడు నెలలుగా ఉపాధి లేక బలవన్మరణం
- జగిత్యాల జిల్లాలో తీవ్ర విషాదం 6

రైల్వే బడ్జెట్‌లోనూ మొండిచెయ్యే



- రాష్ట్రానికి అరకొర నిధులతో సరి
- కోచ్ ఫ్యాక్టరీ ఊసెత్తని కేంద్రం
- ఏపీకి అధిక కేటాయింపులు

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): రైల్వే బడ్జెట్‌లోనూ తెలంగాణకు మొండి చెయ్యి చూపారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కాజీపేటలో ఏర్పాటు చేయాల్సిన కోచ్ ఫ్యాక్టరీ గురించి కనీసం మాటమాత్రంగానైనా ప్రస్తావించలేదు. దేశవ్యాప్తంగా రైల్వేలకు కేటాయించిన రూ.2,62,000 కోట్లలో తెలంగాణలోని ప్రాజెక్టులకు ఎంతిస్తున్నది చెప్పలేదు. గడిచిన ఫిబ్రవరిలో ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో తెలంగాణకు రూ.5,071 కోట్లు మాత్రమే 6వ పేజీలో



ప్రజాపాలనలో ఆడబిడ్డ బందీ

- నిరుద్యోగులపై అప్రకటిత నిషేధం
- పోలీసుల అదుపులో డీఎస్సీ అభ్యర్థి
- జ్వరం బాధిస్తున్నా వదలని పోలీసులు
- ఆరు గంటలపాటు ఠాణాలో నిర్బంధం
- సీఎం ఇంటి ముట్టడికి నిరుద్యోగుల పిలుపుతో పోలీసుల అత్యుత్సాహం

హైదరాబాద్, జూలై24 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు నిరుద్యోగులపై అప్రకటిత నిషేధాన్ని అమలు చేస్తున్నదనే దానికి ఈ ఘటనే నిదర్శనం. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా, తెల్లారితే డీఎస్సీ పరీక్ష రాయాల్సి ఉన్నదని మొత్తుకున్నా వినని పోలీసులు.. సీఎం ఇంటి ముట్టడికి ఎక్కడ వస్తుందోననే అత్యుత్సాహంతో ఓ నిరుద్యోగ యువతిని ఠాణాలో నిర్బంధించారు. మెడికల్ సర్టిఫికెట్లు చూపి, ఎక్కడికీ వెళ్లబోనని రాతపూర్వకంగా రాసిస్తే తప్ప విడువం 6వ పేజీలో

• స్వచ్ఛ నగరానికి చెత్తపేరు



స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 పురస్కారం పొందిన హైదరాబాద్ నగరంలో మళ్లీ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇందుకు పాతనగరంలోని సీతారాంబాగ్ రహదారే నిదర్శనం. నగరంలోని అనేక రోడ్ల మలుపుల్లో ఇదే పరిస్థితి. ఇలాంటి చెత్త కుప్పలు జీహెచ్‌ఎంసీ పరిధిలోనే 2640 ఉన్నాయని ఆస్కీ (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) చేసిన సర్వేలో తేలింది. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు ఏటా రూ. 300 కోట్లు ఖర్చు చేస్తున్నా అన్నీ కాగితాలకే పరిమితమై అవగాహన మాత్రం అటకెక్కుతున్నది.

పదేండ్లు ఇదే మొత్తుకున్నాం

కేంద్రం నుంచి రాష్ట్రానికి సహకారం లేదంటే... కేసీఆర్ పంచాయితీ వల్లే నిధులు రాలేదన్నారుగా!

ఇప్పుడు కాంగ్రెస్‌కు తత్వం బోధపడింది • బడ్జెట్‌లో అన్యాయం తెలంగాణ హక్కులను కాలరాయడమే: కేటీఆర్

- ప్రధానిని బడేభాయ్ అన్నా ఫలితం దక్కలే
- యాచిస్తే రాదు .. శాసిస్తేనే నిధులు
- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై చర్చను స్వాగతిస్తున్నాం.. మద్దతిస్తున్నాం
- మీతో వస్తాం.. కలిసి కొట్లాడుదాం
- కేసీఆర్‌పై కోపంతో రాష్ట్రాన్ని నాశనం చేయొద్దు.. అది మీకే నష్టం
- బడ్జెట్‌లో అన్యాయంపై చర్చలో కేటీఆర్
- 27న నీతి ఆయోగ్ భేటీని బహిష్కరిస్తాం
- అందరం కలిసి కేంద్రంపై పోరాటం చేద్దాం
- తెలంగాణ రూపాయి ఇస్తే కేంద్రం 47 పైసలే తిరిగి ఇస్తున్నది
- బీహార్‌కు మాత్రం రూ.47 ఇస్తున్నది: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 24(నమస్తే తెలంగాణ): కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయం తెలంగాణ హక్కులను కాలరాయడమేనని, విభజన చట్టానికి తూట్లు పొడవడమేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. లోక్‌సభలో బీఆర్‌ఎస్ లేకపోవడం వల్లనే రాష్ట్రానికి ఇంత అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు చెరో ఎనిమిది ఎంపీ స్థానాలు ఇచ్చినా, ఆ పార్టీలు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటం లేదని దుయ్యబట్టారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై బుధవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో బీఆర్‌ఎస్ తరఫున కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్రం సాయం చేసే విషయంలో గత పదేండ్లుగా జరిగిన అన్యాయం ఇంకా కొనసాగుతూనే ఉన్నదని కేటీఆర్ నిప్పులు చెరిగారు. బీఆర్‌ఎస్‌కు రాజకీయ ప్రయోజనాల కన్నా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో అన్యాయంపై చర్చను బీఆర్‌ఎస్ పూర్తిగా స్వాగతిస్తున్నదని, సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని తెలిపారు. పదేండ్లు తాము అధికారంలో ఉన్నప్పుడు ఏం చెప్పామో, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే చెప్తున్నదని వివరించారు. గతంలో తాము చెప్తే పట్టించుకోలేదని, కేసీఆర్ పంచాయితీ వల్లే రాష్ట్రానికి నిధులు రాలేదంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారని గుర్తుచేశారు. తాము బీఆర్‌ఎస్‌లా కాదని, కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించి నిధులు తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలను ఈ సందర్భంగా కేటీఆర్ ఉటంకించారు. ప్రధానిని బడేభాయ్ అన్నప్పటికీ ఫలితం దక్కలేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి తమ వరకు వస్తే గానీ అసలు తత్వం బోధపడిందని అన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి లోక్‌సభలో బీఆర్‌ఎస్ ఉండా లేకపోవడమే కారణమని చెప్పారు. మ్యాథ్స్‌లో 8+8=16 అయితే కాంగ్రెస్, బీజేపీ లెక్కలో మాత్రం 8+8=0 అని ఎద్దేవా చేశారు. 2 పార్టీలకు 16 ఎంపీ సీట్లు ఇచ్చినా రాష్ట్రానికి న్యాయం జరగలేదని విమర్శించారు. విభజన హామీల అమలు కోసం కేంద్రంపై బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక పోరాటాలు చేశామని, సీఏఏ, ఎన్‌ఆర్‌సీలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేశామని గుర్తుచేశారు. మోటర్లకు మీటర్లు, కాళేశ్వరానికి రోడ్ ప్రాజెక్ట్, ఒడిశా బొగ్గుగనుల, వ్యవసాయ చట్టాలు తదితర అంశాలపై ప్రశ్నించడంతోపాటు వ్యతిరేకించినట్టు తెలిపారు.

యాచిస్తే రాదు.. శాసిస్తేనే వస్తది

ప్రొఫెసర్ జయశంకర్ చెప్పినట్టుగా 'యాచిస్తే రాదు.. శాసిస్తేనే వస్తది' అనే సిద్ధాంతంతోనే తెలంగాణ సాధించామని, ఇప్పుడు కూడా అదే పంథాను కొనసాగిస్తామని కేటీఆర్ స్పష్టంచేశారు. కేంద్రం సహకరించకపోయినా తెలంగాణ అభివృద్ధిని ఆపలేదని, దేశంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపామని వివరించారు. సందర్భాన్ని బట్టి కేంద్రానికి మద్దతు ఇచ్చామని స్పష్టంచేశారు. అదానీకి, కేంద్రం ఒత్తిడికి లొంగిపోవద్దని, డిస్కంలను ప్రైవేటుపరం చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగితే అక్కడి ఎంపీలు రోడ్లెక్కి ధర్నా చేస్తే కాంగ్రెస్ ఎంపీలు మాత్రం మొఖం చాటేశారని విమర్శించారు. తమ రాజ్యసభ ఎంపీలను కూడా పంపిస్తామని ఢిల్లీలో పోరాటం చేయాలని ప్రభుత్వానికి సూచించారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలు కేంద్రాన్ని నిలదీయకుండా ఇక్కడ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంతో పోరాటంలో కాంగ్రెస్ కలిసిరాలేదని, కానీ తాము ఆ తప్పు చేయబోమని స్పష్టంచేశారు. మీతో వస్తాం.. కలిసి కొట్లాడుదామని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. బీజేపీని విమర్శిస్తే కాంగ్రెస్ నాయకులు ఎందుకు ఇబ్బంది పడుతున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిన్న వయసులోనే సీఎం అయ్యారని, అంత అసహనం పెంచుకోవద్దని హితవు చెప్పారు. ఢిల్లీలో చీకటి ఒప్పందాలు చేసుకున్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'తెలంగాణ ప్రయోజనాల కోసమే బీఆర్‌ఎస్ పని చేస్తుంది. ఏ పదవులు, ఏ చీకటి ఒప్పందాలు పెట్టుకోవాల్సిన అవసరం మాకు లేదు. ఏం చేసినా బాజాప్త చేస్తాం. మీ లాగా మేము మోదీ పేరు తీసుకోవడానికే భయపడే ప్రసక్తే లేదు. ఇప్పటికే కూడా సీఎం పదవులు ఢిల్లీలో బీజేపీ ఎంపీలే దక్కించుకున్నారు. కానీ మాకు ఆ అవసరం లేదు. మేము తెలంగాణ ప్రయోజనాల కోసమే పోరాడుతాం. 2014లో కాంగ్రెస్‌లో విలీనమవ్వాలని అనుకున్నాం. దిగ్విజయ్‌సింగ్ వైఖరి వల్ల చేయలేదు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీజేపీతో చీకటి ఒప్పందం అని మాట్లాడుతున్నారు. 8 మంది ఎంపీలను కాంగ్రెస్‌కు ప్రజలు ఇస్తే మీరు రాష్ట్రానికి తెచ్చింది గుండుసున్నా, దాని గురించి ప్రజలు అడుగుతున్నారు. సీఎం సమాధానం చెప్పాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రం దివాలా తీసిందంటూ ప్రభుత్వమే ప్రకటిస్తే.. ఐదుకు రూపాయి అప్పు దొరకదని చెప్పారు. కేసీఆర్‌పై కోపంతో రాష్ట్రాన్ని నాశనం చేయొద్దని, అది మీకే నష్టమని హెచ్చరించారు. రాష్ట్రానికి బడేభాయ్ ఇవ్వాల్సిందేమీ, ఆ ప్రాజెక్టును కాంగ్రెస్ తెస్తుందో, చస్తుందో ప్రజలు చూస్తారని వ్యాఖ్యానించారు. ఆరు గ్యారెంటీల అమలు వరకు కాంగ్రెస్‌ను వెంటాడుతామని స్పష్టంచేశారు.

> **కేసీఆర్ పేరు తీయకుంటే బతుకుదెరువు లేదా?**
>
> ముఖ్యమంత్రిగారూ.. కేసీఆర్ పేరు చెప్పకపోతే బతుకుదెరువు లేదా సర్? మోదీగారి పేరుతీయడానికి కూడా ఎందుకు భయపడుతున్నరు ముఖ్యమంత్రీ? అంత భయమెందుకు సర్. అందుకే మేమనేది అధ్యక్ష.. ఇక్కడ నోటికొచ్చినట్టు మాట్లాడితేరాదు! తప్పకుండా రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి! ఎనిమిది ఎంపీలున్నా.. తెచ్చింది గుండు సున్నా! ఆరు గ్యారెంటీలు ఎగ్గొట్టడానికి గత ప్రభుత్వం మీద బదనాం చేయడం.. రాష్ట్రం దివాలా తీసిందని బదనాం చేసినా తప్పించుకోరు.
>
> -కేటీఆర్

కేంద్రం వైఖరితో ప్రమాదకర సంకేతాలు: భట్టి విక్రమార్క

బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు ఇవ్వకపోవడం మమ్మాటికీ కక్ష సాధింపేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫెడరల్ వ్యవస్థలో న్యాయంగా రాష్ట్రాలకు రావాల్సిన వాటాను హక్కుగా అడుగుతున్నామని చెప్పారు. నిధుల కేటాయింపులో కేంద్ర వివక్షాపూరిత వైఖరిపై ప్రమాదకర సంకేతాలు వస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానంపై భట్టి మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాదని పేర్కొన్నారు. దీంతో సభలో ఒక్కసారిగా దుమారం చెలరేగింది. బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వాలని పట్టుబట్టారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని పార్టీలను కలుపుకొని ధర్నా చేద్దాం. ముందుగా అసెంబ్లీలో తీర్మానం చేద్దామని చెప్పారు. రాష్ట్రానికి నిధులు, అనుమతులు, ప్రయోజనాల విషయంలో ప్రతిపక్షం వస్తానంటే ఢిల్లీకి తీసుకెళ్తామని అన్నారు. ప్రధానిని, కేంద్ర మంత్రులను కలుద్దామని, కేసీఆర్ కూడా వస్తానంటే తీసుకుపోతామని భట్టి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ఒక్క ఏపీకే కాదని, తెలంగాణకు కూడా వర్తిస్తుందని, అయినప్పటికీ కేంద్రం ఏపీపై ప్రేమ చూపి తెలంగాణను విస్మరించడం దారుణమని మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు.


బీజేపీ సమాధానం చెప్పాలి: పొన్నం ప్రభాకర్

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసిన బీజేపీ.. తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇస్తే.. ప్రజలకు మీరు ఏమిచ్చారని ప్రశ్నించారు. బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, వికసిత్ భారత్ అంటే, సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్ అంటే కేవలం ఏపీ, బీహార్ రాష్ట్రాలేనా? అని ప్రశ్నించారు.

27న నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

రాష్ట్రానికి రావల్సిన నిధులు, అనుమతులు, ప్రయోజనాలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ.. ఈ నెల 27న ప్రధాని అధ్యక్షతన జరిగే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం దక్షిణాది రాష్ట్రాలపై ముఖ్యంగా తెలంగాణపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నదని మండిపడ్డారు. తెలంగాణ కేంద్రానికి రూపాయి ఇస్తే.. కేవలం 47 పైసలే కేంద్రం తిరిగి ఇస్తున్నదని చెప్పారు. బీహార్ రాష్ట్రం రూపాయి ఇస్తే.. వారికి రూ.47 ఇస్తున్నదని వివరించారు. పదేండ్లలో ఉత్తరప్రదేశ్ రూ.3.41 లక్షల కోట్లు ఇస్తే.. వారికి కేంద్రం రూ.6.91 లక్షల కోట్లు ఇచ్చిందని.. ఆ స్థాయిలో తెలంగాణకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత పదేండ్లు దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ కక్ష గట్టిందని, దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి 22.26 లక్షల కోట్లు ఇస్తే.. తిరిగి 6.91 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయని వివరించారు. ప్రధాని లక్ష్యంగా పెట్టుకున్న 5 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశానికి ఆర్థికంగా నిలుస్తున్న తెలంగాణను ఆదుకోవాలని కోరారు. ట్రిపుల్ఆర్, మెట్రో, మూసీ, నీటి సమస్యలు, ఫార్మాసిటీ, ఐఐఎం, గిరిజన యూనివర్సిటీ, కోచ్‌ఫ్యాక్టరీ, ఉక్కు ఫ్యాక్టరీ వంటి వాటికి నిధులు, నీటి ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో ప్రధాని అధ్యక్షతన నిర్వహించే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు సభ సాక్షిగా తెలిపారు. ఈ విషయంలో అన్ని పక్షాలు కలిసి వస్తే.. తప్పకుండా కేంద్ర ప్రభుత్వ మెడలు వంచుతామని చెప్పారు. తన తీర్మానాన్ని అందరూ ఏకీభవించాలని విజ్ఞప్తిచేశారు. దీంతో సభంతా చప్పట్ల ద్వారా తమ ఆమోదాన్ని తెలిపారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు.

లోకం పోకడ



అసెంబ్లీ ఆవాజ్

బడ్జెట్ సమావేశాలు

బీఆర్‌ఎస్ నిలదీత.. సర్కార్ దాటవేత..

నిరుద్యోగుల సమస్యలపై చర్చకు డిమాండ్

కేటీఆర్ వాయిదా తీర్మానం.. స్పీకర్ తిరస్కరణ

ప్లకార్డులతో గులాబీ నేతల నిరసన.. తీర్మానంపై పట్టు

సర్కార్ నుంచి సమాధానం రాకపోవడంతో

టీ బ్రేక్ ప్రకటించిన స్పీకర్ గడ్డం ప్రసాద్

హైదరాబాద్, జూలై24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు, జాబ్ క్యాలెండర్ ప్రకటన, ఇతర న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని బీఆర్‌ఎస్ నేతలు బుధవారం అసెంబ్లీలో నిలదీశారు. ఆయా అంశాలపై సభలో చర్చించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు తీర్మానాన్ని అందజేశారు. వర్షాలు, గోదావరి వరదలపైనా చర్చించాలని వాయిదా తీర్మానాన్ని ఇవ్వగా వాటిని స్పీకర్ తిరస్కరించారు. దీంతో బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కోవా లక్ష్మి, పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అనిల్ జాదవ్, సంజయ్, మల్లారెడ్డితోపాటు ఇతర శాసనసభ్యులు ఒక్కసారిగా లేచి నిరసన తెలిపారు. 'నిరుద్యోగులపై పోలీసుల దమనకాండ నశించాలి', 'మెగా డీఎస్సీ ప్రకటించాలి', 'నిరుద్యోగులపై లాఠీచార్జికి క్షమాపణలు చెప్పాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. బీఆర్‌ఎస్ డిమాండ్లపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. మరోవైపు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వాయిదా తీర్మానంపై పట్టుబట్టి నిరసన తెలుపుతున్న క్రమంలోనే స్పీకర్ గడ్డం ప్రసాద్ సభకు టీ బ్రేక్ ప్రకటించారు. దీంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, సర్కారు తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభ నుంచి మీడియా పాయింట్ వరకు ప్రదర్శనగా వెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగుల అంశాలపై శాసనమండలిలో సైతం ఎమ్మెల్సీలు వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తిరస్కరించారు.

సభలో 'చిట్టీ' నవ్వుల్

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చర్చ సందర్భంగా చిట్టీలు (స్లిప్పులు) అనే అంశం నవ్వులు పూయించింది. బడ్జెట్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. సాధ్యమైనంత వరకూ దానికోసమూ పోరాటం చేద్దాం అన్నారు. దీనిపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కోరగా మాజీ మంత్రి కేటీఆర్ కలుగజేసుకొని 'భట్టి అన్నా.. ఓ సూచన..' అనగానే, భట్టి మాట్లాడుతూ.. 'మీకు ఇవ్వాల్సినంత టైం ఇచ్చారు. ఏదైనా సూచన చేయాలనుకుంటే చిట్టీ రాసి ఇవ్వండి' అంటూ నవ్వారు. సభలోకి మాజీ మంత్రి హరీశ్‌రావు వస్తుండటాన్ని గమనించిన భట్టి 'హరీశ్‌గారు వస్తున్నారు. మాట్లాడే ప్రతి సభ్యుడికి చిట్టీలు అందిస్తున్నారు' అనగానే.. అంతా బిగ్గరగా నవ్వారు. 'మావోళ్లకు పంపిస్తే.. మీరేందే భట్టన్నా నన్ను బద్నాం చేస్తున్నారు' అంటూ హరీశ్‌రావు నవ్వుకుంటూ సమాధానం ఇచ్చారు. భట్టి పక్కనే ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి.. 'బీఆర్‌ఎస్ హరీశ్‌రావు గారు.. బీజేపీ హరీశ్‌రావు ద్వారా చిట్టీలు అందించారు' అనగానే అంతా ఒక్కసారిగా నవ్వారు.

రేవంత్ మాటలు కేటీఆర్ పంచ్‌లు

➤ మొదటిపేజీ తరువాయి...

ఉన్నారు.

కేటీఆర్: ఆయన (సీఎం) పేమెంట్ కోటాలో సీఎం సీటు కొట్టేశారని మేమూ అనొచ్చు.

సీఎం రేవంత్: అయ్యపేరు, తాతపేరు చెప్పుకొని రాలేదు. జెడ్పీటీసీ స్థాయి నుంచి ఎదిగి సీఎం అయ్యాను.

కేటీఆర్: తాత, తండ్రుల పేరు చెప్పుకొని పదవుల్లోకి వచ్చారని ఎవరిని అంటున్నారు? రాహుల్‌గాంధీనా, రాజీవ్‌గాంధీనా..?

సీతలు మాకే కాదు వాళ్లకూ చెప్పండి: కేటీఆర్

సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష సభ్యుల్ని వ్యక్తిగతంగా విమర్శించడాన్ని నిలువరించకుండా పదేపదే ప్రతిపక్ష సభ్యులకు నీతులు చెప్తున్న స్పీకర్‌పై కేటీఆర్ అసహనం వ్యక్తంచేశారు. నీతులు తమకే కాదు, వాళ్లకు (అధికార పక్షానికి) కూడా చెప్పాలని సూచించారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి తనను మేనేజ్‌మెంట్ కోటాలో మంత్రి అయ్యానని అనొచ్చా, సభా నాయకుడు అలా మాట్లాడొచ్చా అని ప్రశ్నించారు.

నాడు అట్ల.. నేడు ఇట్ల!



- అప్పట్లో నీతి ఆయోగ్ సమావేశాన్ని కేసీఆర్ బహిష్కరిస్తే టీపీసీసీ అధ్యక్ష హోదాలో తప్పుపట్టిన రేవంత్‌రెడ్డి
- ఇప్పుడు సీఎం హోదాలో రేవంత్‌నోట బహిష్కరణ మాట
- 27న నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్లేది లేదని సభలో ప్రకటన
- నాడు కేసీఆర్ నడిచిన బాటలో నేడు రేవంత్

అప్పుడు అలా..!

నీతి ఆయోగ్ మీటింగ్‌కు కేసీఆర్ వెళ్ల కపోవడం తప్పు!

నీతి ఆయోగ్ మీటింగ్‌కు సీఎం కేసీఆర్ హాజరుకావాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానిని ప్రశ్నించేందుకు ఇది మంచి అవకాశం. ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు కేసీఆర్ నీతి ఆయోగ్ మీటింగ్‌కు వెళ్తానంటే మేమే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తం. ఈ మీటింగ్‌కు కేసీఆర్ హాజరుకాకుంటే ప్రధాని మోదీకి లొంగిపోయినట్టే!

-టీపీసీసీ అధ్యక్ష హోదాలో 2022, ఆగస్టు 7న రేవంత్‌రెడ్డి

ఇప్పుడు ఇలా..!

నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నం

ఈ నెల 27న జరిగే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నం. కేంద్రం తెలంగాణ హక్కులకు భంగం కలిగించింది. నిధుల కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం చేసింది.

-2024, జూలై 24న సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి

కేంద్రం వైఖరికి నిరసనగా నీతి ఆయోగ్ బహిష్కరణ

కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలని నీతి ఆయోగ్ చేసిన సిఫారసులను కేంద్రం పట్టించుకోనందుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నం.

-2022, ఆగస్టు 6న సీఎం కేసీఆర్


హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : అనుభవంలోకి వస్తే తప్ప జ్ఞానం బోధపడదని అంటే ఇదేనేమో. తెలంగాణ పట్ల కేంద్రం అనుసరిస్తున్న పక్షపాత వైఖరికి నిరసనగా నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు అప్పట్లో సీఎం కేసీఆర్ ప్రకటిస్తే టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తప్పుపట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానిని నిలదీయడానికి నీతి ఆయోగ్ సమావేశం ఒక మంచి అవకాశమని వాదించారు. ఆ సమావేశానికి సీఎం కేసీఆర్ వెళ్లాలని డిమాండ్ చేశారు. అదే రేవంత్‌రెడ్డి ఇప్పుడు సీఎంగా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి నిరసనగా నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు బుధవారం శాసనసభలో ప్రకటించారు. అంటే అప్పుడు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం కరెక్టే అని ఇప్పటికైనా ఒప్పుకున్నట్టే కదా? తెలంగాణపై కేంద్రంలో బీజేపీ సర్కార్ వివక్షను కేసీఆర్ ఎందుకు ఎండగట్టాల్సి వచ్చిందో ఇప్పటికైనా రేవంత్‌రెడ్డికి జ్ఞానోదయం అయిందని అనుకోవాలా? కేంద్రం వైఖరిపై అప్పుడు కేసీఆర్ ధర్మాగ్రహంలో న్యాయం ఉందని ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి అంగీకరించినట్టేనా?

కేసీఆర్ అప్పుడు ఎందుకు బహిష్కరించారు

నీతి ఆయోగ్ సిఫారసులకు కేంద్రం విలువ ఇవ్వనప్పుడు ఆ సమావేశానికి వెళ్లడంలో అర్థం లేదని బహిష్కరిస్తున్నట్టు రెండేండ్ల కిందట సీఎం కేసీఆర్ (ఆగస్టు 7, 2022)ప్రకటించారు. మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్ల గ్రాంట్, మిషన్ భగీరథకు రూ.19,500 కోట్ల గ్రాంట్ తెలంగాణకు ఇవ్వాలని నీతి ఆయోగ్ చేసిన సిఫారసును కేంద్రం పట్టించుకోకపోవడంతో.. నిరసనగా నీతిఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు కేసీఆర్ వివరించారు. కేంద్రం వైఖరిని తప్పుపట్టాల్సిందిపోయి అప్పుడు టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని తప్పుపట్టారు.

అమరావతికి నిధులిస్తే మీకేం ఇబ్బంది?

తెలంగాణకు ఏం చేయాలో బీజేపీకి తెలుసు: కిషన్‌రెడ్డి




హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి నిధులిస్తే.. తెలంగాణకు (మీకు) వచ్చిన ఇబ్బందేమిటి? అని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నిలదీశారు. తెలంగాణకు ఏం చేయాలో బీజేపీకి బాగా తెలుసు అని పేర్కొన్నారు. తెలంగాణలో తమకు 35 శాతం ఓట్లు వచ్చాయని తెలిసి జీర్ణించుకోలేక కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ పదమే బహిష్కరించారని రేవంత్ అనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణకు బడ్జెట్‌లో కేంద్రం నిధులు ఇవ్వలేదని ప్రజలను తప్పుదారి పట్టించేవిధంగా, చెప్పుగొట్టే విధంగా ఇవాళ రేవంత్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ కలిసి రావాలి.. కలిసి దీక్షచేద్దాం.. వద్దుదో..తెలంగాణకు నిధులు తెస్తుదో అని బ్లాక్‌మెయిలింగ్ పాల్పడుతున్నారని ఆరోపించారు.

సింగరేణిని ప్రైవేటీకరించం

తెలంగాణలోని సింగరేణి కాలరీస్ కంపెనీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని కేంద్ర గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి పార్లమెంట్‌కు వెల్లడించారు. సింగరేణి బలోపేతానికి కేంద్రం కృషిచేస్తుందని చెప్పారు. బుధవారం పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఉన్న సింగరేణి.. బొగ్గు నిల్వలు తెలంగాణలోని ప్రాణహిత- గోదావరి లోయలో 350 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్నాయి.

అసెంబ్లీ తీర్మానం.. పొలిటికల్ బ్లాక్‌పేపర్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అసెంబ్లీలో కేంద్ర బడ్జెట్‌పై చేసిన తీర్మానం పొలిటికల్ బ్లాక్ పేపర్ తప్ప మరొకటి కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపారని నిరసిస్తూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమని బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు.



> కేసీఆర్‌ను దీక్షకు రమ్మంటున్నారు.. ఆయన ఆనాడే తెలంగాణను చావునోట్లో తలపెట్టి తెచ్చిండు. కేసీఆర్ దర్కారెందుకు? నువ్ సెప్.. నీకు వెయ్యి మందిని రక్షణ కవచంగా ఉంటాం. మా ఎమ్మెల్యేలందరం వచ్చి మీ చుట్టూ రక్షణగా ఉంటాం. మీరు, మీ క్యాబినెట్ దీక్ష చేయండి.
>
> -బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

గుండు సున్నాపై సమరభేరి

➤ మొదటిపేజీ తరువాయి...

బీజేపీ... సభ నుంచి వాకౌట్ చేసింది. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ సభ్యుల మధ్య వాడి వేడి చర్చ జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సభ్యులు కే తారకరామారావు, హరీశ్‌రావు మధ్య మాటల తూటాలు పేలిపోయాయి. ప్రధాని మోదీని బడేభాయ్ అని పిలిచినా ఏమాత్రం ఫలితం దక్కలేదని కేటీఆర్ వ్యంగాస్త్రం సంధించారు. తెలంగాణ పట్ల కేంద్రం ప్రదర్శిస్తున్న వివక్షపై పదేండ్లుగా తాము పోరాడుతున్నామని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి తత్వం బోధ పడిందంటూ చురకలేశారు. కేంద్రం నుంచి నిధులు సాధించాలంటే.. ప్రొఫెసర్ జయశంకర్ చెప్పినట్టు యాచిస్తే రాదు.. శాసిస్తేనే వస్తది అని కుండ బద్దలు కొట్టారు. నిధుల సాధనకు ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీలో దీక్ష చేయాలని కేటీఆర్ సూచించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. 'మీరు ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను తీసుకొని రండి... నేను, ఆయన కలిసి ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ప్రాణాలు పోయే దాకా దీక్షలు చేస్తాం. తెలంగాణకు నిధులు తెచ్చుడో.. సచ్చుడో తేల్చుకుందాం' అంటూ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ సభ్యులు భగ్గుమన్నారు. సీఎం వ్యాఖ్యలకు సమాధానం చెప్తామని, తమకు మైక్ ఇవ్వాలని హరీశ్‌రావు, కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి పట్టుబట్టారు. పోడియం వద్దకు చేరి ముక్తకంఠంతో నినదించారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో మళ్లీ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కలుగజేసుకుని సీఎం వ్యాఖ్యలను సమర్థించే ప్రయత్నం చేశారు. దీంతో బీఆర్‌ఎస్ సభ్యులు 'షేమ్ షేమ్' అంటూ నినాదాలు చేశారు. దీంతో సభ రసాభాసగా మారింది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను చేతులు జోడించి దండం పెడుతూ మైక్ ఇవ్వాలని వేడుకున్నారు. భట్టి మాట్లాడిన తర్వాత మైక్ ఇస్తామని స్పీకర్ హామీ ఇవ్వడంతో ఎవరి స్థానాల్లో వారు కూర్చున్నారు. భట్టి మాట్లాడిన అనంతరం హరీశ్‌రావుకు స్పీకర్ అనుమతిచ్చారు. దీంతో హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని, దానిపై తీర్మానం ప్రవేశపెడితే దానిని ఏకగ్రీవంగా ఆమోదించడానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం. ఢిల్లీకి అఖిలపక్షంగా వెళ్లి ధర్నా చేద్దామంటే మేము కూడా సిద్ధం. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా ఎలాంటి పోరాటానికైనా బీఆర్‌ఎస్ సిద్ధంగా ఉన్నది.. ఉంటది' అని స్పష్టంచేశారు. 'కేసీఆర్‌ను దీక్షకు రమ్మంటున్నారు.. కేసీఆర్ ఎందుకు? నువ్ చెప్.. నీకు వెయ్యి మందిమి రక్షణ కవచంగా ఉంటాం.' అని హరీశ్ అంటుండగానే మరోసారి మైక్ కట్ చేశారు. సభా నేత వ్యాఖ్యలను స్పీకర్ సమర్థిస్తూ ఆ వ్యాఖ్యల్లో ఎలాంటి తప్పు లేదన్నారు.

> **అన్నీ మేమే చేస్తే.. మీరెందుకు?**
>
> 'రుణమాఫీ' గురించి ఆ మధ్య సీఎం మాట్లాడుతూ.. హరీశ్‌రావు దీక్షలు చేయాలన్నారు. నిరుద్యోగుల గురించి కేటీఆర్ దీక్షలు చేయాలన్నారు. అన్నీ మేమే చేస్తే.. ఇక మీరేం చేస్తారు? మాది ఉద్యమస్ఫూర్తి. తెలుగుదేశం తరఫున ఎమ్మెల్యేగా ఉన్న మిమ్మల్ని ఆనాడు రాజీనామా చేయమంటే పారిపోయిన చరిత్ర మీది. ఆనాడు రాహుల్ గాంధీని వచ్చు అన్నావ్.. నేడు సీఎం అయ్యాక అంటున్నవ్..' అని అంటుండగానే మైక్ కట్ చేశారు. వెంటనే మంత్రి శ్రీధర్‌బాబు కలుగజేసుకొని అందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేసేందుకు సహకరించాలని కోరారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'మాకొక ట్రాక్ రికార్డు ఉన్నది. మా నాయకుడు చెప్తే రెండుసార్లు గడ్డిపోచల్లాగా మా పదవులను వదిలివేసినం. ఎమ్మెల్యే పదవికి, మంత్రి పదవికి రాజీనామా చేసిన చరిత్ర మాది. మీరు ఈ రకంగా మా ఉద్యమ స్ఫూర్తిని అవమానపర్చిన మాటలను సభ రికార్డుల నుంచి తొలగించాలి' అని డిమాండ్ చేశారు.


తొలి నుంచి కేంద్రం తీరని అన్యాయం : మాజిద్ హుస్సేన్




హైదరాబాద్, జూలై 24(నమస్తే తెలంగాణ): కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తొలి నుంచి తెలంగాణకు తీరని అన్యాయం చేస్తూనే ఉన్నదని ఎంఐఎం సభ్యుడు మాజిద్ హుస్సేన్ ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానంపై మాట్లాడారు. తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటా రావడం లేదని పేర్కొన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలు కూడా అమలుకు నోచుకోవడంలేదని తెలిపారు. కోల్ బ్లాక్‌లను ప్రైవేటుపరం చేసి తెలంగాణకు ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని కోరారు. విద్యుత్తు ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమని, నిర్వహణ బాధ్యతలను అదానీ సంస్థకు అప్పగించినట్టు వస్తున్న వార్తలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

మూసీ ప్రాజెక్టు భారీ కుంభకోణం

- ఏటీఎంలా మార్చుకునేందుకు ప్రభుత్వ యత్నం
- బీజేపీ శాసనసభా పక్ష నాయకుడు మహేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 24(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అతిపెద్ద కుంభకోణమని బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. 1.50 లక్షల కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టి దీన్ని ఏటీఎంలా మార్చుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ విషపూరితం అనడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ఏపీ రాజధాని నిర్మాణం కోసం రూ.15,000 కోట్లు కేటాయించడంపై అక్కసుతో తీర్మానం ప్రవేశపెట్టడం సరికాదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఫెడరల్ స్ఫూర్తిపై అవగాహన లేదని తెలిపారు. అమృత్ పథకం కింద కేంద్రం ఇచ్చిన 3,500 కోట్లను అస్మదీయ గుత్తేదార్లు పంచుకున్నారని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



నేడు రాష్ట్ర బడ్జెట్


హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బడ్జెట్‌ను నేడు ప్రవేశపెట్టనున్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు 2024-25 ఆర్థిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలిలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్‌ను ఆమోదించడానికి ఉదయం 9 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో క్యాబినెట్ సమావేశంకానుంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరిలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. నాలుగు నెలల కాలానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, జూలై నెలాఖరుతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సమయం ముగియనుంది. దీంతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు.

2వరకు అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సమావేశాలను మరో రెండు రోజులు పొడిగించాలని నిర్ణయించారు. బీఏసీ సమావేశంలో ఈనెల 31 వరకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినా, ప్రతిపక్ష పార్టీ బీఆర్‌ఎస్ ఒత్తిడితో మరో రెండు రోజులపాటు సభను నిర్వహించాలని నిర్ణయానికి వచ్చినట్టుగా సమాచారం. ఆగస్టు 1, 2న కూడా సభను నిర్వహించాలని నిర్ణయించారు. రైతు భరోసా, రుణమాఫీ, స్కిల్ యూనివర్సిటీ, ఎడ్యుకేషన్ కమిషన్, వ్యవసాయ కమిషన్ తదితర వాటికి సభ ఆమోదం తెలపాల్సి ఉంది. దీంతో సభను మరో రెండు రోజులు పొడిగించినట్టుగా తెలిసింది. అసెంబ్లీతో పాటుగా శాసనమండలి సమావేశాలు కూడా రెండు రోజులు జరగనున్నాయి.

ఆర్టీసీ విలీనం ఎప్పుడు..?

- యూనియన్లను ఎప్పుడు పునరుద్ధరిస్తారు?
- 300 కోట్ల చెక్కు ఇంకా బస్సుభవన్ చేరలేదు
- ప్రభుత్వానికి మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నలు
- రాజకీయ విమర్శలకు దిగిన మంత్రి పొన్నం
- సర్కారు తీరుపై బీఆర్‌ఎస్ శాసనసభ్యుల నిరసన
- పోడియంలోకి దూసుకెళ్లిన గులాబీ పార్టీ నేతలు



హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీశారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్టీసీపై ప్రశ్నలు సంధించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా విలీనం చేస్తూ అపాయింటెడ్ డే ఎప్పుడు ప్రకటిస్తారు? ఆ ప్రక్రియ ఎందుకు జాప్యమవుతున్నది? ఎప్పటిలోగా అమలుచేస్తారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని, యూనియన్లను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటికే 8 నెలలు గడుస్తున్నా ఆ దిశగా ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టలేదని నిలదీశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆర్టీసీ, సిబ్బంది సంక్షేమంపై ఇచ్చిన హామీలను సభలో చదివి వినిపించారు. పీఆర్సీ పరిధిలోకి టీఎస్‌ఆర్టీసీ కార్మికులను చేరుస్తామని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు కల్పిస్తామని, ఆర్టీసీ బస్సులను ఆధునీకరించి విస్తరిస్తామని, ఆధునాతన సౌకర్యాలతో కొత్త సర్వీసులను ప్రారంభిస్తామని, ఆర్టీసీని యూనియన్ పునరుద్ధరణకు అనుమతిస్తామని కాంగ్రెస్ హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా ఏ రోజు నుంచి ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారో కచ్చితంగా ఆ తేదీని సభ ద్వారా ఆర్టీసీ కార్మికులకు చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

5 నెలలైనా డమ్మీ చెక్కు నెక్లెస్‌రోడ్ దాటలే!

ఆర్టీసీలో చనిపోయిన కార్మికుల కుటుంబీకులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కారుణ్య నియామకం కింద వెంటనే పర్మినెంట్ ఉద్యోగం కల్పించేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కన్సాలిడేటెడ్ పే రూ.15 వేలకు మూడేండ్లు ఉద్యోగం చేయించుకొని ఆ తర్వాత పర్మినెంట్ చేస్తామని చెప్తున్నదని, ఇది చనిపోయిన కార్మికులకు అన్యాయం చేయడమేనని హరీశ్‌రావు మండిపడ్డారు. గత ప్రభుత్వం కొనుగోలు చేసిన నూతన బస్సులను ప్రస్తుత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిందని, ఆ సందర్భంగా ఒక రూ.300 కోట్ల డమ్మీ చెక్కును చూపిస్తూ ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ బకాయిలను విడుదల చేస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటిస్తూ ఫొటోలు దిగారని, దాదాపు ఐదు నెలలు దాటుతున్నా ఆ చెక్కు నెక్లెస్ రోడ్ దాటి బస్సు భవన్‌కు చేరలేదని ఎద్దేవా చేశారు. గతంలో తమ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు 43 శాతం ఫిట్మెంట్, ఆర్టీసీ కార్మికులకు 44 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామని, బడ్జెట్‌లో వేల కోట్లు పెట్టి ఆర్టీసీని కాపాడామని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులపై పనిభారం..

మహాలక్ష్మి పథకానికి సంబంధించిన నిధులను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. మహాలక్ష్మి పథకం తర్వాత పనిభారం పెరిగిందని, సరిపడా సిబ్బందిని నియమించకపోవడం వల్ల ఉన్న కార్మికులే 16 గంటలు, 18 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వస్తున్నదని, ఫలితంగా పని ఒత్తిడి కిలోనే వందల మంది చనిపోతున్న మాట వాస్తవమా కాదా? అని నిలదీశారు. పనిభారానికి తగిన విధంగా కండక్టర్లు, డ్రైవర్లను ఎప్పటిలోగా నియమిస్తారని ప్రశ్నించారు.

సమాధానం చెప్పకుండా పొన్నం ఎదురుదాడి

మాజీ మంత్రి హరీశ్‌రావు అడిగిన ప్రశ్నలకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూటిగా సమాధానం చెప్పకుండా రాజకీయ విమర్శలకు దిగారు. ఆర్టీసీని బీఆర్‌ఎస్ ప్రభుత్వమే నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఆర్టీసీ విలీనంపై ప్రక్రియ చేపట్టిందని, ప్రస్తుతం ఆ అంశం తమ పరిశీలనలో ఉన్నదని, ఎలాంటి జాప్యం జరగడం లేదని బదులిచ్చారు. పదేండ్లలో ఒక్క బస్సు కూడా కొనలేదని, తాము అధికారంలోకి రాగానే కొత్త బస్సులు కొన్నామని చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.300 కోట్లు కేటాయిస్తున్నామని, ఇప్పటికే 70 కోట్ల మంది మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా, అందుకు సంబంధించి రూ.2400 కోట్లను ఆర్టీసీకి చెల్లించామని తెలిపారు. కారుణ్య నియామకాల ఉద్యోగాలు ఇస్తున్నామని, ఆర్టీసీ తార్నాక హాస్పిటల్‌లో ఆధునాతన వసతులు కల్పిస్తున్నామని, 3035 ఉద్యోగాలకు నియామకాలు చేపడుతున్నామని చెప్పారు. సిబ్బందికి పనిభారం పెరిగిన మాట వాస్తవమేనని, అయితే 8 గంటల తర్వాత కూడా పనిచేసే వారికి డబుల్ పేమెంట్ చెల్లిస్తున్నామని వెల్లడించారు. అన్ని అంశాలపై స్పందించిన మంత్రి ఆర్టీసీ యూనియన్ పునరుద్ధరణ అంశాన్ని ఊసెత్తకుండానే ముగించారు.

దివంగత ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో సంతాపం

హైదరాబాద్, జూలై24 (నమస్తే తెలంగాణ): ఇటీవల కన్నుమూసిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలకు బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో సభ్యులు సంతాపం తెలిపారు. చెన్నూరు, నాంపల్లి, నిజామాబాద్ (అర్బన్) మాజీ ఎమ్మెల్యేలు దివంగత నెమురుగొమ్ముల సుధాకర్‌రావు, మహమ్మద్ విరాసత్ రసూల్‌ఖాన్, డీ శ్రీనివాస్ మృతికి సంతాపం ప్రకటించారు. వారి సేవలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొనియాడారు. సభ్యులందరూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

తెలంగాణకు తిరిగివ్వకుంటే పోరాటమే

- ఇక్కడి రక్తంలోనే ఉద్యమ స్ఫూర్తి
- సీపీఐ నేత సాంబశివరావు



హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఆవిర్భావం నుంచే కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై కక్షగట్టిందని, తెలంగాణ నుంచి లక్షల కోట్ల నిధులు తీసుకుంటున్న కేంద్రం, కనీసం వేలకోట్లు కూడా తిరిగి తెలంగాణకు ఇవ్వడం లేదని సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు సభలో ఆగ్రహం వ్యక్తంచేశారు. మనం రాష్ట్రాలుగా ముక్కలవుతున్నప్పుడు కేంద్రం కూడా ఆదేస్ఫూర్తితో రాష్ట్రాలకు నిధులివ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణపై కేంద్రం కక్ష సాధింపు ధోరణిని పోరాటాల ద్వారానే అడ్డుకోవాలని చెప్పారు. తిరుగుబాటు చేయకుండే మన నిధులు మనకు వచ్చే పరిస్థితి లేదని, పోరాటమనేది తెలంగాణ రక్తంలోనే ఉన్నదని చెప్పారు. రావాల్సిన నిధుల కోసం ఢిల్లీలో ధర్నా చేయడం మంచి సంకేతమని, ఇప్పటికైనా కేంద్రం కండ్లు తెరిచి తెలంగాణకు నిధులివ్వాలని డిమాండ్ చేశారు.

'బ్యాక్‌బెంచ్'పై ఆసక్తికర చర్చ

హైదరాబాద్, జూలై24 (నమస్తే తెలంగాణ): శాసనసభలో ఆసక్తికర చర్చ జరిగింది. ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి ఫిరాయించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, దానం నాగేందర్, కడి యం శ్రీహరితో పాటు ఇతర ఎమ్మెల్యేలు శాసనసభలో వెనుక బెంచీలో, ఎంఐఎం ఎమ్మెల్యేల సరసన కూర్చున్నారు. దీనిపై సభ్యులతోపాటు, మీడియా వర్గాల్లోనూ 'బ్యాక్ బెంచ్' అంటూ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలనే చూస్తూ సభ్యులు ఇలా చర్చించుకోవడం గమనార్హం.

మీడియా పాయింట్

- **చెరో 8 సీట్లు గెలిచి 8 పైసలు తీసుకురాలే :ఎమ్మెల్యే కేపీ**

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం నుంచి చెరో 8 స్థానాల్లో గెలిచిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు 8 పైసలు తీసుకురాలేదని కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద విమర్శించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేంద్రం నిధులు ఇవ్వకున్నా స్వశక్తితో తెలంగాణను కేసీఆర్ అభివృద్ధి చేశారని గుర్తుచేశారు.

- **తెలంగాణకు తీవ్ర అన్యాయం: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి**

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి రూ.15 వేల కోట్లు ఇచ్చి తెలంగాణకు రూపాయి ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణకు శ్రీరామరక్ష అని మరోసారి రుజువైందని చెప్పారు.

- **రైతుభరోసా ఇస్తారా? లేదా ?: ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి**

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీజన్ ప్రారంభంలోనే రైతుల ఖాతాల్లో రైతుబంధు జమచేసేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి గుర్తుచేశారు. కలుపు తీయడానికి వచ్చినా రైతుభరోసా ఇవ్వలేదని మండిపడ్డారు.

- **కేంద్రంపై కక్ష బహిర్గతం: ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి**

కేంద్ర ప్రభుత్వంపై ప్రధాన ప్రతిపక్షం, పాలకపక్షం కక్ష సభలో బయటపడ్డదని ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి తెలిపారు. ఇది వికసిత భారత్ బడ్జెట్ అని పేర్కొన్నారు. అన్ని అంశాలు ప్రధాని మోదీ దృష్టిలో ఉన్నాయని తెలిపారు.

- **అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే: ఎమ్మెల్యే హరీశ్‌బాబు**

కాంగ్రెస్ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కేంద్ర బడ్జెట్‌పై చర్చ పెట్టిందని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఆరోపించారు. పదేండ్ల క్రితం ఆదిలాబాద్ జిల్లాలో ఒక కేంద్రీయ విద్యాలయముండేదే, కేంద్ర ప్రభుత్వం 4 మంజూరు చేసిందని చెప్పారు.

- **ఎదుగుదల ఓర్వలేక నిందలు: ఎమ్మెల్యే సూర్యనారాయణ**

రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు నిందలు వేస్తున్నారని నిజామాబాద్ అర్బన్ బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇస్తుందని, ఒక రాష్ట్రానికి మాత్రమే నిధులు ఇవ్వదని పేర్కొన్నారు.

- **హామీల అమలు కనబడటం లేదు: పాయల్ శంకర్**

కాంగ్రెస్ సర్కారు తీరు చూస్తుంటే ఆరు గ్యారెంటీలు అమలుచేసేవిధంగా కనబడటం లేదని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతతో కేంద్రంపై నిందవేయడానికి శాసనసభలో తీర్మానం చేశారని పేర్కొన్నారు.



బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలి

- లేదంటే నిరుద్యోగులకు రేవంత్ క్షమాపణ చెప్పాలి
- రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తరు?
- ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా ఎప్పుడు గుర్తిస్తరు?
- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాజీమంత్రి హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తామన్న రేవంత్‌రెడ్డి, గద్దెనెక్కిన తర్వాత మర్చిపోయారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మెగా డీఎస్సీ ప్రకటించాలని, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, యూనియన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి హరీశ్‌రావు మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల విషయం సభలో చర్చకు వచ్చినప్పుడు తాము సూటిగా ప్రశ్నలు వేసినప్పటికీ ప్రభుత్వం సమాధానం చెప్పకుండా పారిపోయిందని మండిపడ్డారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఏం చెప్పిందో, ఇప్పుడు ఏం చేస్తున్నదో ఆర్టీసీ కార్మికులు గమనిస్తున్నారని చెప్పారు. ఫిబ్రవరిలో ఆర్టీసీకి ముఖ్యమంత్రి ఇచ్చిన రూ.300 కోట్ల చెక్కు డమ్మీ అయింది. దాని సంగతి అడిగితే సమాధానం చెప్పలేదు. మహిళల ఉచిత బస్సులకు సంబంధించి ఏప్రిల్, మే నిధులు ఇవ్వలేదు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. ఎరియర్స్ , బకాయిలు ఇవ్వాలి, యూనియన్‌ను పునరుద్ధరించాలని అడిగితే ఒక్కదానికీ ప్రభుత్వం సమాధానం చెప్పలేదు. ఆర్టీసీ కార్మికుల ఓట్లతో గెలిచి నేడు వారికి వెన్నుపోటు పొడిచింది. ఆర్టీసీ కార్మికుల పక్షాన సభలో, బయట ప్రభుత్వాన్ని నిలదీస్తాం' అని హరీశ్‌రావు హెచ్చరించారు. నిరుద్యోగుల సమస్యపై మాట్లాడే అవకాశం ఇవ్వాలని వాయిదా తీర్మానం కోరితే స్పీకర్ తిరస్కరించారని ఫైరయ్యారు. అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ ఇస్తామని, పత్రికల్లో, టీవీల్లో తేదీలతో సహా యాడ్స్ ఇచ్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి ఊసరవెల్లులు సైతం సిగ్గుపడుతున్నాయని ఎద్దేవాచేశారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తమ నియోజకవర్గాలకు చెందిన ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని మండిపడ్డారు. తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి, నిరుద్యోగులపై లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి.. మెగా డీఎస్సీయా.. దగా డీఎస్సీయా.. అనే ప్లకార్డులు ప్రదర్శించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, పాడి కౌశిక్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, వివేకానంద పాల్గొన్నారు.

కాంగ్రెస్ తెచ్చిన జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం

గ్రూప్ -1 విషయంలో జీవో 55 రద్దు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పుడు మెయిన్స్‌లో 1:50 పద్ధతిలో అభ్యర్థులను పిలుస్తున్నారని, ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 1:100 పద్ధతి పాటించారని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌కు 2015లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సప్లిమెంటరీ నోటిఫికేషన్ ఇచ్చి అదనపు ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. అప్పుడు రాని సమస్యలు ఇప్పుడెందుకు వస్తాయని ప్రశ్నించారు.

ప్రశ్నోత్తరాల సమయం

జీపీలకు పక్కా భవనాలు..

- తండాల నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్లు
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూలై24 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మిస్తామని, తండాల నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్లు వేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు రాంచందర్‌నాయక్, తీర్థ అయిలయ్య, చిక్కుడు వంశీకృష్ణ పంచాయతీలుగా చేసిన తండాలెన్ని? ఎన్నింటికి రెవెన్యూ పంచాయతీలుగా చేశారు? తండాల అభివృద్ధికి తీసుకున్న చర్యలేంటి? అని ప్రశ్నించారు. సీఎం జోక్యం చేసుకుని తండాలు, గూడేలు అభివృద్ధి చెందితేనే నిజమైన అభివృద్ధి అని, తండాలు, ఆదివాసీ గూడేల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. జీపీలకు భవనాల నిర్మాణంతో పాటు ప్రతి తండా నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్లు వేస్తామని వెల్లడించారు.

200 యూనిట్లలోపు అందరికీ జీరో బిల్లు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు అందరికీ జీరో బిల్లులు అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం, విద్యుత్తు శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. బుధవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో భాగంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, డాక్టర్ వెంకట్ నర్సింగ్‌రావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో అర్హత కలిగిన వారందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తున్నట్టు తెలిపారు. అర్హత కలిగిన వారు గతంలో దరఖాస్తు చేసుకోకుంటే గ్రామీణ ప్రాంతాల వారు మండల కార్యాలయాలు, పట్టణ ప్రాంతాలవారు డివిజన్ కార్యాలయాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 200 యూనిట్లు దాటితే బిల్లు చెల్లించాల్సిందేనని వెల్లడించారు. ఈ స్కీం కోసం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,418 కోట్లు బడ్జెట్‌లో కేటాయించామని వివరించారు.

'తుమ్మిడిహట్టి'కి కట్టుబడి ఉన్నాం: ఉత్తమ్



తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, నవీన్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. సాంకేతిక నిపుణులతో మాట్లాడిన తర్వాత పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సుందిళ్ల, మేడిగడ్డ బరాజ్‌లపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. గంధమల్ల రిజర్వాయర్ అంశం సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నదని ఎమ్మెల్సీ నవీన్ ప్రస్తావించగా భూసేకరణపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. గ్రామస్థులు భూసేకరణకు సహకరిస్తే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

అర్హులకు కొత్త కార్డు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని మంత్రి ఉత్తమ్ స్పష్టంచేశారు. బీఆర్‌ఎస్ సభ్యులు వాణీదేవి, బస్వరాజు సారయ్య, దయాకర్ రెడ్డి, తాతా మధు, జీవన్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. రేషన్‌కార్డుల జారీ మార్గదర్శకాలకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

గృహజ్యోతి అర్హులందరికీ ఇండ్లు : మంత్రి పొంగులేటి



బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో 25 ద్వారా మంజూరు చేసిన 496 ఇండ్లకు గృహజ్యోతిలో రూ.3 లక్షలకు బదులు రూ.5 లక్షలు మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. శాసనమండలిలో బీఆర్‌ఎస్ సభ్యుడు తాతా మధు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో 25 ద్వారా గృహ నిర్మాణానికి రూ.3 లక్షలు కేటాయించిందని, ఆ స్కీం కింద రూ.496 ఇండ్లను మంజూరు చేసిందని తెలిపారు. ఆ జీవోను రద్దు చేస్తున్నట్టు చెప్పారు. పేదలకే ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని స్పష్టంచేశారు.

మౌలిక వసతులు కల్పిస్తున్నాం: మంత్రి సీతక్క



రూ.5 లక్షల కంటే తక్కువ వార్షికాదాయమున్న జీపీలకు అదనంగా రూ.5 లక్షలు విడుదల చేస్తూ, మౌలిక వసతులన్నీ కల్పిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్రంలో 6176 పంచాయతీలకు త్వరలో శాశ్వత భవనాలు నిర్మిస్తామని, మల్టీపర్పస్ వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాల కోసం రూ.378.88 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. 1936 లో ల్యాండ్ సర్వే చేశారని, మళ్లీ ఇప్పటివరకు చేయలేదని, ఈ నేపథ్యంలోనే చాలా జీపీలు రెవెన్యూ పంచాయతీలుగా మారలేదని, త్వరలో రెవెన్యూ శాఖతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన: మంత్రి పొన్నం



స్కూల్, కాలేజీ బస్సుల ప్రమాదాలు, ఫిట్‌నెస్ తదితర అంశాలపై సభ్యులు మల్కాన్ సింగ్ రాథోడ్, ఏవీ శ్రీనివాస్, వాకిటి శ్రీహరి అడిగి ప్రశ్నలకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిచ్చారు. రాష్ట్రంలో పాఠశాలలకు సంబంధించి 24 వేల బస్సులున్నాయని, పాఠశాలల ప్రారంభానికి నెల ముందు నుంచే ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ తప్పనిసరి చేశామని, డ్రైవర్లు, అటెండర్లందరికీ కౌన్సెలింగ్ ఇస్తున్నామని, 15ఏండ్లు దాటిన వాహనాలను స్క్రాప్ కింద తీసుకుంటున్నామని వెల్లడించారు. పాఠశాల సమయానికి ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకున్నామని, ట్రాఫిక్ రూల్స్‌పై ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా అవగాహన కల్పించేందుకు విద్యాశాఖతో సమన్వయం చేసుకుంటున్నట్టు చెప్పారు.

నాకు మంత్రి పదవి సాధ్యమే: రాజగోపాల్ రెడ్డి



హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీలో ఏదైనా సాధ్యమేనని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రివర్గంలో ఉన్నా మంత్రి పదవి అడ్డురాదని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరినప్పుడే మంత్రి పదవిపై హామీ ఇచ్చారని గుర్తుచేశారు. బుధవారం అసెంబ్లీ లాబీలో రాజగోపాల్‌రెడ్డి మీడియాతో చిట్‌ చాట్ చేశారు. ప్రతిభ, కమిట్‌మెంట్, ప్రామిస్ తోనే మంత్రి పదవి వస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీగా పనిచేశానని, ఏదో ఒక సమయంలో ముఖ్యమంత్రిని కావొచ్చని జోస్యం చెప్పారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారంలోనూ తనను హోం మంత్రి కావాలని పదే పదే అడిగారని గుర్తుచేశారు.

మండలి సమావేశాలు తొలిరోజు ప్రశాంతం

- డీఎస్‌కు అంజలి ఘటించిన మండలి
- కొత్తగా ఎన్నికైనవారిని పరిచయం చేసిన చైర్మన్

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ) : శాసనమండలి సమావేశాలు బుధవారం ఉదయం 10 గంటలకు చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. మండలికి కొత్తగా ఎన్నికైన మహేశ్ కుమార్‌గౌడ్, తీన్మార్ మల్లన్నను సభ్యులకు చైర్మన్ పరిచయం చేశారు. అనంతరం ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. గంధమల్ల రిజర్వాయర్ పనులపై సభ్యులు జీవన్‌రెడ్డి, నవీన్‌కుమార్, నర్సిరెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానమిచ్చారు. గృహజ్యోతిపై జీవన్‌రెడ్డి, తాతా మధు ప్రశ్నలకు గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమాధానం చెప్పారు. కొత్త రేషన్‌కార్డుల జారీపై సభ్యులు వాణీదేవి, జీవన్‌రెడ్డి, సారయ్య, దయాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానమిచ్చారు. రైతు భరోసా పథకంపై వాణీదేవి, శేరి సుభాష్‌రెడ్డి, తాతామధు అడిగిన ప్రశ్నలకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతుల సలహాలు, సూచనలు తీసుకొని రైతు భరోసాను పకడ్బందీగా అమలు చేస్తామని వెల్లడించారు. ఆరు గ్యారెంటీల అమలుపై వాణీదేవి అడిగిన ప్రశ్నకు సమాధానంగా కచ్చితంగా అమలు చేస్తామని, ప్రస్తుత రేషన్‌కార్డులను కొనసాగిస్తూనే అర్హులకు కొత్త కార్డులు మంజూరు చేస్తామని చెప్పారు. గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తూ జీరో బిల్లులు ఇస్తున్నామని విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్క.. సభ్యులు మహేశ్‌కుమార్ గౌడ్, వెంకట్ అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. ఉద్యోగుల డీఏల బకాయిలపై వాణీదేవి అడిగిన ప్రశ్నకు మంత్రి భట్టి సమాధానమిస్తూ త్వరలోనే డీఏ చెల్లిస్తామని చెప్పారు. మండలి మాజీ సభ్యుడు డీ శ్రీనివాస్ మృతిపై చైర్మన్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు.

ఇద్దరు ప్యానెల్ చైర్మన్ల నియామకం

శాసనమండలిలో ఇద్దరు ప్యానెల్ చైర్మన్లను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, అల్గుబెల్లి నర్సిరెడ్డిని నియమించినట్టు చెప్పారు.

చెంచులను తరలించవద్దు: గోరటి వెంకన్న

నల్లమల అటవీ ప్రాంతంలో జీవిస్తున్న చెంచులను బలవంతంగా తరలించే ప్రయత్నం చేయవద్దని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న కోరారు. యురేనియం తవ్వకాల పేరుతో నల్లమలలో చెంచుల బలవంతపు తరలింపుతో వారిలో భయాందోళన నెలకొన్నదని చెప్పారు. గతంలో నల్లమలలో యురేనియం తవ్వకాలు జరపాలని కేంద్రం నిర్ణయించగా, ప్రజాసంఘాలు, పర్యావరణ వేత్తల ఆందోళనతో విరమించుకున్నదని గుర్తుచేశారు.

వయోపరిమితి పెంచాలి : నర్సిరెడ్డి

అధ్యాపకుల కొరతతో విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు, ప్రమాణాలు పడిపోతున్నాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి చెప్పారు. విశ్వవిద్యాలయాల్లో 60 శాతం ఖాళీలున్నాయని, ప్రొఫెసర్ల వయోపరిమితిని పెంచి పరిశోధనలను ప్రోత్సహించాలని కోరారు.

ప్రొటోకాల్ పాటించకుంటే సెక్యూరిటీని వాపస్ చేస్తా : శేరి

ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల గౌరవ మర్యాదలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి చెప్పారు. బ్యూరోక్రాట్లు, సినీ ప్రముఖులు, సెలబ్రిటీలకు ప్రొటోకాల్ కల్పిస్తున్న ఎయిర్‌పోర్టు యాజమాన్యం రాష్ట్ర ప్రజాప్రతినిధుల పట్ల కనీస మర్యాద పాటించడంలేదని విమర్శించారు. జిల్లా, నియోజకవర్గాల్లోనూ అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, ఈ విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే తన సెక్యూరిటీని తిరిగిస్తానని తెలిపారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి: ఎల్.రమణ

రాష్ట్రంలోని చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్ సభ్యుడు ఎల్.రమణ కోరారు. జనవరి నుంచి జూలై వరకు 13 మంది చేనేత కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో చేనేత కార్మికుల జీవనోపాధికి కల్పించిన పథకాలను నిలిపివేయడంతో చేనేత కార్మికులు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు.

యూపీఎస్సీ తరహాలో గ్రూప్-1 చేపట్టాలి : తీన్మార్ మల్లన్న

గ్రూప్ -1 మెయిన్స్‌లో 1:50 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మహిళలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశమున్నదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చెప్పారు. ప్రభుత్వం యూపీఎస్సీ తరహాలో గ్రూప్-1 అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు.

రైతుబంధు తరహాలో వేయాలి: రఘోత్తం

రైతుబంధు తరహాలోనే రైతు భరోసా అమలు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి కోరారు. వ్యవసాయ భూమి ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులకు రైతుభరోసా వర్తించదని వస్తున్న వార్తల నేపథ్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాప్రతినిధుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నదని చెప్పారు. పాతపద్ధతిలోనే రైతు భరోసా అమలు చేయాలని కోరారు.

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

తెలంగాణపై ఆర్థిక వివక్ష

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొత్తం మీద 'హ స్తినీ హస్తే సున్నకు సున్న' దక్కింది. గత పదేండ్లుగా చూపుతూ వచ్చిన నిర్లక్ష్యమే మరోసారి వ్యక్తమైంది. ఇదొక ధోరణిగా మారింది. సుమారు గంటన్నర పాటు సాగిన ఆర్థిక మంత్రి ప్రసంగంలో కనీసం ఒక్కసారైనా తెలంగాణ పేరు వినపడలేదు. దేశ ఆర్థిక వ్యవస్థకు అందదండలు అందించడంలో ముందున్న తెలంగాణను ఎందుకో కావాలనే వెనుకకు నెడుతున్నట్టు కనిపిస్తున్నది. అయినా ఈ అన్యాయంపై రెండు జాతీయ పార్టీల తరఫున ఎని మిదేసి చొప్పున తెలంగాణ నుంచి గెలిచిన 16 మంది సభ్యులు లోక్‌సభలో గొంతు విప్పలేదు. బయటా నోరెత్తలేదు. అందులో ఇద్దరు కేంద్రమం త్రులు కూడా ఉన్నారనేది గుర్తుంచుకోవాలి. బీజేపీకి పోయినసారి కన్నా రెట్టింపు సభ్యులను ఇచ్చినా మొండిచెయ్యే దక్కిందేమిటో ఏమనుకోవాలి. బీజేపీకి తెలంగాణపై ఎందుకీ వివక్ష? చిన్న రాష్ట్రాల సమర్థకులమని చెప్పుకొనే ఆ పార్టీకి కొత్తగా ఏర్పా టైన తెలంగాణపై ఎందుకింత చిన్నచూపు? స్వాతి మాన కేతనమై రెపరెపలాడినందు కా? సత్వరమే సమున్నత సమృద్ధి సాధించినందు కా? పదేండ్లలో దేశానికి అన్నపూర్ణగా నిలిచినందుకా?

కేంద్రానికి పన్నుల రూపంలో తెలంగాణ చెల్లించినదానిలో సగం కూడా రాష్ట్రానికి తిరిగి కేంద్రం ఇవ్వడం లేదు. తెలంగాణ మీద బీజేపీకి, ఆ పార్టీ పెద్దలకు లోలోన ద్వేషం ఏదో లేకపోతే ఇలా ఎందుకు జరుగుతుందనే అనుమానం రాక మానదు. ఒక్క ఓటు రెండు రాష్ట్రాలు అని తీర్మానించి ఆపై ముఖం చాటేసిన చరిత్ర బీజేపీది. హైదరాబాద్ వంటి రాజధాని ఉన్న ప్రాంతానికి రాష్ట్రం ఎందుకు? అని ఆనాడు ఎల్‌కే అద్వానీ అన్నా.. ఈనాడు తల్లిని చంపి పిల్లను బతికించారని ప్రధాని మోదీ అంటున్నా.. సారం ఒకటే. విభజన చట్టం ప్రకారం అప్పచెప్పుల్లో ఒకరికి ఇచ్చి రెండోవా రికి ఇవ్వకపోవడం ఏం న్యాయం? అయినవా రికి ఆకుల్లో, కానివారికి కంచాల్లో వడ్డించేందుకే ఏటా బడ్జెట్ ప్రవేశపెడుతున్నట్టు అనిపిస్తున్నది. ఏపీకి అధిక నిధులు ఇస్తే తప్పు లేదు. పోలవరా నికి నిధులిస్తే దేశానికి ఆహార భద్రత ఏర్పడుతుం దని ఆర్థికమంత్రి చెప్పుకొచ్చారు. మరి దేశం లోనే అత్యధిక ధాన్యం పండించిన తెలంగాణ ఏం పాపం చేసిందో మంత్రిగారు చెప్పలేదు.

ఏపీతో పాటు బీహార్‌కూ పెద్దపీట వేయడం వల్ల నష్టం లేదు. అది వారివారి అవసరాలను బట్టి, సంకీర్ణ ఒత్తిళ్ల కారణంగా జరిగి ఉండొచ్చు. కానీ, తెలంగాణకు నిధులు ఎందుకు కేటాయించడం లేదో కేంద్రం సెలవిస్తుందా? జాతీయ పార్టీల ఎంపీలకు అధిష్ఠానాల ముందు మోకరిల్లడం తప్ప మరేమీ తెలియదు. వారికి ఢిల్లీ ప్రయోజనాలే ముఖ్యం. గల్లీ ప్రయోజనాలు పట్టవు. ఇక్కడి ప్రజల ఆశలూ, ఆకాంక్షలూ తలకెక్కవు. మోస పోయి గోసపడుతున్న ప్రజలకు ఇంటిపార్టీ ఎంత అవసరమో, ఢిల్లీలో ఇంటి పార్టీ లేకపోవడం వల్ల ఎంత నష్టమో ఇప్పుడు బాగా స్పష్టమైపోయింది. బడిగేసి, నిలదీసి కొట్లాడితే కానీ నిధులు రావు. ఆ పని బీఆర్‌ఎస్ వంటి స్వాభిమాన పక్షంతో తప్ప జాతీయ పార్టీలతో సాధ్యం కాదు.

హరీశ్ సవాల్.. రేవంత్ సెల్ఫ్‌గోల్



తెలంగాణ విజయ్

అధికారం కోసమో, అధిపత్యం కోసమో అబద్ధాలాడేందుకు వెనుకాడట్లేదు నేటి పాలకులు. గొప్పల కోసం అలవికాని హామీలు, అబద్ధపు వాగ్దానాలతో గద్దెనెక్కి తీరా అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేస్తున్నారు. 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్నట్టుగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సర్కార్ తీరును చూస్తుంటే పురాణాల్లోని ఒక సంఘటన యాదికొస్తున్నది. భస్మాసురుడు అనే రాక్షసుడు శివభక్తుడు. శివుడి మెప్పు కోసం అతను చాలా కాలం పాటు తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చిన శివుడు ప్రత్యక్షమయ్యాడు. ఏం వరం కావాలో కోరుకోమని చెప్పాడు. దీంతో అతను 'తాను ఎవరి తలపై చేయిపెడితే వారు బూడిదైపోయే' వరాన్ని ప్రసాదించాలని శివుడిని కోరుకుంటాడు. అందుకు సమ్మతించిన శివుడు అతను కోరుకున్నట్టే వరం ప్రసాదిస్తాడు. అయితే 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్నట్టుగా భస్మాసురుడు వరమిచ్చిన శివుడి తలపైనే చెయ్యి పెట్టాలని ప్రయత్నిస్తాడు. దీంతో విష్ణుమూర్తి సహాయాన్ని శివుడు కోరుతాడు. మాయవేషంలో ఆ రాక్షసుడి వద్దకు వెళ్లిన విష్ణువు అతని తలపైనే చెయ్యి పెట్టుకునేలా చేస్తాడు. దీంతో భస్మాసురుడు అంతమైపోతాడు.



అర్థం ఇలాంటి ఘటన కలియుగం లోనూ జరిగిందంటే నమ్ముతారా? తప్పదు, నమ్మాల్సిందే. మాజీ మంత్రి హరీశ్ రావు గీసిన పద్మవ్యూహంలో కాంగ్రెస్ ప్రభు త్వం చిక్కుకున్నది. అలవికాని అబద్ధపు హామీ లు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పరిపాలన చేతకాక ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీపై బురదజల్లడంపైనే దృష్టిపెట్టింది. ప్రజలు నష్టపో తున్నారని భావించిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు.. సీఎం రేవంత్‌కు సవాల్ విసి రారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారం టీలు, 13 హామీలతో పాటు రూ.2 లక్షల రుణ మాఫీని ఒకేసారి పూర్తిచేస్తే తన ఎమ్మెల్యే పద వికి రాజీనామా చేస్తా'నని ప్రకటించారు. రాజీ నామా లేఖను సైతం సిద్ధం చేసుకున్నారు.

ఇక్కడే అసలు కథ మొదలైంది. ఆలోచన తక్కువ, ఆవేశం ఎక్కువున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆగమాగమైపోయి హరీశ్‌రావు ట్రాప్‌లో పడ్డారు. 6 గ్యారంటీలు, 13 హామీలను మర్చి పోయి, వాటికి సమకూర్చాల్సిన నిధులను దారి మళ్లించి.. రైతు రుణమాఫీ చేస్తానని ప్రతి సవాల్ విసిరారు. ఇటీవల రూ.6,098 కోట్ల నిధులను విడుదల చేసి సంబురాలు చేసుకు న్నారు. రుణమాఫీ పూర్తయిపోయిందంటూ 'హరీశ్‌రావు రాజీనామా చెయ్' అని రేవం తితో పాటు కాంగ్రెస్ శ్రేణులు మాట్లాడుతు న్నారు. కానీ, అసలు హరీశ్‌రావు విసిరిన సవాల్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ మాఫీ పూర్తి చేస్తే కదా ఆయన రాజీనామా చేయడానికి? హరీశ్‌రావు సవాల్ కారణంగానే కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, 13 హామీలను ఇప్పుడు అమలుచేయక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. అది సాధ్యం కావాలంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరిస్తుందా? అంటే చెప్ప లేని పరిస్థితి. హరీశ్‌రావు సవాల్ కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇరకాటంలో పడిపో యింది. దాంతో రుణమాఫీ అస్తవ్యస్తంగా మారిపోయింది. భస్మాసురుడు తన తలపై తాను చేయిపెట్టి అంతమైనట్టుగా.. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తన గొయ్యిని తానే తవ్వు కున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

హరీశ్ గీసిన ఉచ్చులో రేవంత్‌రెడ్డి నేతృ త్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చిక్కుకున్నది. ఇప్పుడు ఆ పార్టీ పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైంది. హరీశ్‌రావు సవాల్ విసిరినప్పుడు అందులో ఏ మర్మం దాగున్నదోనని రేవంత్ రెడ్డి ఒక్కసారైనా ఆలో చించారా? హరీశ్‌రావు సుదీర్ఘ అనుభవం కల నాయకుడు. కేసీఆర్ నాయకత్వంలో రాటుదే లిన వ్యక్తి. ప్రత్యర్థి ఎత్తులను చిత్తు చేయ టంలో ఆయన దిట్ట. తెలంగాణ ట్రబుల్ షూటర్‌గా ఆయనను పిలుస్తారు. అంతకు మించి అతను రాష్ట్ర ఆర్థికమంత్రిగా పనిచేసిన వ్యక్తి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్షుణ్ణంగా తెలిసిన వ్యక్తి. ఆర్థిక వ్యవహారాలను, పథకాల సాధ్యా సాధ్యాలను దగ్గరుండి చూసిన వ్యక్తి. అతను సవాల్ విసురుతున్నాడంటే ఎంత ఆలోచించి విసురుతాడో అర్థం చేసుకోవాల్సిన సీఎం రేవంత్ ఆత్మవిశ్వాసానికి పోయి బొక్క బోర్లా పడ్డారు.

కాంగ్రెస్‌ను తన ట్రాప్‌లో పడేయడంలో హరీశ్ విజయవంతమయ్యారని ఘంటాపథంగా చెప్పవచ్చు. హరీశ్ విసిరిన సవాల్ వెన కున్న అంతర్యం అర్థం కాక రేవంత్‌రెడ్డి కప్ప తీసి చేసుకు ప్రమాణాలు చేస్తూ పోయారు. నిజానికి రేవంత్ ప్రభుత్వం రైతు రుణమాఫీ పూర్తి చేయాలంటే సుమారుగా రూ.40-50 వేల కోట్లు అవసరం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటి దఫా రూ.లక్షలోపు మాఫీ కోసం రూ.19 వేల కోట్ల నిధులను కేటాయిం చింది. కానీ, నేడు రేవంత్ ప్రభుత్వం రూ.6,098 కోట్ల నిధులను మాత్రమే రూ.లక్ష లోపు రుణమాఫీ కోసం విడుదల చేసినట్టు ప్రకటించింది. అసలు విడుదల చేసిందెంత, ఎంతమంది ఖాతాల్లో నగదు జమ అయిందో ఇప్పటికీ స్పష్టత లేదు. మరి ఇంత తక్కువ నిధులతో రూ.లక్షలోపు రుణమాఫీ ఎలా సాధ్యమవుతుంది? అసలు రేవంత్ రెడ్డికి ఏ ఆర్థిక నిపుణుడు ఈ సలహా ఇచ్చారో?

దీని ప్రభావం రానున్న రెండు నెలల్లో రాష్ట్రంపై పడనున్నది. కళ్యాణలక్ష్మి, ఆసరా పింఛన్ల వంటి సంక్షేమ పథకాలకు పంగనా మాలు పెట్టి, ఇతర ప్రభుత్వ అభివృద్ధి కార్య క్రమాలను కొనసాగించలేకపోవడంతో ప్రజలు రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి తలెత్తుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. నిర్మాణ రంగం స్తంభించింది. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన నిర్మాణరంగ కార్మికులు స్వస్థ లాలకు తిరిగి వెళ్తున్నారు. సాగుకు సరిగా కరెంట్ ఇవ్వటం లేదు. యాసంగిలో నీళ్లివ్వక పోవడంతో పంటలు ఎండిపోయాయి. బోనస్ కాస్త బోగస్‌గా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని చేష్టల వల్ల రాష్ట్ర రైతాంగం, సామాన్య ప్రజానీకం విలవిలలా డుతున్నారు.

పరిపాలనా వైఫల్యం, పథకాల అమలు సాధ్యాసాధ్యాలపై మాజీ మంత్రి హరీశ్‌రా వుకు సుదీర్ఘ అనుభవం ఉన్నది. ఆ అనుభవ నతోనే ఆయన సవాల్ విసిరారు. హరీశ్ సవాల్‌ను ఆవేశంతో స్వీకరించిన రేవంత్ ఆయన ట్రాప్‌లో పడ్డారు. ఇలాంటి ఒక అని వార్య పరిస్థితిని హరీశ్‌రావు కల్పించినప్ప టికీ 6 గ్యారంటీల అమలు, 13 హామీల అమలు, సంపూర్ణ రుణమాఫీ చేయడం అసాధ్యమని ఆర్థికరంగ నిపుణులు అంటు న్నారు. హరీశ్ సవాల్ విషయంలో రేవంత్ రెడ్డి తొందరపడ్డారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెవులు కొరుక్కుంటున్నారు. ఏదేమైనా ప్రత్యర్థుల ఎత్తులను చిత్తుచేయ టంలో దిట్ట అయిన ట్రబుల్ షూటర్ మరో మారు తన మార్కును చాటుకొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టారని ప్రజ లు, రైతులు చర్చించుకుంటున్నారు.

సొంత మెజారిటీ లేకున్నా తగ్గని దూకుడు



నాంచారయ్య మెరుగుమాల

పద్దెనిమిదో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ బలం 303 నుంచి 240 సీట్లకు తగ్గి పోవడంతో ఇకపై పాలకపక్షం 'హిందుత్వ దూకుడు' మందగిస్తుందని రాజకీయ పండి తులు విశ్లేషించారు. ఇక ప్రతిపక్షాలతో 'సహ కార, సర్దుకుపోయే వైఖరిని' అవలంబిస్తుందని దేశంలో ఎందరో ఆశించారు. అయితే, ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు గత రెండున్నర మాసాలుగా తీసుకున్న నిర్ణయాలు, ఉత్తరాది రాష్ట్రాల బీజేపీ ప్రభుత్వాల తాజా విధానాలు పరిశీలిస్తే.. వారు వేసిన అంచనాలు తప్పని స్పష్టమవుతున్నది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రధాని ప్రకటనలను గాని, సర్కారు తీసుకున్న నిర్ణయాలను గాని పరిశీ లిస్తే ఈ విషయం అర్థమవుతుంది.

సొంత బలం లేకున్నా బీజేపీ ప్రభుత్వం, కేంద్ర నాయకత్వం ఏకపక్షంగా, 'హిందుత్వవ క్షం'గా వ్యవహరిస్తోందనడానికి రెండు ఉదా హరణలు చాలు. దాదాపు 60 ఏండ్లుగా ప్రశాంతంగా సాగుతున్న రెండు వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తోం దని మనకు స్పష్టమవుతోంది. ఉత్తరాఖండ్ లోని గంగా నది నుంచి వేలాది మంది హిందు వులు కావడి యాత్ర (కన్వర్ యాత్ర) పేరుతో ఏటా శ్రావణ మాసంలో కొంత మొత్తంలో నీటిని తీసుకుని సొంతూళ్లకు పెద్దలు కాళ్లతో బయల్దేరతారు. ఈ యాత్ర మార్గంలో ఉత్తరా ఖండ్, యూపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో రోడ్లకు ఇరువైపులా ఉండే హోటళ్ల యజమానుల పేర్లను ప్రదర్శించాలని ఆయా బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీచేశాయి. మార్గంలో వచ్చే పశ్చిమ యూపీ జిల్లాల్లో ముస్లిం జనాభా ఎక్కువ. అక్కడ హోటళ్ల యజమానుల్లో అత్యధికులు ముస్లింలే. రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వులు రాగానే ఈ హోటళ్ల యజమానులు తమ పేర్లను రాసి బోర్డులు పెట్టారు. ముస్లిం యజమానుల పేర్లు చూసి హిందువులైన కావడి యాత్రికులు ఆ హోటళ్ల లో తినకుండా పోవాలనేదే పాలకపక్షం లక్ష్యం. తద్వారా ముస్లిం వ్యాపారులు నష్టపోయి, హిందువులపై ద్వేషం పెంచుకుంటే బీజేపీకి లాభమనేది పాలకుల అంచనా.

ఈ కావడి యాత్ర సమయంలో చాలా వరకు ఈ ఉత్తరాది హోటళ్లలో శాఖాహార భోజనమే విక్రయిస్తారు. ఎన్నో దశాబ్దాలుగా యజమానుల పేర్లున్న బోర్డులు లేకున్నా కావడి యాత్రికులు వాటిలో భోజనం చేస్తున్న పుడు.. 2024లో మాత్రం కొత్త నిబంధన అవసరం ఏమొచ్చింది?

అయితే ఈ ఏడాది పార్లమెంటు ఎన్నికల్లో అనేక ఉత్తరాది రాష్ట్రాల్లోని ఓటర్లలో 'హిందు వులు, ముస్లింలు' అనే స్పృహ అనుకున్నంత రాలేదు. పూర్వపు మత విద్వేషాలు మరచి, స్థానిక సమస్యల ఆధారంగానే ప్రజలు బీజే పీని ఓడించారు.

ఈ ఏడాది, వచ్చే సంవత్సరం అనేక పశ్చిమ, ఉత్తరాది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్ని కలు జరుగనున్నాయి. ఈ కారణంగా దేశంలో మతవిద్వేషాలు, ముస్లిం వ్యతిరే కత పెంచే ఎత్తుగడల్లో భాగంగా కావడి యాత్ర సందర్భంగా బీజేపీ ఎన్నడూ లేని అడ్డగోలు ఉత్తర్వులను అమలు చేయా లని చూస్తున్నది. అయితే, ఈ ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో తాత్కాలి కంగా బ్రేక్ పడింది.

బీజేపీ ప్రభుత్వాల ఉత్తర్వులను ఎన్డీయే భాగ స్వాములైన జేడీయూ, ఎల్జేపీ, ఆర్ఎల్డీ తప్పుబట్టాయి. కేంద్ర సర్కారు మనుగడ లోక్ మిత్రపక్షాలపై ఆధారపడి ఉన్నప్పటికీ బీజేపీ తన హిందుత్వ పోకడను తగ్గించుకుంటా మరింతగా పెంచడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది.



పార్లమెంట్ ఎన్నికల్లో యూపీలో బీజేపీ ఘోర పరాభవం ఆ రాష్ట్ర సీఎం యోగి ఆది త్యనాథ్‌కు, మంత్రులతో కూడిన అనుమానిత ధ్యానికి మధ్య వివాదాలు తారస్థాయికి చేరాయి. ఈ కీచులాటలు సద్దుమణిగేలా చేయాలని బీజేపీ కేంద్ర నాయకత్వం ఆర్ఎస్ఎస్‌ను ఆశ్రయించింది. అయితే, బీజేపీ పోకడలపై అనేక విషయాల్లో అభ్యంతరాలున్న ఆర్ఎస్ ఎస్‌కు యూపీ సంక్షోభంలో శాంతిదూతగా పనిచేయడం ఇష్టం లేదు. అందుకే లక్నోలో జరగాల్సిన సమన్వయ సమావేశాన్ని కూడా ఆర్ఎస్ఎస్ రద్దు చేసుకుంది. ఈ నేపథ్యంలో సంఘ్ అగ్రనాయకులను శాంతింపచేసే వ్యూహంలో భాగంగా ఆర్ఎస్ఎస్ కార్యకలా పాల్లో కేంద్ర సిబ్బంది పాల్గొనడానికి మార్గం సుగమం చేస్తూ జూలై 9న బీజేపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగుల ప్రవర్త నను నియంత్రించే నిబంధనలను సవరిస్తూ ఆఫీస్ మెమొరాండం రూపంలో ఉత్తర్వులు విడుదల చేసింది. ఆర్ఎస్ఎస్‌ను సాంస్కృతిక సంస్థగానే బీజేపీ అభివర్ణిస్తుంది. అందుకే తాజా ఉత్తర్వులు సబబేనని బీజేపీ మంత్రులు వాదిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని నిషేధించిన దానికి సంబంధించి 1966, 1970, 1980లలో జారీ అయిన ఆఫీస్ మెమొరాం డంల నుంచి ఆర్ఎస్ఎస్ పేరు తొలగిస్తున్నట్లు ఆదేశం కేంద్రం తెలిపింది.

అయితే 'ఈసారి ఎన్నికల్లో బీజేపీకి 400కి మించి సీట్లు ఇవ్వండి' (అబ్ కీ బార్ చార్ సౌ పార్) అనే నినాదంతో 2024 పార్లమెంటు ఎన్నికల ప్రచారం ప్రారంభించిన బీజేపీకి భారత ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారు. నాలుగొందల సీట్లలో కాషాయపక్షాన్ని గెలి పిస్తే ప్రతిపక్షాలు చెబుతున్నట్టు ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల రద్దు సహా రాజ్యాంగాన్ని ఇష్టమొచ్చినట్టు మోదీ సర్కారు సవరిస్తుందనే భయంతో 240 సీట్లకే దాన్ని పరిమితం చేశారు. లోక్‌సభలో 63 సీట్లు తగ్గిన నేప థ్యంలో కేంద్రంలోని బీజేపీ సర్కారు తన హిందుత్వ దూకుడుకు స్వస్తి పలుకుతుందనే రాజకీయ పండితుల అంచనాలు తప్పని తాజా విధానాల ద్వారా కాషాయపక్షం నిరూపిస్తోంది.



ప్రభుత్వాన్ని కాపాడే బడ్జెట్!



'ఎన్నికలు అయిపోయాయి.. ఇప్పుడు మనం దేశం గురించి ఆలోచించాలి' అని మీరే (ప్రధాని మోదీ) అన్నారు. కానీ, కేంద్ర బడ్జెట్‌ను చూస్తే అలా అనిపించడం లేదు. ఆ బడ్జెట్ మీ ప్రభుత్వాన్ని కాపాడుతుంది గాని, దేశాన్ని కాదు. ప్రభుత్వాన్ని నిష్పక్షపాతంగా నడపండి. అంతేగానీ ఇష్టానుసారంగా నడిపితే చివరికి ఒంటరిగా మిగిలిపోతారు.

- ఎంకే స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి



లిక్కర్ కేసు.. ఓ గాలి కథ

పాడ్‌కాస్టర్ సిద్ధార్థ ఇంటర్వ్యూలో సీనియర్ న్యాయవాది తర్విందర్ అప్పర్ మీర్

'ఢిల్లీ లిక్కర్ పాలసీ అసలు కేసే కాదు, అది దర్యాప్తు సంస్థలు అల్లిన కేసు' అని ఈ కేసుతో మొదటినుంచి సంబంధమున్న సీనియర్ న్యాయవాది తర్విందర్ అప్పర్ మీర్ చెప్పారు. మన దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐలు కేసు నమోదు కాకముందే, దర్యాప్తు పూర్తి కాకముందే ఒక నిర్ధారణ వస్తాయని, ఆ తర్వాత దాని చుట్టూ సాక్ష్యాలు అల్లుకు పోతాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ఆ కేసు నిలబడదని, అందుకే ఇప్పటికీ విచారణ మొదలుపెట్టడం లేదని, పాడ్‌కాస్టర్ సిద్ధార్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ ఇంటర్వ్యూ సారాంశం...

అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో సీబీఐ మొదటగా ఎంగేజ్ చేసి, ఆ తర్వాత డ్రాప్ చేసుకున్న న్యాయవాదిని నేను. సీబీఐ ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకముందే నన్ను ఎంగేజ్ చేసుకుంది. ఈ కేసును పరిశీలిస్తే.. మనకు ఓ పెద్ద ఎత్తుగడ కనిపిస్తుంది. ఇందులో ఏమైం దంటే నిందితుల్లోనే ఒకరిని తీసుకుని సాక్షిగా మార్చారు. మరి ఆ నిందితుడికి క్షమాభిక్ష ఎవరు పెట్టారు? 'మేము నిన్ను వదిలిపెడతాం.. నువ్వు మిగిలినవారికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్తావా?' అనే ప్రాతిపదికన క్షమాభిక్ష మంజూరు చేశారా?

నిన్న నేను ఎక్స్ (ట్విట్టర్)లో ఓ ట్వీట్ చేశాను. కింది కోర్టులో బెయిల్ లభిం చడం, దానిపై హైకోర్టులో ఎదురుదెబ్బ తగలడంపై అదనపు సొలిసిటర్ జనరల్ మాటలకు సంబంధించింది ఆ ట్వీట్. నిందితుడికి ఒక 'లాలిపాప్' ఇస్తే అతడు ఇతరుల గురించి సాక్ష్యం ఇస్తాడు. ఇదే దర్యాప్తు కళ అన్నారు. కానీ, నిందితుడికి 'లాలిపాప్' ఇవ్వడం దర్యాప్తు కళ కిందకు రాదని నేను కామెంట్ చేశాను. దర్యాప్తు బాధ్యత లేదా ధర్మం అనేది ఒక నిందితు నికి లాలిపాప్ ఇచ్చి ఇతర నిందితులకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పించడం కానే కాదన్నాను. మీరు ఒక పురావస్తు శాస్త్రవే త్తలా పని చేయాలని సూచించాను. సత్య శోధన కోసం సాక్ష్యం పొరలను తవ్వి వెలికితీసి పెట్టాలి. వాటి ఆధారంగా ఒక నిర్ధారణకు రావాలని తెలిపాను.

మన దగ్గర, ముఖ్యంగా సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల విషయంలో పెద్ద సమస్య ఏంటంటే ముందే నిర్ధారణకు రావడం జరుగుతుంది. ఇక దాని చుట్టూ సాక్ష్యాలను అల్లుకుపోతుం టారు. చివరకు రావాల్సిన నిర్ధార ణకు ముందే వస్తారు. దాని చుట్టూ సాక్ష్యాలను ఒక స్పైడర్‌లా అల్లు కుంటూపోతారు. ఇలాంటి వైఖరి తీసుకుంటే మీ కేసు దానంతట అదే బలహీనపడుతుంది. ఎందు కంటే మంచి డిఫెన్స్ లాయర్ ఎవ రైనా మీ కేసులో కొన్ని లొసుగు లను చటుక్కున పట్టుకుంటారు.

బెయిల్ రావడం, రాకపోవడం మీద ఆధారపడి కేసు నిలవదు. కేసులో దోషిత్వం నిరూపించిన రోజే దానిలో ఉన్న పస ఎంతో తేలిపోతుంది. అప్పుడే మీరు కేసు గెలుస్తారు. మీరు కేసు ఓడి పోయిన తర్వాత ఈ బెయిలుగొలుసు ఏం పనిచేస్తాయి?

సీఎంను, డిప్యూటీ సీఎంను ఏడాదో, ఏడాదిన్నరో ఏదో జైలులో పెడితే ఏమవు తుంది? దీని వల్ల సమాజానికి ఉప యోగం ఏమిటి? ఎవరైనా నేరం చేస్తే మీరు నేర నిరూపణ చేసి చూపెడితే సమాజానికి మేలు జరుగుతుంది. మీ నేరనిరూపణ రేటు మరి 8 శాతమైతే ఎలా? చట్టాన్ని అమలు చేసే ఏ సంస్థ యైనా అరెస్టు చేసి దాని మీద పొదుగు తున్న కోడి గుడ్డ మీద కూర్చున్నట్టుగా కూర్చోమని సమాజం చెప్పదు. జాతిక ముందే గేస్తూ కూర్చోమని పురమాయిం చదు. మీ బాధ్యత ఏమిటి? నేర నిరూ పణ. ఎవరైనా మనీలాండరింగ్‌కు పాల్ప డితే అరుపెంట్లో శిక్ష వేయించి చూపండి. లేదా సంవత్సర కాలంలో వేయించండి. మీ దగ్గర 8 వేల కేసులున్నాయి. ఇప్పటి దాకా 24 కేసుల్లో మాత్రమే విచారణలు జరిగాయి. అటునుంచి కూడినా, ఇటు నుంచి కూడినా.. అన్నీ కలిపితే కేవలం 24, అంతే.

ఈడీ అయితే ప్రాసిక్యూషనే మొదలుపెట్టదు. సాక్ష్యాలు నమ్ము త్తుందదు. 'మనిషిని లోపల వేయండి. కేసు పెట్టండి. కానీ, విచారణ మొదలుపెట్టొద్ద'ని పైనుంచి ఆర్డరు వస్తుంది. అసలు విచారణ మొదలుపెడితే డిఫెన్స్ లాయర్ మిమ్మల్ని గుక్కతిప్పుకోని నిలదీస్తారు. దాంతో కేసు ముగిసిపోతుంది. వాళ్ల దగ్గర గట్టి లాయర్లు లేరని కాదు. వారు పెట్టింది బూటకపు వంటి వాళ్ళన కేసు కావడమే అసలు సమస్య. ఎక్కడో అక్కడ అది దొరికిపోతుంది.

ట్రైండ్ కో సేల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనే జింగ్ డైరెక్టర్ అమన్‌దీప్ సింగ్ ధల్ తర ఫున ఈ కేసులో నేను వాదిస్తున్నాను. ఆతిపెద్ద వైన్ మద్యం దిగుమతిదారుల్లో ఈ కంపెనీ ఒకటి. నా క్లయింట్‌ను జైలులో పెట్టారు. కానీ, నిజానికి కేసు ఏదీ లేదు. కుట్ర జరిగిందని ఇప్పుడు అందరి చుట్టూ వాళ్లు (దర్యాప్తు సంస్థలు) ఓ కేసు అల్లారు. అందులో ఆమ్ ఆద్మీ పార్టీవాళ్లు, సౌత్ గ్రూప్.. అంటే హైదరాబాద్ గ్రూప్, కవిత తదిత రులు అందరూ జైలులో ఉన్నారు. ఆమె (కవిత) కూడా రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. శ్రీ అరబిందో ఫార్మా వంటి సంస్థలకు చెందిన కొందరు బిజి నెస్ మాగ్నెట్స్ కూడా ఉన్నారు. శరత్‌రెడ్డి మొదట ఈ కేసులో కింగ్‌పిన్ అన్నారు. అప్పుడు నిందితుడు. కానీ, ఈ రోజు ఆయన సాక్షిగా ఉన్నారు. వందకోట్ల ఎల క్టోరల్ బాండ్లు తీసుకున్నారు. అందులో కొంత ముందు, కొంత తర్వాత కొన్నారు. ఈడీ లెక్క ప్రకారమే ప్రధా నంగా ముడుపులు చెల్లించిన వ్యక్తి ఇప్పుడు సాక్షిగా మారారని అంటు న్నారు. అంటే తమరు ఇక్కడ ఏం న్యాయం జరిపిస్తున్నారు? ఇది ప్రస్తుతం న్యాయస్థానం ముందున్న కేసు కనుక నేను దీనిపై ఎక్కువగా మాట్లాడితే బాగుండదు. నేను కూడా పాల్గొంటు న్నాను కనుక ఎంతోకొంత చెప్తానంతే.

ఇక కేసు వల్ల కేజ్రీవాల్‌కు నష్టం జరి గిందా? అనే విషయాన్ని తీసుకుంటే అరెస్టు చేస్తే ఎంతోకొంత నష్టం ఉంటుంది కదా.. ఇమేజ్ కొంత దెబ్బ తింటుంది కదా.. ఢిల్లీలో కేజ్రీవాల్ గురించి ఏమనుకుంటున్నారు అని ప్రజలను అడిగితే.. ఢిల్లీకి ఎంతో కొంత మంచే చేశాడని అందరూ చెప్తారు. జనంలో ఈ అభిప్రాయం ఉంది. మళ్లీ సీఎంగా వస్తారా? అంటే ఎందుకు జర గకూడదనే అంటాను. గెలుస్తారా, లేదా అనేది కాదు. సెంటిమెంట్ఐతే ఉంది. ఈ కేసులో మాత్రం ఏమీ లేదు. ఈ కేసు గాలిలో వేలాడుతున్నది. నిలుస్తుందా, తేలిపోతుందా అనేది తర్వాత సంగతి. ముందు విచారణ మొదలుపెట్టండి, దమ్ముంటే!

- ఎడిటోరియల్ డెస్క్

పండుగలా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు పుట్టిన రోజు వేడుకలు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పండుగలా జరిగాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేకులు కట్‌చేసి పంచిపెట్టారు.

అభిమాన నేత నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించాలని కోరుతూ ఆలయాల్లో పూజలు చేశారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గిఫ్ట్ ఏ స్మైల్ కింద పేదలకు నగదు సాయం, ల్యాప్‌టాప్‌లు ఇతరత్రా వస్తువులు అందజేశారు. కుట్టుమిషన్లు, చీరలు పంచిపెట్టారు.

కేటీఆర్ కుటుంబ సభ్యులతో కలిసి తల్లిదండ్రులు కేసీఆర్-శోభమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బొకేలు అందజేసి కేటీఆర్‌కు బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపారు.



బుధవారం తన పుట్టినరోజు సందర్భంగా నందినగర్ నివాసంలో తల్లిదండ్రులు కేసీఆర్-శోభమ్మ ఆశీస్సులు తీసుకుంటున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో సతీమణి శైలిమ, కొడుకు హిమాన్షు, కూతురు అలేఖ్య



గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా ల్యాప్‌టాప్‌లు అందుకున్న విద్యార్థినులతో కేటీఆర్. ఆయన సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షు, కూతురు అలేఖ్య





గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా కుట్టుమిషన్లు అందుకుంటున్న జనగామ జిల్లా లింగాలఘనపురం మండలానికి చెందిన వెయ్యి మంది మహిళలు. (ఇన్‌సెట్‌లో) జనగామలో ఓ మహిళకు కుట్టుమిషన్ అందజేస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి... సంబురాల్లో భాగంగా కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కే వాసుదేవరెడ్డి



కేటీఆర్‌కు బర్త్‌డే విషెస్ చెబుతున్న ఎమ్మెల్యే మల్లా



కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల..



సిరిసిల్లలో ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికులు నాగరాజు, శ్రీనివాస్ కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు



కేటీఆర్‌కు బొకే అందజేసి శుభాకాంక్షలు చెబుతున్న మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి



కేటీఆర్ బర్త్‌డే సందర్భంగా బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆలింగనం చేసుకుంటున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి..



కేటీఆర్‌కు పూలబొకేతో శుభాకాంక్షలు చెబుతున్న మహిళా ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, వీ సునీతాలక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ బర్త్‌డే సందర్భంగా రక్తదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు. చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ విప్ బాల్క సుమన్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు గెల్లు శ్రీనివాస్ యాదవ్, పల్లె రవికుమార్‌గౌడ్ తదితరులు



అసెంబ్లీ ఆవరణలో కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి. చిత్రంలో ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, శేరి సుభాష్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి



నల్లగొండలో జడ్పీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డికి కేకు తినిపిస్తున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి, భూపాల్‌రెడ్డి



కేటీఆర్ జన్మదినం సందర్భంగా భాగ్యశ్రీ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



ఖమ్మం నగరంలో పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు



కేటీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



జాతీయస్థాయికి ఎంపికైన డబుల్ ఇక్కత్ చీరను చూపుతున్న ముఖేశ్

నేత కార్మికుడికి జాతీయ పురస్కారం

చౌటుప్పల్ రూరల్, జూలై 24: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంకు చెందిన చేనేత కార్మికుడు కర్నాటి ముఖేశ్ జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రత్యేక డిజైన్‌తో ప్రకృతి రంగులతో పోచంపల్లి డబుల్ ఇక్కత్ చీర తయారు చేసినందుకు జాతీయ స్థాయి సెయింట్ కబీర్ హ్యాండ్లూమ్ పురస్కారానికి ఎంపికయ్యారు. డబుల్ ఇక్కత్ విభాగంలో కేంద్ర చేనేత జౌళిశాఖ జాతీయ స్థాయిలో అందించే 2023 పురస్కారానికి దేశ వ్యాప్తంగా 14 మందిని ఎంపిక చేయగా తెలంగాణ నుంచి ముఖేశ్‌కు గుర్తింపు దక్కింది. అవార్డు కోసం రాష్ట్రం నుంచి 27 మంది దరఖాస్తు చేసుకున్నారు. కర్నాటి ముఖేశ్ ప్రకృతి రంగులను ఉపయోగించి పంచ రకాల పూల డిజైన్లతో తయారు చేసిన డబుల్ ఇక్కత్ చీర ప్రత్యేకత కనబర్చడంతో నిపుణుల కమిటీ పురస్కారానికి ఎంపిక చేసింది. కర్నాటి ముఖేశ్ బీటెక్ చదివారు. తాత, తండ్రి వారసత్వంగా వచ్చిన చేనేత వృత్తిపై మక్కువతో 15 ఏండ్లుగా అందులోనే కొనసాగుతూ.. ప్రత్యేకతను చాటుకుంటున్నారు. 2022లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొండాలక్ష్మణ్ చేనేత అవార్డు అందుకున్నారు. జాతీయ పురస్కారానికి ఎంపికైన ముఖేశ్‌ను చేనేత సంఘం నాయకులు, స్థానికులు అభినందించారు.

ఏజెన్సీ రైతులకు కొర్రీలు పెట్టొద్దు

చండ్రుగొండ, జూలై 24: రైతులందరికీ బేషరతుగా పంట రుణాలు మాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత రైతులకు ఎలాంటి కొర్రీలు పెట్టొద్దని సూచించారు. భద్రాద్రి జిల్లా చండ్రుగొండ మండలంలో రుణమాఫీ కాని రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సహకార సంఘాల్లో, బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టాదారు పాస్‌బుక్‌తోపాటు పహాణీలతో తీసుకున్న పంట రుణాలను కూడా మాఫీ చేయాలని కోరారు. పట్టా బుక్కులు, రేషన్‌కార్డులు లేవనే సాకుతో రైతులకు అన్యాయం చేయడం సరికాదని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కువమంది రైతులు పహాణీలతోనే పంట రుణాలు తీసుకుంటున్నందున వారందరికీ రుణమాఫీని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతుభరోసాను కూడా వెంటనే అందించాలని సూచించారు. అనంతరం ఆర్ఐ అక్బర్‌కు వినతిపత్రం సమర్పించారు.

నేటి నుంచి 'దోస్త్' స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి దోస్త్-2024 స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నేటి(గురువారం) నుంచి ప్రారంభించనున్నట్టు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి తెలిపారు. బుధవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో దోస్త్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 2 వరకు స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఉంటుందని, రూ.400 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. 27 నుంచి ఆగస్టు 3 వరకు స్పెషల్ ఫేజ్ వెబ్ ఆప్షన్ల నమోదు, 6న సీట్ల కేటాయింపు, 7 నుంచి 9 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్‌కు గడువు విధించారు. ఆన్‌లైన్ ద్వారా రిపోర్టింగ్ చేసిన వారు 7 నుంచి 9 వరకు నేరుగా కాలేజీలలో రిపోర్టు చేయాలని అధికారులు తెలిపారు. వివరాలకు దోస్త్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

దోస్త్ ద్వారా నిథమ్‌లో బీబీఏ అడ్మిషన్లు

హైదరాబాద్, జూలై24 (నమస్తే తెలంగాణ): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)లో బీబీఏ కోర్సు అడ్మిషన్లను ఈ ఏడాది నుంచి దోస్త్ ద్వారా చేపట్టనున్నారు. సంస్థ అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలను జారీ చేయగా, నిథమ్ డైరెక్టర్ వాణీప్రసాద్ బుధవారం సమీక్ష నిర్వహించారు. అడ్మిషన్ల ప్రక్రియపై చర్చించారు.

నూరేండ్లు వర్ధిల్లు

- పుట్టినరోజున కేటీఆర్‌కు కేసీఆర్ దంపతుల దీవెనలు
- వివిధ ప్రాంతాల్లో బర్త్‌డే వేడుకలు
- బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రక్తదానం
- ఓయూలో మొక్కలు నాటిన విద్యార్థి నాయకులు



లండన్‌లో కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న ఎన్నారై బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను 'నూరేండ్లు వర్ధిల్లు' అంటూ పార్టీ అధినేత కేసీఆర్ ఆశీర్వదించారు. తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం కేటీఆర్ తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో కేసీఆర్, శోభమ్మ దంపతులను సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షు, కూతురు అలేఖ్యతో కలిసి దీవెనలు అందుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా పలుచోట్ల వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

అసెంబ్లీలో కేటీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శాసనసభలో సభ్యుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బుధవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభంకాగానే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తొలుత కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా కేటీఆర్ సీటు వద్దకు వెళ్లి కరచాలనం చేస్తూ శుభాకాంక్షలు అందజేశారు. టీ బ్రేక్ సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మదన్‌మోహన్, బీజేపీ, ఎంఐఎం ఎమ్మెల్యేలు సైతం కేటీఆర్ వద్దకు వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, ఆయనతో కొద్దిసేపు ముచ్చటించారు. శాసనమండలి సమావేశాలు ముగియగానే బీఆర్ఎస్ ఎమ్మెల్సీలందరూ అసెంబ్లీకి వచ్చి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, శాసనమండలి బీఆర్ఎస్ పక్ష నేత ఎస్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, జీ జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కే సంజయ్, కోవా లక్ష్మి, ఎమ్మెల్సీలు బండ ప్రకాశ్, శేరి శుభాష్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, శంభీపూర్ రాజు, తాతా మధు, సత్యవతి రాథోడ్, ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ భవన్‌లో రక్తదానం

కేటీఆర్ జన్మదినం సందర్భంగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బీఆర్ఎస్వీ నాయకులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. అంతకు ముందు మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ ఎంపీలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, లింగయ్యయాదవ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాకేశ్‌కుమార్, రామ్మూర్తియాదవ్, రాజీవ్‌సాగర్, పల్లె రవికుమార్, రూప్‌సింగ్, అంజనేయగౌడ్, బీఆర్ఎస్వీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఓయూలో గాదరి కిశోర్ ఆధ్వర్యంలో వేడుకలు

ఉస్మానియా యూనివర్సిటీ బీఆర్ఎస్వీ శాఖ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో మొక్కలు నాటి, కేక్ కట్ చేసి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు నేపూరి ధర్మేందర్‌రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, వల్లమల్ల కృష్ణ, వీరబాబు, మంద సురేశ్, కటారి స్వామి, పడాల సతీశ్, జంగం అవినాశ్, గడదాశ చందు, జహీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

లండన్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం లండన్‌లో ఘనంగా నిర్వహించారు. ఎన్నారై బీఆర్ఎస్ యూకే శాఖ అధ్యక్షుడు అశోక్‌గౌడ్ దూసరి కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో యూకే కమిటీ ప్రధాన కార్యదర్శి, టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, నాయకులు నవీన్‌రెడ్డి, ప్రవీణ్ వీర, హరిగౌడ్ నవాపేట్, శ్రీకాంత్ జెల్ల, సత్య చిలుముల, జాయింట్ సెక్రటరీ మల్లారెడ్డి బీరం, సతీశ్‌రెడ్డి గొట్టిముక్కుల, రవిప్రదీప్ పులుసు, రవి రేటినేని తదితరులు పాల్గొన్నారు.



సాంచాల వద్ద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న మల్లయ్య

మరో నేతన్న ఆత్మహత్య

- ఏడు నెలలుగా ఉపాధి లేక..
- బతుకు భారమై బలవన్మరణం
- జగిత్యాల జిల్లాలో విషాదం

పెగడపల్లి, జూలై 24: స్వరాష్ట్రంలో పునర్వైభవం పొందుతున్న చేనేత రంగం ప్రస్తుతం మళ్లీ సంక్షోభంలోకి వెళ్లింది. అటు కేంద్రం, ఇటు రాష్ట్రం చూపుతున్న వివక్షతో మళ్లీ మరణమృదంగం మోగుతున్నది. కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల ప్రాంతంలో ఇప్పటికే ఎనిమిది మంది చనిపోగా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పన్నెండు మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవడం కలకలం రేపుతున్నది. తాజాగా జగిత్యాల జిల్లాలో మరో నేతన్న తనువు చాలించాడు. వివరాలు ఇలా.. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం మ్యాకవెంకయ్యపల్లి గ్రామానికి చెందిన గుండేటి మల్లయ్య (55)కు ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉండగా, వారికి వివాహాలు జరిగి ఇతర ప్రాంతాల్లో బతుకుతున్నారు. మల్లయ్య తన భార్య రాజేశ్వరితో కలిసి ఇక్కడే చీరలు నేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఇచ్చిన ఆర్డర్లతో చేతినిండా పనితో దర్జాగా బతికారు. ఏడు నెలలుగా ఉపాధి లేక కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికితోడు కూతురి వివాహం కోసం చేసిన అప్పులు అలాగే ఉండడంతో తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. బుధవారం భార్య రాజేశ్వరి వ్యవసాయ కూలీ పనులకు వెళ్లగా, మల్లయ్య తన సాంచాల కార్ఖానాలోనే ఉరేసుకున్నాడు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు పెగడపల్లి ఎస్సై సత్తయ్య, ఏఎస్ఐ రవీందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేతన్నకు నా వంతుగా..

> మొదటిపేజీ తరువాయి...

ఉన్న సిరిసిల్ల నియోజకవర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తుండటంతో, వారి ఇబ్బందులను తీర్చాలని నిర్ణయించుకోవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఐదేండ్ల క్రితం తన పుట్టినరోజున ప్రారంభించిన 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం తనకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. చేనేత కుటుంబాలు, వారి పిల్లల విద్య, భవిష్యత్తు అవసరాల కోసం ఆర్థికసాయం చేయనున్నట్టు ప్రకటించారు. 2020లో కరోనా సమయం నుంచి తన పుట్టినరోజున ఇతరులకు సాయంచేసే విధంగా జరుపుకోవాలని నిర్ణయించుకున్నానని, తనతోపాటు తన శ్రేయోభిలాషులు, అభిమానులు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటూ వస్తున్నారని తెలిపారు. ఈ ఐదేండ్లలో అంబులెన్స్‌లతో పాటు 6,000 మంది విద్యార్థులకు ట్యాబ్స్, 1,400 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, స్కూటర్లను అందజేశామని వివరించారు. పెద్దలు చెప్పినట్టుగా పుట్టుక, మరణం మాత్రమే నిజమని, మధ్యలో మిగిలినదంతా నిజమో? అబద్ధమో? తెలియని పరిస్థితి అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే జీవితంలో మనసుకు సంతృప్తినిచ్చే కార్యక్రమాలు చేసినప్పుడే ఎక్కువ సంతోషం కలుగుతుందని చెప్పారు. విద్యార్థులు ఉన్నత విద్యకు ల్యాప్‌టాప్‌లు ఉపయోగపడతాయనే ఉద్దేశంతో తాను నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. నిరుడు జన్మదినం సందర్భంగానే స్టేట్‌హోమ్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలని నిర్ణయించుకోగా, ఎన్నికల కారణంగా ఇవ్వలేకపోయానని, ఆ హామీని ఈ పుట్టినరోజున నెరవేర్చానని చెప్పారు.

గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా 1.50 లక్షల బాండ్

నరేశ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కిశోర్ అందజేత



నరేశ్ కుటుంబ సభ్యులకు ఎఫ్‌డీ పత్రాలను మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తరఫున అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శాలిగౌరారం, జూలై 24 : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఊట్కూర్‌కు చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమ గాయకుడు, సాంస్కృతిక విభాగం ఉమ్మడి జిల్లా మాజీ కోఆర్డినేటర్ వేముల నరేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నరేశ్‌ది నిరుపేద కుటుంబం కావడంతో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అండగా నిలిచారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా ఆయన ముగ్గురు పిల్లలు అభిషేక్, ధనుశ్, తన్వీ పేరిట ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున రూ.1.50 లక్షలు స్థానిక బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఆ బాండ్‌లను బీఆర్ఎస్ శాలిగౌరారం మండల అధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్, నాయకులు కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుజిలాల్ శేఖర్‌బాబు ద్వారా బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు పంపించారు.

పరిపూర్ణ నాయకుడు కేటీఆర్

సామాజికవేత్త సునీతాకృష్ణన్ కితాబు

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రపంచం మొత్తంలో ఉన్న అతికొద్దిమంది స్ఫూర్తిదాయకమైన నాయకుల్లో ఒకరని ప్రముఖ సామాజికవేత్త సునీతాకృష్ణన్ కితాబిచ్చారు. కేటీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని ఎక్స్ వేదికగా సునీతాకృష్ణన్ శుభాకాంక్షలు తెలుపుతూ.. కేటీఆర్ వ్యక్తిత్వాన్ని, నాయకత్వ లక్షణాలను ప్రశంసించారు. 'ప్రపంచవ్యాప్తంగా పరిపూర్ణ నాయకత్వ శైలితో, నిస్వార్థంగా ఉంటూ నిర్మాణాత్మక పద్ధతిలో స్ఫూర్తినిచ్చే నాయకులు కొద్దిమంది మాత్రమే ఉన్నారు. వారిలో కేటీఆర్ ఒక యువ నాయకుడని నేను భావిస్తున్నాను' అని కొనియాడారు. వారు నేత కార్మికులకు అండగా నిలిచారు, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంచి తోడ్పాటునిచ్చారు, పలువురికి వైద్యసాయం అందించారని పేర్కొన్నారు.

నేడు సిరిసిల్ల బంద్

> మొదటిపేజీ తరువాయి...

10 హెచ్‌పీ వరకు ఉచిత విద్యుత్తు అందించాలని, అప్పైన 4వ క్యాటగిరీ కింద పరిగణించి 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని, బతుకమ్మ చీరలు లేదా జనతా వస్త్రాల పథకాలు, స్కూల్ డ్రెస్‌ల ఆర్డర్లు ఇచ్చి కార్మికులకు ఉపాధి కల్పించాలని వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సిరిసిల్లలో యార్న్ డిపో ఏర్పాటు చేయాలని, వర్కర్ టు ఓనర్ పథకాన్ని పూర్తిచేసి కార్మికులకు అందించాలని, 10 శాతం యార్న్ సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్, నేతన్న బీమా అమలు చేసి కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరుతున్నది. వస్త్ర పరిశ్రమను శాశ్వతంగా సంక్షోభం నుంచి బయట పడేసేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ డిమాండ్లను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ముందు పెట్టినా స్పందన లేకపోవడంతో రిలే దీక్షలకు పూనుకున్నది. మూడు రోజులుగా దీక్షలు చేస్తున్నా స్పందన లేకపోవడంతో.. గురువారం సిరిసిల్ల బంద్‌కు పిలుపునిచ్చింది. అయినా ప్రభుత్వం దిగి రాకపోతే.. ఈ నెల 27 అసెంబ్లీని ముట్టడిస్తామని జేఏసీ ప్రకటించింది.

అసెంబ్లీని ముట్టడిస్తాం

రాష్ట్ర ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలతోనే వస్త్ర పరిశ్రమ సంక్షోభం నెలకొన్నది. తక్షణమే 15 కోట్ల మీటర్ల వస్త్ర ఆర్డర్లు ఇచ్చి నేతన్నలకు ఉపాధి కల్పించాలి. పది హెచ్‌పీలకు పవర్ మగ్గాలకు ఉచిత విద్యుత్తు అందించాలి.. నాలుగో క్యాటగిరీలో చేర్చి సబ్సిడీ కొనసాగించాలి. వస్త్ర పరిశ్రమకు రావాల్సిన రూ.180 కోట్లు వెంటనే విడుదల చేయాలి. 2023 వరకు పెండింగ్‌లో ఉన్న యార్న్ సబ్సిడీ విడుదల చేయాలి. వర్కర్ టు ఓనర్ పథకాన్ని పూర్తి చేసి కార్మికులకు అందించాలి. గురువారం నాటి బంద్‌కు వ్యాపార, వాణిజ్య వర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలి. ప్రభుత్వంలో చలనం రాకపోతే ఈనెల 27 వేలాది మంది కార్మికులతో అసెంబ్లీని ముట్టడిస్తాం.

– మూషం రమేశ్, తెలంగాణ పవర్‌లూమ్స్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆస్పెన్ బయోఫార్మా గోదాం సీజ్

- అనుమతి లేకుండా ఔషధాల తయారీ
- 96 లక్షల విలువ చేసే మందులు సీజ్



ఆస్పెన్ బయోఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ గోదాంలోని ఔషధాలను సీజ్ చేసిన అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 24 (నమస్తే తెలంగాణ): అక్రమంగా ఔషధాలు తయారు చేస్తూ, పెద్దఎత్తున నిల్వచేసిన ఆస్పెన్ బయోఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ గోదాంపై రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఆబ్కారీ అధికారులతో కలిసి దాడులు జరిపారు. ఈ దాడుల్లో రూ.96లక్షల విలువ చేసే ఔషధాలను సీజ్ చేశారు. డీసీఏ డైరెక్టర్ జనరల్ వీ బీ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం...ఆస్పెన్ బయోఫార్మా కంపెనీకి చెందిన కే సతీశ్‌రెడ్డిపై గతంలోనే అక్రమ ఔషధాల తయారీ, అక్రమ నిల్వలు, లైసెన్స్ లేకుండా గోదాం నిర్వహణ వంటి కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి గ్రామం, పోతారం వై-జంక్షన్‌లో అక్రమంగా ఔషధాలు తయారు చేస్తూ, పెద్దఎత్తున ఔషధాలను నిల్వ చేశాడనే సమాచారం మేరకు డీసీఏ అధికారులు స్థానిక ఆబ్కారీ అధికారులతో కలిసి ఔషధాల గోదాంపై మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో రూ.96లక్షల విలువ చేసే యాంటీ క్యాన్సర్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్, యాంటీడిప్రెసెంట్స్ తదితర ఔషధాలను సీజ్ చేశారు. 2023లో బొల్లారంలో నకిలీ యాంటీ క్యాన్సర్ ఔషధాల తయారీలో, ఖమ్మం జిల్లా అన్నారుగూడెంలో ఔషధాల ముడిసరుకు తయారీలోనూ కే సతీశ్‌రెడ్డి ప్రధాన నిందితుడిగా గుర్తించినట్టు డీసీఏ అధికారులు వెల్లడించారు.

5 ఏండ్ల జైలు శిక్ష

డీసీఏ అనుమతి లేకుండా అక్రమంగా ఔషధాల తయారీ చట్టరీత్యా నేరం. నిందితులకు ఐదేండ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. అనుమతి లేకుండా తయారు చేసే ఔషధాలు జీఎంపీ నిబంధనల ప్రకారం ఉండవు. ఇవి ప్రజల ప్రాణాలకు ప్రమాదం. సమాచారం ఉంటే డీసీఏ టోల్‌ఫ్రీ నెంబర్ 1800-599-6969 కు సమాచారం అందించండి.

– డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి



వివరాలు తెలుపుతున్న బాధితుడు

వడ్డీ ఆశతో డాటామీర్ యాప్‌లో పెట్టుబడులు

రూ.2 కోట్లకుపైగా మోసపోయిన బాధితులు

మంచిర్యాల అర్బన్, జూలై 24: కొందరు అక్రమార్కులు ఓ యాప్‌లో పెట్టుబడులు పెట్టి కోట్ల రూపాయలు కొల్లగొట్టుకున్నారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డాటామీర్ అనే ఆన్‌లైన్ యాప్ (వడ్డీ యాప్) ద్వారా లింకులు రావడంతో మంచిర్యాలకు చెందిన దాదాపు 800 మంది అందులో చేరారు. పెట్టిన డబ్బులకు రెట్టింపు వడ్డీలు ఇస్తామంటూ నిర్వాహకులు ఏరోజుకారోజు ఆఫర్లు పెడుతూ ఆకర్షించారు. ఇందుకు ఆశపడిన అనేక మంది పెట్టుబడులు పెట్టారు. నిర్వాహకులు సైతం వారి పెట్టుబడికి తగ్గట్టుగా వడ్డీ రూపంలో డబ్బులు జమ చేస్తూ వచ్చారు. ఇలా నాలుగు నెలలుగా వ్యవహారం బాగానే నడిచింది. గత శుక్రవారం ఎన్ని డబ్బులు పెడితే.. బదులుగా అన్ని డబ్బులు తిరిగి చెల్లిస్తామని నిర్వాహకులు ఆఫర్ ఇవ్వడంతో అనేక మంది పుస్తెలతాళ్లు అమ్మి మరీ పెట్టుబడులు పెట్టారు. సోమవారం నుంచి డబ్బులు విత్‌డ్రా కాకపోవడంతో ఆందోళన చెందిన బాధితులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ మెట్లెక్కారు. సీఐ అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు.

రైల్వే బడ్జెట్‌లోనూ మొండిచెయ్యే

> మొదటిపేజీ తరువాయి...

కేటాయించిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు పూర్తిస్థాయి రైల్వే బడ్జెట్‌లో కూడా తెలంగాణకు అన్యాయం చేసింది. కేవలం రూ.5,336 కోట్లు కేటాయింపుతో సరిపుచ్చారు. తెలంగాణలో రైల్వే నెట్‌వర్క్ విద్యుదీకరణ పనులను 100 శాతం పూర్తి చేశామని, రాష్ట్రంలోని 497 ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలను నిర్మించామని, 40 స్టేషన్లను అమృత స్టేషన్లుగా అభివృద్ధి చేయనున్నామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. రాష్ట్రంలో కొత్తగా చేపట్టిన రైల్వే ట్రాకుల నిర్మాణానికి రూ.32,946 కోట్లు అవ్వుతుందని తెలిపారు.

ఏపీకి అధిక నిధులు

ఏపీలో రైల్వేల అభివృద్ధికి మధ్యంతర బడ్జెట్‌లో రూ.9,138 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు పూర్తిస్థాయి బడ్జెట్‌లో మరో రూ.9,151 కోట్లు కేటాయించింది. ఇప్పటికే 73 కొత్త రైల్వే లైన్లు పూర్తి చేశామని, 73 స్టేషన్లను అమృత స్టేషన్లుగా అభివృద్ధి చేశామని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఏపీలో రూ.73,743 కోట్ల విలువైన 41 ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నట్టు చెప్పారు. సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, సీపీఆర్వో ఏ శ్రీధర్ పాల్గొన్నారు.

నీ కొడుకును అరెస్టు చేశాం.. ముంబై రండి!

- రోజుకో ఐడియాతో సైబర్ నేరగాళ్ల పంజా!
- తాజాగా హైదరాబాద్‌లో ఇద్దరికి కాల్స్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 24 (నమస్తే తెలంగాణ): నీ కొడుకును అరెస్ట్ చేశాం.. మేం ఫలానా పోలీసులం.. మీ బిడ్డను వదిలి పెట్టాలంటే వెంటనే ముంబై రావాలి.. ఇదీ సైబర్ నేరగాళ్ల నయా దందా. మీకు ఎంత మంది పిల్లలు.. ఏమి చేస్తున్నారు.. అంటూ అచ్చం పోలీసులు మాట్లాడినట్టే వాట్సాప్ కాల్ చేస్తారు. ఈ తరహా ఫోన్ కాల్స్ ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఇద్దరికి రావడం గమనార్హం. 'హలో మీకు పిల్లలెంత మంది.. ఏం చేస్తున్నారు.' అంటూ హైదరాబాద్ అంబర్‌పేటకు చెందిన ఓ వ్యక్తికి ఫోన్‌కాల్ వచ్చింది. 'మా పిల్లలు అమెరికాలో ఉంటున్నారు.' అని అనగానే 'హా మేము అమెరికా నుంచి మాట్లాడుతున్నాం.' అనడంతో కంగుతినడం అతని వంతయింది. రాజేంద్రనగర్‌లో ఉండే మరొకరికి ఇలాంటిదే కాల్ వచ్చింది. 'ముగ్గురు పిల్లలను అరెస్ట్ చేశాం.. అందులో మీ కొడుకు ఉన్నాడు. మీ ఫోన్ నంబర్ ఇచ్చాడు. వెంటనే మీరు ఢిల్లీకి రావాలి' అంటూ అవతలి వ్యక్తి ఫోన్‌లో మాట్లాడారు. 'అరే భాయ్ నా పిల్లలు ఎల్‌కేజీ చదువుతున్నారు' అంటూ బాధితుడు చెప్పడంతోనే ఫోన్ కట్ చేశారు. ఈ రెండు కాల్స్ కూడా +92 కోడ్ నంబర్‌తో వాట్సాప్ కాల్స్ వచ్చాయి.

ఈ చలాన్, ఐటీ పేరుతో సైబర్ వల

ఈ చలాన్, ఇన్‌కం ట్యాక్స్ పేరుతో లింక్‌లు పంపి సైబర్ నేరగాళ్లు మోసం చేసే అవకాశాలు ఉన్నాయని సైబర్‌క్రైమ్ పోలీసులు ప్రజలను హెచ్చరించారు. ప్రభుత్వం నిర్వహించే ఆన్‌లైన్ వెబ్‌సైట్లు https://echallan.parivahan.gov.in, https://echallan.tspolice.gov.in ఇవేనని సూచించారు. ఆదాయపు పన్ను శాఖ నుంచి మేసేజ్ పంపినట్టు నకిలీ లింక్‌లు పంపే ప్రమాదమూ ఉన్నదని సైబర్‌క్రైమ్ పోలీసులు తెలిపారు.

ప్రజాపాలనలో ఆడబిడ్డ బందీ

> మొదటిపేజీ తరువాయి...

చేయలేదు. గురుకుల పోస్టుల భర్తీలో రీలింక్విష్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని, బ్యాక్‌లాగ్ లేకుండా అపాయింట్‌మెంట్ భర్తీ చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ నాలుగు నెలలుగా అభ్యర్థులు పోరాటాలు చేసినా ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం చూపలేదు. ఈ నేపథ్యంలో తమ సమస్యను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని గురుకుల అభ్యర్థులు నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈ విషయమై అభ్యర్థులు తమ వాట్సాప్ గ్రూపుల్లో చర్చించుకుంటూ, అభిప్రాయాలను పంచుకుంటున్నారు. మరోసారి సీఎం ఇంటి ఎదుట నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లింది. ఆ గ్రూపుల్లో చురుకుగా పాల్గొంటున్న అభ్యర్థులను పోలీసులు టార్గెట్ చేసుకున్నారు. నిర్బంధం ప్రయోగిస్తూ బుధవారం పలువురు అభ్యర్థులను అదుపులోకి తీసుకున్నారు.

యువతిని అరెస్టు చేసిన మగ పోలీసులు

నిర్బంధంలో భాగంగా హైదరాబాద్ మాణికేశ్వర్‌నగర్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మహబూబ్‌నగర్‌కు చెందిన గురుకుల అభ్యర్థి ఆస్మాను ఉస్మానియా పోలీసులు బుధవారం ఉదయమే అదుపులోకి తీసుకున్నారు. యువతిని అదుపులోకి తీసుకునే ముందు మహిళా పోలీసులు ఉండాలనే నిబంధనలను సైతం తుంగలోతొక్కి, దాదాపు ఏడుగురు మగ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని గురుకుల అభ్యర్థులు నిప్పులు చెరిగారు. అదీగాక ఆస్మా రెండు రోజులుగా వైరల్ ఫీవర్‌తోపాటు, టీబీతో బాధపడుతూ చికిత్స పొందుతున్నది. అంతేగాక గురువారం డీఎస్సీ పరీక్ష రాయాల్సి ఉన్నది. ఐనా ఓయూ పోలీసులు వినకుండా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లోనే నిర్బంధించారు. విషయం తెలుసుకున్న ఇతర గురుకుల అభ్యర్థులు అక్కడికి చేరుకుని ఎక్కడికీ వెళ్లబోమని రాతపూర్వకంగా రాసిచ్చిన అనంతరం, ఉన్నతాధికారుల అనుమతితో తమను వదిలిపెట్టారని అభ్యర్థి ఆస్మా సోషల్‌మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేసింది.

రాష్ట్రవ్యాప్తంగా పలువురి అరెస్టు

రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు బుధవారం పలువురు గురుకుల అభ్యర్థులను అదుపులోకి తీసుకున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో గురుకుల అభ్యర్థి మల్హార్ యాదవ్, విశ్వరూప్, నల్లగొండలో వలికి రాము, శ్రీనివాస్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ వెళ్తే కేసులు పెడతామని, భవిష్యత్తు నాశనం చేసుకోవద్దంటూ పోలీసులు బెదిరింపులకు దిగారని బాధిత గురుకుల అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

అంధ బాలికపై లైంగిక దాడి

మలక్‌పేట ప్రభుత్వ హాస్టల్‌లో ఘటన

మలక్‌పేట, జూలై 24: మలక్‌పేటలోని ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహ పాఠశాలలో ఎనిమిదేండ్ల బాలికపై స్కావెంజర్ (మరుగుదొడ్లను శుభ్రపరిచేవాడు) అఘాయిత్యానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లాకు చెందిన బాలిక(8) అస్మాన్‌గఢ్‌లోని ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నది. ఈ నెల 7న బాలికకు రక్తస్రావం కావడంతో హాస్టల్ వార్డెన్ తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపించారు. బాధితురాలిని చికిత్స కోసం నిలోఫర్ దవాఖానకు తీసుకురాగా, పరీక్షించిన వైద్యులు బాలికపై లైంగిక దాడి జరిగిందని నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు 16న మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేశారు. బాధితురాలితో పాటు ఆమె ముగ్గురు స్నేహితులను మలక్‌పేట పోలీసులు విచారించారు. మెహిదీపట్నంకు చెందిన నరేశ్ ఈ వసతి గృహంలో బాత్‌రూంలు, మరుగుదొడ్లు శుభ్రపరుస్తుంటాడు. అతడే బాలికపై అఘాయిత్యానికి పాల్పడినట్టు విచారణలో తేలినట్టు సమాచారం. అందులో ఓ బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది.



జ్వరమూ.. మంచిదే!

6 ప్రయోజనాలు ఉన్నాయంటున్న ఆరు అధ్యయనాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): జ్వరం వస్తే శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా అసౌకర్యంగా ఫీల్ అవుతాం. అయితే, తరచూ నుస్తీ పడటం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఎదురయ్యే రోగాలను కూడా తప్పించుకోవచ్చని తెలుసా? ప్రపంచంలోని ప్రఖ్యాత ఆరు అధ్యయనాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. తరచూ జ్వరం వస్తే కలిగే ఆరు లాభాలను వివరాలతో సహా వెల్లడించాయి.

1. తెల్ల రక్తకణాలు అలర్ట్

జ్వరం వస్తే, శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. దీంతో రోగ నిరోధక వ్యవస్థకు రక్షణగా ఉండే తెల్ల రక్త కణాలు అలర్ట్ పోతాయి. వ్యాధిని కలిగించే బ్యాక్టీరియా, వైరస్‌ల కట్టడికి ఎముక మజ్జలో మరిన్ని తెల్ల రక్తకణాల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. దీంతో రోగ నిరోధక శక్తి మరింత పెరుగుతుందని 'ఇమ్యునాలజీ అండ్ సెల్ బయాలజీ' జర్నల్‌లోని అధ్యయనం తెలిపింది.

2. వైరస్‌ల కట్టడి:

మనం తీసుకొన్న ఆహారం, పీల్చే గాలి ద్వారా బ్యాక్టీరియా, వైరస్‌ల వంటి సూక్ష్మజీవులెన్నో శరీరం లోపలికి ప్రవేశిస్తాయి. ఇవి చైతన్యవంతంగా ఉండాలంటే శరీర ఉష్ణోగ్రత 37 డిగ్రీల సెంటిగ్రేడ్ (98.6 ఎఫ్) ఉండాలి. అయితే, నుస్తీ చేసిన వ్యక్తికి శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. దీంతో ఇన్‌ఫ్లుయెంజా వైరస్ వంటి సూక్ష్మజీవుల సంతానాభివృద్ధి జరుగదు. ఈ మేరకు 'వైరాలజీ' జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం వివరించింది.

3. యాంటీవైరల్ యాక్టివిటీ:

శరీర ఉష్ణోగ్రతలో పెరుగుదల సూక్ష్మక్రిముల వృద్ధిని నిలువరించడమే కాకుండా ఇమ్యూన్ సెల్స్ యాక్టివిటీని పెంచుతుంది. ఉష్ణోగ్రతలో పెరుగుదల సమాంతర్యంగానే సైటోకైన్స్ ప్రొటీన్ ఉత్తేజితమవుతుంది. ఇది యాంటీవైరల్, యాంటీ బ్యాక్టీరియల్ అణువులను శరీరంలోకి విడుదల చేస్తుంది. దీంతో వ్యాధి తీవ్రత తగ్గుతుందని 'క్లినికల్ ఇన్వెస్టిగేషన్' జర్నల్ అధ్యయనం తెలిపింది.

4. కణాల మరమ్మతులు

జ్వరం కారణంగా శరీర ఉష్ణోగ్రత పెరుగడంతో హీట్ షాక్ ప్రొటీన్స్ చైతన్యవంతమవుతాయి. సూక్ష్మజీవుల దాడిలో నాశనమైన కణాలకు ప్రత్యేక ప్రొటీన్ సాయంతో ఇవి మరమ్మతులు చేస్తాయి. తద్వారా రోగనిరోధక శక్తిని ఉత్తేజితం చేస్తాయని 'సెలర్ అండ్ మాలిక్యులార్ సెల్ బయాలజీ' జర్నల్ అధ్యయనం తెలిపింది.

5. డీటాక్సిఫికేషన్ ప్రక్రియ

జ్వరం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగినప్పుడు జీవక్రియ రేటు పెరుగుతుంది. అంటే, చెమటలు పోయడం, మల, మూత్ర విసర్జనలాంటివి జరుగుతాయి. శరీరంలో పేరుకుపోయిన టాక్సిక్ (విష) పదార్థాలను ఇవి బయటకు పంపించేస్తాయి. ఇది శరీరానికి మంచిదని 'టాక్సికాలజీ అండ్ ఎన్విరాన్మెంటల్ హెల్త్' జర్నల్ అధ్యయనం పేర్కొన్నది.

6. ఇమ్యూనిటీ మెమరీ

తరచూ జ్వరంబారిన పడటంతో ఏ సూక్ష్మజీవి ఎలాంటి ప్రమాదాన్ని కలిగిస్తుంది? దాన్ని ఎలా ఎదుర్కోవాలన్న ట్రైనింగ్ రోగ నిరోధక వ్యవస్థకు తెలుస్తుంది. దీంతో ఆ వ్యాధులు మళ్లీ ఎదురైనా.. సులభంగా ఎదుర్కొగలదని 'ఎక్స్‌పర్‌మెంటల్ మెడిసిన్' జర్నల్ అధ్యయనం తెలిపింది.

డ్రైఫ్రూట్స్‌తో టైప్-2 డయాబెటిస్‌కు చెక్!

60 శాతం మేర ముప్పు తగ్గించే అవకాశం



(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): డ్రైఫ్రూట్స్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల టైప్-2 డయాబెటిస్ వచ్చే ముప్పును 60 శాతం మేర తగ్గించవచ్చని యూకే పరిశోధకులు తెలిపారు. డ్రైఫ్రూట్స్ మోతాదును రోజుకు కనీసం 1.3 పీసుల చొప్పున పెంచుకొంటూ పోతే ఆరోగ్యానికి మంచిదని పేర్కొన్నారు. ఎండిన ద్రాక్ష, ఎండిన నేరేడును ఎక్కువగా తీసుకొంటే ఫలితముంటుందని సూచించారు.

అమ్మాయిల కంటే అబ్బాయిలకే.. టైప్-1 డయాబెటిస్ ముప్పు ఎక్కువ!

పదేండ్ల వయసు పైబడిన అమ్మాయిలతో పోల్చి చూస్తే, అబ్బాయిలకే టైప్-1 డయాబెటిస్ వచ్చే ముప్పు ఎక్కువగా ఉన్నదని బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఎక్సెటర్ పరిశోధకులు తెలిపారు. ఇమ్యూనిటీ సెల్స్‌పై ప్రభావం చూపించే ఆటో యాంటీబాడీ ప్రొటీన్లు అబ్బాయిల్లో ఎక్కువగా విడుదల కావడమే దీనికి కారణంగా పేర్కొన్నారు. 2,35,765 మందిపై చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైనట్టు తెలిపారు.

సిస్టోలిక్ రీడింగ్ ఎక్కువా?
గుండెపోటు రావొచ్చు!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): రక్తపోటును గుర్తించడానికి బీపీ మీటర్ (స్ఫిగ్మోమానోమీటర్)లో పై రీడింగ్‌ను సూచించే సిస్టోలిక్ రేటు ఎక్కువగా ఉంటే, భవిష్యత్తులో గుండెపోటు వచ్చే ముప్పు ఎక్కువగా ఉంటుందని మిషిగన్ మెడిసిన్ స్కూల్ పరిశోధకులు తెలిపారు. 18-39 ఏండ్ల మధ్య పురుషులకు సిస్టోలిక్ రీడింగ్ 119 ఎంఎంహెచ్‌జీగా, మహిళలకు 110 ఎంఎంహెచ్‌జీగా ఉంటుంది. అయితే, ఈ రీడింగ్ 10 ఎంఎంహెచ్ పెరిగితే, గుండెపోటు వచ్చే ప్రమాదం 20-31 శాతం మేర ఎక్కువగా ఉంటుంది.

ఇంటర్నెట్ లేకుండానే
వాట్సాప్‌లో ఫైళ్ల ట్రాన్స్‌ఫర్!

న్యూఢిల్లీ: వాట్సాప్‌లో ఇకపై 2జీబీ మించిన ఫైళ్లను ఇంటర్నెట్ లేకుండానే పంపుకొనేలా కొత్త ఫీచర్ రాబోతున్నది. యాపిల్ 'ఎయిర్‌డ్రాప్', గూగుల్ 'నియర్‌బై షేర్'లా ఇది పని చేసే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఆండ్రాయిడ్‌తో పాటు ఐవోఎస్ వెర్షన్‌లోనూ ఇది రానుంది. ఈ ఫీచర్ ద్వారా ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లను పూర్తి భద్రంగా (ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్టెడ్) పంపుకోవచ్చు. ఈ ఫీచర్ ఐవోఎస్‌లో మాత్రం కొంత భిన్నంగా ఉండే అవకాశం ఉంది. అంటే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకొని పంపే ఉంటుందని సమాచారం.

అధికారాన్ని నిలుపుకునేందుకే ప్యాకేజీలు

- బడ్జెట్‌లో ఎన్డీఏ మిత్రపక్షాలకే ప్రాధాన్యం
- ఆ పార్టీలను మెప్పించడానికే ప్రయత్నం
- బడ్జెట్ తీరుపై ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్
- పార్లమెంటులో విపక్ష ఎంపీల ఆందోళన
- ఉభయసభల నుంచి వాకౌట్ చేసిన సభ్యులు
- 'ఎన్డీఏ బడ్జెట్ వద్దు.. ఇండియా బడ్జెట్ కావాలి'
- ప్లకార్డులు ప్రదర్శించిన పార్లమెంటు సభ్యులు

న్యూఢిల్లీ, జూలై 24: మిత్రపక్షాలకు ప్యాకేజీలు ఇచ్చి అధికారాన్ని నిలుపుకునేందుకే బీజేపీ ప్రయత్నిస్తున్నదని, ఎన్డీఏ మిత్రపక్షాలను సంతృప్తి చేసుకునే ప్రయత్నమే కేంద్ర బడ్జెట్ అని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. బడ్జెట్ కేటాయింపుల్లో వివక్షకు నిరసనగా విపక్ష పార్టీల ఎంపీలు పార్లమెంటు మకర్ ద్వార్ వద్ద నిరసన తెలిపారు. అఖిలేశ్ యాదవ్‌తో పాటు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, ఇండియా కూటమి ఎంపీలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిలేశ్ మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో పలు రాష్ర్టాలకు ప్రాధాన్యత దక్కకపోవడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. యూపీలో డబుల్ ఇంజిన్ సర్కారు అధికారంలో ఉన్న ప్పటికీ రాష్ర్టానికి దక్కిందేమీ లేదని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్(సీఎం యోగిని ఉద్దేశించి) ఢిల్లీవారికి ఆగ్రహం తెప్పించారని, అది బడ్జెట్‌లో కనిపించిందని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్న ఇంటర్న్‌షిప్ పథకంపై ఆయన స్పందిస్తూ.. పదేండ్లుగా యువతను నిరుద్యోగులుగా మార్చి ఇప్పుడు రూ.5,000 జీతం వచ్చే ఉద్యోగాలు ఇస్తామని అంటున్నారని ఆయన పేర్కొన్నారు.

సమాఖ్య స్ఫూర్తిపై దాడి

కేంద్ర బడ్జెట్‌లో విపక్షపాలిత రాష్ర్టాలపై వివక్ష చూపించడం భారతదేశ సమాఖ్య స్ఫూర్తిపై దాడిగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అధికారంపై ఆశతో దేశంలోని ఇతర రాష్ర్టాలను కేంద్రం నిర్లక్ష్యం చేసిందని, వివక్ష చూపించిందని పేర్కొన్నారు. అన్ని రాష్ర్టాలకు సమాన న్యాయం జరగాలని ఇండియా కూటమి గొంతు వినిపిస్తుందని అన్నారు. ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, ఎవరికీ దీని వల్ల న్యాయం జరగలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. కాగా, బడ్జెట్ కేటాయింపుల్లో వివక్షను నిరసిస్తూ ఉభయసభల నుంచి ఇండియా కూటమి ఎంపీలు వాకౌట్ చేశారు. 'ఎన్డీఏ బడ్జెట్ వద్దు.. ఇండియా బడ్జెట్ కావాలి' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ పార్లమెంటు ప్రాంగణంలో నిరసన తెలిపారు.



బడ్జెట్ కేటాయింపులపై నిరసన తెలుపుతున్న విపక్ష పార్టీల ఎంపీలు



అన్ని రాష్ర్టాలను ఎలా ప్రస్తావిస్తాం?: నిర్మల

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): ఎన్డీఏ మిత్రపక్షాలు అధికారంలో ఉన్న ఏపీ, బీహార్‌కు మాత్రమే బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇచ్చారంటూ కేంద్రప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ర్టాలపట్ల వివక్షలు కేంద్రం వైఖరిని ఎండగట్టాయి. దీనిపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. బడ్జెట్‌లో అన్ని రాష్ర్టాల పేర్లను ప్రస్తావించే అవకాశం ఉండదని, మహారాష్ట్ర పేరును తీయనప్పటికీ, ఆ రాష్ర్టానికి నిధులు ఇచ్చినట్టు వెల్లడించారు. మహారాష్ట్ర కాకుండా అలా నిధులు కేటాయించిన మరో రాష్ట్రం పేరు చెప్పమంటూ మీడియా ప్రతినిధి ఒకరు అడుగగా, తనకు వినబడలేదని నిర్మల అక్కడి నుంచి వెళ్లిపోయారు.

తక్కువ ఖర్చుతో టీబీ పరీక్ష

టెక్నాలజీని అభివృద్ధి చేసిన 'ఐసీఎంఆర్'



న్యూఢిల్లీ, జూలై 24: టీబీని తక్కువ ఖర్చుతో, వేగంగా గుర్తించడానికి భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసింది. 'సీఆర్ఐఎస్‌పీఆర్ టీబీ డిటెక్షన్' అనే టెక్నాలజీని వాణిజ్యపరంగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ఐసీఎంఆర్ పెద్ద ఎత్తున కసరత్తు చేస్తున్నది. టెక్నాలజీని బదిలీ చేయడం ద్వారా 'టీబీ డిటెక్షన్' సిస్టమ్స్ తయారీపై వివిధ సంస్థలు, కంపెనీలకు ఆహ్వానం పలికింది. డబ్ల్యూహెచ్‌వోకు చెందిన ఐసీఎంఆర్ సెంటర్లు, గోవా, ఇతర రీజనల్ సెంటర్ల ద్వారా ఇండియాలో టీబీ బ్యాక్టీరియాను గుర్తించే టెక్నాలజీని అభివృద్ధి చేశారు. ప్రపంచంలోనే అత్యంత చవకైన పద్ధతిలో దీనిని వారు పేర్కొన్నారు. సుమారుగా 1500 శాంపిల్స్‌ను కేవలం రెండు గంటల్లో పరీక్షించి, టీబీ ప్రాథమిక లక్షణాల్ని గుర్తించవచ్చని తెలుస్తున్నది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ (పీహెచ్‌సీ) ఈ పరీక్షలు నిర్వహించడానికి వీలుగా ఐసీఎంఆర్ ప్రయత్నిస్తున్నట్టు ఒకరు చెప్పారు.

హాటెస్ట్ డేగా జూలై 22

84 ఏండ్లలో ఇదే అత్యధికం

న్యూఢిల్లీ: గత 84 ఏండ్లలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన రోజుగా జూలై 22వ తేదీ రికార్డు సృష్టించింది. ఈ రోజున ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 17.15 డిగ్రీలుగా నమోదైనట్టు యూరోపియన్ యూనియన్‌కు చెందిన కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్(సీ3ఎస్) తెలిపింది. జూలై 21వ తేదీన 17.09 డిగ్రీల ప్రపంచ సగటు ఉష్ణోగ్రత నమోదు కావడం రికార్డు సృష్టించగా, మరుసటి రోజే దీనికి మించి నమోదైందని పేర్కొన్నది. తమ ప్రాథమిక డాటా ప్రకారం 1940 తర్వాత అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన రోజు జూలై 22 అని సీ3ఎస్ తెలిపింది. దీనికి ముందు గత ఏడాది జూలై 6న అత్యధికంగా 17.08 డిగ్రీల ప్రపంచ సగటు ఉష్ణోగ్రత నమోదైంది. గత ఏడాది జూన్ నెల నుంచి వరుసగా 13 నెలలుగా ప్రతి నెలా ఉష్ణోగ్రతల రికార్డులు సృష్టిస్తున్నాయని సీ3ఎస్ డైరెక్టర్ కార్లో బౌంటెంపో తెలిపారు.



మనిషి ఒత్తిడికి తగ్గట్టు శునకాలూ మారుతాయ్!

న్యూఢిల్లీ: మనిషి ఒత్తిడికి గురైనప్పుడు శరీరం నుంచి విడుదలయ్యే వాసనను శునకాలు పసిగట్టగలుగుతాయని, దానికి తగ్గట్టుగా తమ వ్యవహారశైలిని మార్చుకుంటాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఒత్తిడి వాసన రాగానే అవి కూడా నిరాశావాదంతో ఉంటాయని యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్ పరిశోధకులు వెల్లడించారు. ఎవరైనా వ్యక్తి ఒత్తిడితో ఉన్నప్పుడు వారి నుంచి వెలువడే వాసనతో ఉన్న ఈ వ్యక్తి కూడా ప్రభావితులు అవుతారని గతంలోనే గుర్తించారు. ఇలాంటి ప్రభావమే జంతువుల్లోనూ పడుతుందా? అని 18 శునకాలు, వాటి యజమానులను ఎంచుకొని పరీక్షించగా తాజా విషయం తెలిసింది.

బట్టతల సమస్యను పరిష్కరించే చక్కెర



లండన్: ప్రపంచంలో దాదాపు 50 శాతం మంది పురుషులు ఎదుర్కొనే బట్టతల సమస్యకు తాము పరిష్కారం గుర్తించామని చెప్తున్నారు బ్రిటన్, పాకిస్థాన్‌కు చెందిన కొందరు పరిశోధకులు. శరీరంలో సహజంగా ఉత్పత్తయ్యే 2-డీయాక్సీ-డీ-రైబోస్ అనే చక్కెర సహజంగా ఉత్పత్తయ్యే చక్కెర ద్వారా బట్టతలపై వెంట్రుకలు తిరిగి పెరుగుతాయని చెప్తున్నారు. బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ షెఫీల్డ్, పాకిస్థాన్‌లోని కామ్‌సాట్స్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ చక్కెరను గుర్తించారు. ఇది రక్తనాళాల ఏర్పాటును ప్రోత్సహిస్తుందని, వెంట్రుకల కుదుళ్లకు పోషించే కొత్త వెంట్రుకలు పెరిగేందుకు ఉపయోగపడుతుందని వీరు తెలిపారు. గాయాల్ని మాన్పించేందుకు రక్తనాళాల్ని పెంపొందించే గత పరిశోధనల్లో 2-డీయాక్సీ-డీ-రైబోస్ వినియోగంపై ప్రయోగాలు చేస్తున్నప్పుడు, అనుకోకుండా ఇది వెంట్రుకల్ని కూడా ఉపయోగపడుతుందని తేలిందని చెప్తారు. ఇప్పుడు బట్టతలకు చికిత్సగా అమల్లో ఉన్న మినాక్సిడిల్ ఇచ్చే ఫలితాలకు సమానంగా దీని ఫలితాలు కూడా ఉన్నాయని తేలిందని పేర్కొన్నారు.

సాగు చట్టాలకు దొడ్డి దారి

బడ్జెట్‌పై ఎస్కేఎం ఆగ్రహం



మా బకాయిలు చెల్లించండి





అలా చేస్తే మీరు ఒంటరైపోతారు!

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 2024-25పై సంయుక్త కిసాన్ మోర్చా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేయడానికి ఈ బడ్జెట్ బాటలు పరుస్తున్నదని మండిపడింది. రద్దయిన మూడు సాగు చట్టాలకు దొడ్డి దారిలో ప్రవేశం కల్పిస్తున్నదని ఆరోపించింది. ఎస్కేఎం నేతలు బుధవారం వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ కొత్త బడ్జెట్‌లో రైతుల స్థితిగతులను మెరుగుపరిచే నిబంధనలేవీ లేవన్నారు. భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ టికాయత్ మాట్లాడుతూ, ఈ బడ్జెట్‌లో రైతుల కోసం ఏమీ లేదన్నారు. గత ఏడాది బడ్జెట్ మాదిరిగానే ఇది కూడా ఉందని వ్యాఖ్యానించారు. బీహార్‌కు ఆర్థిక ప్యాకేజీ ఇచ్చినప్పటికీ, వ్యవసాయ రంగాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. ఆలిండియా కిసాన్ మహాసభ నేత ఆశిష్ మిట్టల్ మాట్లాడుతూ, ప్రత్యేక వ్యవసాయం వల్ల లక్షల్లో ఉత్పత్తి తగ్గిపోతుందని అంటూ, శ్రీలంక పరిస్థితిని గుర్తు చేశారు. జై కిసాన్ ఆందోళన్ నేత అవీక్ సాహా మాట్లాడుతూ, సాగు చట్టాలను దొడ్డి దారి ప్రవేశం కల్పించేందుకు ఈ బడ్జెట్ ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాంచీ, జూలై 24: కేంద్రం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జార్ఖండ్ రాష్ర్టాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని సీఎం హేమంత్ సోరెన్ ఆరోపించారు. తమ రాష్ర్టానికి కేంద్రం రూ.1.36 లక్షల కోట్ల బకాయి పడిందని, వాటిని వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 'మా రాష్ట్రంపై ఎందుకు వివక్ష? మేము భారతదేశంలో భాగం కాదా?' అని ప్రశ్నించారు. ఇప్పటికే కేంద్రం మాకు రూ.1.36 లక్షల కోట్లు బకాయి ఉంది. కానీ, బీజేపీ నేతలంతా దీనిపై మౌనంగా ఉన్నారు. మీ ఆశలన్నీ ఆలోచనల్లో ప్రత్యేక ప్యాకేజీలు ఇచ్చుకోండి' అని ఆయన బీహార్, ఏపీ ప్యాకేజీలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. జార్ఖండ్ రాష్ట్రం ఎన్డీఏకు 9 మంది ఎంపీలను ఇచ్చినా, పూర్తి నిర్లక్ష్యం చూపారని ఆరోపించారు. దేశంలో 60 శాతం ప్రజలు ఆధారపడ్డ వ్యవసాయ రంగానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యం ఇవ్వలేదని, కేంద్రం తన బడ్జెట్ స్నేహితులకు వరాలు కట్టబెట్టిందని సోరెన్ విమర్శించారు.

చెన్నై, జూలై 24: కేంద్ర బడ్జెట్‌లో విపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ర్టాలకు ప్రాధాన్యత దక్కకపోవడంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి ఆయన బుధవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'ఎన్నికలు అయిపోయాయి. ఇప్పుడు మనం దేశం గురించి ఆలోచించాలి. 2024 బడ్జెట్ మీ ప్రభుత్వాన్ని కాపాడవచ్చు. కానీ, ఈ దేశాన్ని మాత్రం కాపాడదు. ప్రభుత్వాన్ని నిష్పక్షపాతంగా నడిపించండి. మిమ్మల్ని ఓడించిన వారి పట్ల ఇంకా ప్రతీకారం తీర్చుకోకండి. మీ రాజకీయ ఇష్టాయిష్టాల ప్రకారం పాలన చేస్తే మీరు ఒంటరిగా మిగిలిపోతారు' అంటూ స్టాలిన్ వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడుకు కేటాయింపులు లేకపోవడంపై డీఎంకే ఎంపీలు బుధవారం పార్లమెంటు ప్రాంగణంలో నిరసన తెలియజేశారు.


కోచింగ్ ఫీజుపై దక్కని ఊరట

బడ్జెట్‌పై నీట్ అభ్యర్థుల అసంతృప్తి

కోటా : విద్యార్థుల కోచింగ్ ఫీజుపై ఇప్పటివరకు 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్న కేంద్రం ఈ బడ్జెట్‌లో దానికి మినహాయింపు ఇస్తుందని విద్యార్థులు ఆశించారు. అయితే ఎలాంటి రాయితీ ఇవ్వకపోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఇక్కడ నీట్‌కు కోచింగ్ తీసుకుంటున్న పలువురు విద్యార్థులు కేంద్రంపై మండిపడ్డారు. 'విద్య ఒక హక్కు. దానిపై ఎలాంటి పన్ను ఉండరాదు. అయితే ప్రభుత్వం 18 శాతం వసూలు చేస్తున్నది. కోచింగ్ ఫీజుపై జీఎస్టీని మినహాయిస్తే ఎందరో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గేది. కానీ ఈ విషయాన్ని కేంద్రం ఎలాంటి చర్య తీసుకోలేదు' అని ఒక నీట్ విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశారు.

విమర్శిస్తే.. అవమానిస్తారా?


- ప్రజలను ట్రోల్ చేయడం సరికాదు
- బీజేపీ ఐటీ సెల్‌పై ఆర్ఎస్ఎస్ రచయిత రతన్ శార్ద ఆగ్రహం



బీజేపీ నేతల వైఖరిపై విమర్శలు

న్యూఢిల్లీ, జూలై 24: బీజేపీ ఐటీ విభాగం వైఖరి, దాని అధ్యక్షుడు అమిత్ మాలవీయ తీరుపై రచయిత రతన్ శార్ద తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలను ట్రోల్ చేస్తున్న బీజేపీ ఐటీ సెల్ వైఖరి తీవ్ర సమస్యగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ ఇంటర్వ్యూలో తెలుగుమ్మ కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక అంశాన్ని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమయ్యాయి. వీటిపై స్పందించిన బీజేపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్ మాలవీయ.. 'ఈ రాష్ట్రానికి ప్రతీకారంగా ఇండెక్సేషన్ నిబంధనల' అంటూ ఎడిటర్ వేసిన 'ఎక్స్'లో పోస్ట్ చేసి తీవ్రంగా డిబేట్ చేశారు. ఈ పోస్ట్‌పై రతన్ శార్ద స్పందించారు. 'బీజేపీ ఐటీ విభాగం వైఖరితో తీవ్ర సమస్య ఉంటుంది. బడ్జెట్‌లోని మంచి అంశాలను సులువైన పద్ధతిలో చెప్పడానికి బదులు ప్రజలను ట్రోల్ చేస్తున్నారు. ప్రజల భయాలకు సమాధానం ఇవ్వండి. వారిని అవమానించకండి' అంటూ రతన్ శార్ద పోస్ట్ చేశారు.

ఆర్ఎస్ఎస్ అనుబంధ రచయిత రతన్ శార్ద 'కాన్‌స్టిక్ రెజల్యూషన్: ది ఆర్ఎస్ఎస్ వే', 'ఆర్ఎస్ఎస్ ఫ్రమ్ యాన్ ఆర్గనైజేషన్ టు ఏ మూవ్‌మెంట్' వంటి అనేక పుస్తకాలను ఆయన ఆర్ఎస్ఎస్‌కు రాశారు. తాను ఆర్ఎస్ఎస్‌కు జీవితకాల సభ్యుడిగా ఉన్న సంబంధం ఉన్నప్పటికీ, బీజేపీ తీరుపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీని ఎన్డీఏలోకి చేర్చుకోవడాన్ని తప్పుపడుతూ ఆయన ఆర్ఎస్ఎస్ పత్రిక 'ఆర్గనైజర్'లో గతంలో ఒక వ్యాసం రాశారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తాకిన ఎదురుదెబ్బను ఉద్దేశించి కూడా ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ఫలితాలు అతివిశ్వాసంతో ఉన్న అనేక మంది బీజేపీ నేతలు, కార్యకర్తలకు వాస్తవ పరిస్థితులు తెలిసేలా చేశాయని పేర్కొన్నారు.



నువ్వు మహిళవు.. నీకేం తెలియదు

పాట్నా, జూలై 24: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బుధవారం అసెంబ్లీలో ఆర్జేడీ మహిళా ఎమ్మెల్యేపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో సవరించిన రిజర్వేషన్ చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పొందుపరచాలని ఆర్జేడీకి చెందిన మహిళా ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై నితీశ్ వ్యతిరేకమని పేర్కొన్నారు. 'నీతీశ్ కుమార్ హాయ్ హాయ్' అంటూ నినాదాలు చేశారు. దీంతో నితీశ్ సహనాన్ని కోల్పోయారు. వారిపై, ముఖ్యంగా రేఖాదేవి అనే ఎమ్మెల్యేపై వేలెత్తి చూపుతూ గట్టిగా అరిచారు. 'నువ్వు మహిళవు. నీకేమీ తెలియదు. నేను అధికారం చేపట్టాక బీహార్‌లో మహిళలకు ప్రయోజనాలు దక్కాయి. అది నీకు తెలుసా?' అంటూ గట్టిగా అరిచారు.



మాతాజీ కాదు.. ఆమె మీ కూతురు లాంటిది

న్యూఢిల్లీ, జూలై 24: కేంద్రం మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై బుధవారం రాజ్యసభలో వాడీవేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన సంబోధనపై ఛైర్మన్ చేసిన వ్యాఖ్యలతో సభలో నవ్వులు విరిశాయి. బడ్జెట్‌లో బీహార్, ఏపీలకే నిధులిచ్చారే తప్ప, మిగతా రాష్ర్టాలకు మొండిచేయి చూపారని ఖర్గే విమర్శించారు. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ జోక్యం చేసుకున్నారు. అయితే దీనిపై ఖర్గే 'మొదట దీనిని పూర్తి చేయనివ్వండి. నాకు తెలుసు మాతాజీ (అమ్మ) మాట్లాడటంలో ఎంతో నిపుణురాలు అని' అన్నారు. దీనికి జగదీప్ ధన్‌ఖడ్ స్పందిస్తూ 'ఆమె మాతాజీ కాదు. మీ కూతురు లాంటిది' అంటూ చలోక్తి విసరడంతో సభలో అందరూ నవ్వారు.

4జీ, 5జీ.. మరింత ప్రియం!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): టెలికం రంగంలో కీలకంగా భావించే నెట్‌వర్క్ ఎక్విప్‌మెంట్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ అసెంబ్లీ (పీసీబీఏ)పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ)ని కేంద్రం 15 శాతానికి పెంచింది. దీంతో 4జీ, 5జీ నెట్‌వర్క్‌ల రోల్ అవుట్ చేసే టెలికం సంస్థలపై అదనపు భారం పడనున్నట్టు చెప్తున్నారు. వొడాఫోన్ ఐడియా, బీఎస్ఎన్ఎల్ వంటి సంస్థలు 5జీ నెట్‌వర్క్‌ను రోల్ అవుట్ చేయాల్సి ఉంది. బీసీడీపెంపు తాజా పెంపుతో ఆయా సంస్థలకు భారం పడుతుందని, దీని వినియోగదారులపై ప్రభావం చూపొచ్చని పారిశ్రామికవర్గాలు పేర్కొంటున్నాయి.

పొగరాయుళ్లకు ఉపశమనం!

పొగాకు ఉత్పత్తులపై పన్నులు పెంచని కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 24: కేంద్ర బడ్జెట్‌లో ఈసారి పొగరాయుళ్లకు ఉపశమనం లభించింది. మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2024-25లో పొగాకు ఉత్పత్తులపై పన్నుల్లో కేంద్రం ఎలాంటి మార్పులు చేయలేదు. గత బడ్జెట్‌లో పన్నులను పెంచే జాబితాలో తప్పనిసరిగా ఉండే పొగాకు ఉత్పత్తుల్ని, మోదీ సర్కార్ ఈసారి మినహాయించింది. దీంతో దేశంలో ప్రముఖ సిగరెట్ తయారీ కంపెనీ 'ఐటీసీ' షేర్లు కొంతమేర పెరిగాయి. ఏటా ప్రతి బడ్జెట్‌లో పొగాకు ఉత్పత్తులపై కేంద్రం 'నేషనల్ కలామిటీ కంటింజెంట్ డ్యూటీ' (ఎన్‌సీసీడీ) పేరుతో పన్నులు పెంచేది. దీంతో పొగాకు ధరలు పెరిగి, ఐటీసీ వంటి కంపెనీల్లో మధ్యంతర పెరుగుదలకు దారితీసేది. గత ఏడాది ఎన్‌సీసీడీ పన్ను రేట్లు 16శాతం పెరిగాయి.

త్వరలో 2,500 సాధారణ కోచ్‌లు

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 24: కొత్త బడ్జెట్‌లో రైల్వే శాఖకు అధిక నిధులు కేటాయించారని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సంతోషం వ్యక్తం చేశారు. బడ్జెట్ అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తక్షణమే 2,500 సాధారణ కోచ్‌లు(నాన్ ఏసీ) నిర్మించి, వాటిని త్వరలో ప్రవేశపెట్టనున్నట్టు పేర్కొన్నారు. రానున్న మాసాల్లో మరో 10 వేల కోచ్‌లను తీసుకొచ్చే ప్రణాళిక ఉన్నదని తెలిపారు. మధ్యతరగతి, అల్పాదాయ కుటుంబాలకు సరసమైన, సురక్షితమైన రైల్వే ప్రయాణాన్ని అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. రైల్వే శాఖకు 2014కు ముందు రూ.35 వేల కోట్లుగా ఉన్న బడ్జెట్ కేటాయింపులు.. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2.62 లక్షల కోట్లకు పెరిగినట్టు తెలిపారు.

ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌తో పాన్..
అక్టోబర్ 1 నుంచి నిలిపివేత

న్యూఢిల్లీ, జూలై 24: ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీతో 'పాన్' కార్డ్ పొందడాన్ని అక్టోబర్ 1 నుంచి నిలిపివేస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీని కోట్ చేస్తూ.. ఐటీ రిటర్న్ దాఖలు చేయడాన్ని కూడా ఇకపై అనుమతించబోమన్నట్టు కేంద్రం తెలిపింది. ఎన్‌రోల్‌మెంట్ ఐడీ ఆధారంగా 'పాన్' కార్డ్ కేటాయింపు నకిలీలకు దారితీస్తున్నది. దీనిని నిలిపివేయడమే ఉద్దేశమని సర్' అని కేంద్ర బడ్జెట్ పత్రాల్లో నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. 2017లో కేంద్రం తీసుకొచ్చిన ఈ ఆప్షన్‌తో పాన్ కార్డ్ పొందినవారు, ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేసినవారు తమ ఆధార్ నంబర్లను అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకోసం ఒక నిర్దిష్ట తేదీని తీసుకురావాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

రైతులు, ప్రభుత్వం మధ్య విశ్వాస లోపం

- ఇద్దరి మధ్య 'తటస్థ అంపైర్లు' ఉండాలి
- రైతు సమస్యల పరిష్కారానికి కమిటీ
- సర్వోన్నత న్యాయస్థానం ప్రతిపాదన
- శంభు సరిహద్దు వద్ద యథాతథ స్థితి
- పంజాబ్, హర్యానా ప్రభుత్వాలకు ఆదేశం



న్యూఢిల్లీ, జూలై 24: రైతుల ఆందోళనపై సుప్రీంకోర్టు బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న రైతులకు, ప్రభుత్వాలకు మధ్య విశ్వాసం లోపించినట్టు కనిపిస్తున్నదని అభిప్రాయపడింది. రైతుల సమస్యల పరిష్కారంపై చర్చించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని పంజాబ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలను కోర్టు సూచించింది. ప్రభుత్వం, రైతుల మధ్య విశ్వాసాన్ని కలిగించేందుకు 'తటస్థ అంపైర్లు' ఉండాల్సిన అవసరం ఉన్నదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం పేర్కొన్నది. కమిటీలో సభ్యుల పేర్లను సూచించాలని రెండు ప్రభుత్వాలను సూచించింది. హర్యానాలోని శంభు సరిహద్దు వద్ద అడ్డుకట్టల్ని తొలగించాలన్న పంజాబ్-హర్యానా హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ హర్యానా ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. డిమాండ్ల సాధన కోసం రైతులు ఈ ఏడాది ఫిబ్రవరిలో చేపట్టిన 'ఛలో ఢిల్లీ' మార్చ్‌ను అడ్డుకొనేందుకు ప్రభుత్వం శంభు సరిహద్దు హైవేను దిగ్బంధించింది. బారికేడ్లు, ఇతర అడ్డంకులను ఏర్పాటు చేసి అడ్డుకోవడంతో రైతులు అక్కడే ఆందోళనకు దిగారు.

విశ్వాసం కలిగించే చర్యలు తీసుకోవాలి

విచారణ సందర్భంగా ప్రభుత్వానికి సుప్రీంకోర్టు పలు ప్రశ్నలు సంధించింది. ఆందోళన చేస్తున్న రైతులతో చర్చించేందుకు ఏమైనా చొరవ తీసుకొన్నారా? అని ప్రశ్నించింది. 'మీ మంత్రులు స్థానిక సమస్యలు తెలియకుండా రైతుల వద్దకు వెళ్లి ఉండొచ్చు. అక్కడే రైతులకు, ప్రభుత్వానికి విశ్వాసం లోపం కనిపిస్తున్నది. కొంత మంది తటస్థ అంపైర్లు ఎందుకు ఉండకూడదు? ఇద్దరి మధ్య విశ్వాసాన్ని కలుగజేసేలా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది' అని ధర్మాసనం అభిప్రాయపడింది. పిటిషన్‌పై విచారణను వచ్చే వారానికి వాయిదా వేసిన న్యాయస్థానం.. శంభు సరిహద్దు వద్ద యథాతథ స్థితిని కొనసాగించాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ప్రజలు అసౌకర్యం కలుగకుండా బారికేడ్ల తొలగింపుపై ఒక ప్రణాళికను ప్రతిపాదించాలని సూచించింది.

ముందు రైతుల వద్దకు వెళ్లాలి

రైతులను ఢిల్లీలోకి అనుమతిస్తే, శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉన్నదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. దీనిపై బెంచ్ స్పందిస్తూ.. 'మీరు(ప్రభుత్వం) కొంత ప్రయత్నం చేయాలి. అన్నిటి కంటే ముందు మీరు రైతుల వద్దకు వెళ్లాలి. లేకుంటే వారు(రైతులు) ఎందుకు ఢిల్లీ రావాలని అనుకొంటారు?' అని పేర్కొన్నది. రైతులను తమ ట్రాక్టర్లు, ఇతర వాహనాలను సాయుధ ట్యాంకులుగా మార్చారని మెహతా పేర్కొనగా.. 'మీరు చేస్తున్న వాదనలు కూడా విశ్వాస లోపాన్ని చూపిస్తున్నాయి' అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

హామీల అమలులో కేంద్రం విఫలం

హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్ల సాధన కోసం ఢిల్లీకి మార్చ్‌ను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పంజాబ్, హర్యానా, యూపీ పలు ఇతర రాష్ట్రాలకు చెందిన నేతలు బుధవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని పార్లమెంట్ కాంప్లెక్స్‌లో కలిసారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై చర్చించారు. ఎంఎస్పీకి చట్టబద్ధతను సాధించేందుకు ప్రభుత్వంపై విపక్ష ఇండియా కూటమి ఒత్తిడి తీసుకొస్తుందని రాహుల్ పేర్కొన్నారు. పంటలకు కనీస మద్దతు ధర దక్కడం రైతుల హక్కు అని, ఆ హక్కు వారికి దక్కేలా కృషి చేస్తామని అన్నారు.



నేపాల్‌లో బుధవారం ఓ విమానం కుప్పకూలడంతో 18 మంది ప్రాణాలు కోల్పోగా, పైలట్ గాయాలపాలయ్యారు. ఖాట్మాండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉన్న రెండో రన్‌వే నుంచి పొఖారాకు బయల్దేరిన బొంబార్డియర్ సీఆర్‌జే-200 విమానం.. టేకాఫ్ అయిన నిమిషంలోనే కూలిపోయింది. బుధవారం ఉదయం 11.11 గంటలకు (స్థానిక కాలమానం) ఈ దుర్ఘటన జరిగింది. ఈ విమానంలో మొత్తం 19 మంది ఉన్నారు. వీరిలో పైలట్ మనీశ్ రత్న షాక్య (37)కు తీవ్ర గాయాలయ్యాయి. 18 మంది అక్కడికక్కడే మృతి చెందగా, దవాఖానలో చికిత్స పొందుతూ ముగ్గురు మరణించారు. - ఖాట్మాండు

టిఫిన్ డబ్బులు కావాలంటే నేనిస్తా!

ఎమ్మెల్యేలపై గవర్నర్ రూ.500 ఫైన్ వేయడంపై మమత చురకలు

కోల్‌కతా, జూలై 24: ఇటీవల అసెంబ్లీ స్పీకర్ ముందు ప్రమాణ స్వీకారం చేసిన కొత్తగా ఎన్నికైన ఇద్దరు టీఎంసీ ఎమ్మెల్యేలపై గవర్నర్ రూ.500 జరిమానా విధించడంపై పశ్చిమబెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి ఫైర్ అయ్యారు. అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకొనేందుకు గవర్నర్ ఆనంద్ బోస్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 'మీకు టిఫిన్ డబ్బులు కావాలంటే, నన్ను అడగండి నేనిస్తా' అంటూ గవర్నర్ ఆదేశాలపై చురకలు అంటించారు. 'రాజ్‌భవన్ సెలెక్టెడ్, అసెంబ్లీ ఎలెక్టెడ్' అనే విషయాన్ని గవర్నర్ గుర్తుంచుకోవాలన్నారు. నేరగాళ్లు, సిట్ స్కామ్ సూత్రధారులపై ఫైన్ వేయలేని ఆయన, ప్రజలు ఎన్నుకొన్న ఎమ్మెల్యేలపై ఫైన్ వేస్తున్నారని, ఒక రాజకీయ పార్టీకి తొమ్మ కాయకూడదని హితవు పలికారు. గవర్నర్ ఆదేశించిన విధంగా కాకుండా స్పీకర్ ముందు ప్రమాణ స్వీకారం చేయడం, అసెంబ్లీకి హాజరవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ టీఎంసీ ఎమ్మెల్యేలు సయంతికా బెనర్జీ, హంస్రీస్ సర్కార్‌పై రూ.500 జరిమానా విధిస్తూ రాజ్‌భవన్ సోమవారం ఇద్దరికి ఈమెయిల్ చేసిన విషయం తెలిసిందే.

నీట్ రద్దుకు బెంగాల్ అసెంబ్లీ తీర్మానం

కోల్‌కతా: నీట్ పరీక్షపై నిరసన గళం విప్పిన రాష్ట్రాలలో పశ్చిమ బెంగాల్ కూడా చేరింది. వైద్య విద్యా సంస్థలలో ప్రవేశం కోసం దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్‌ను రద్దు చేసి, ఆయా రాష్ట్రాలే వాటిని నిర్వహించుకునేలా పూర్వపు పరీక్షా విధానాన్ని పునరుద్ధరించాలని బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ బుధవారం అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించింది. ఇలా నీట్‌ను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసిన రాష్ట్రాల జాబితాలో బెంగాల్ చేరింది. అంతకుముందు తమిళనాడు కూడా నీట్ తమకు వద్దంటూ అసెంబ్లీలో తీర్మానించింది.

పరీక్షల్లో అక్రమాల నిరోధానికి

బీహార్‌లో బిల్లు

పాట్నా: ప్రవేశపరీక్షల్లో అక్రమాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించేందుకు బీహార్ శాసనసభ బుధవారం ఓ బిల్లును ఆమోదించింది. గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష, రూ.1 కోటి వరకు జరిమానా విధించేందుకు ఈ బిల్లు అవకాశం కల్పిస్తున్నది. నేరాలకు కోసం పరీక్షలు రాస్తూ పట్టుబడితే మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షలు వరకు జరిమానా విధించవచ్చునని చెప్తున్నది.



అమెరికాలో 'హైడ్రోథర్మల్ పేలుడు'

అమెరికాలో ఓ భారీ పేలుడు అందరినీ ఆందోళనకు గురిచేసింది. విస్కాట్ బేసిన్‌లోని యెల్లోస్టోన్ జాతీయ పార్కులో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. భూమిలో భారీ శబ్దంతో పేలుడు సంభవించి నీరు, మట్టి ఎగిసిపడ్డాయి. దీంతో సందర్శకులు భయంతో పరుగులు తీశారు. దీనిని 'హైడ్రోథర్మల్' పేలుడుగా అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. భూమి లోపల నీరు వేడెక్కి ఆవిరిగా మారినప్పుడు ఒత్తిడి ఏర్పడుతుందని, ఒత్తిడి పెరిగినప్పుడు ఇలా పేలుళ్లు సంభవిస్తాయని, వీటిని హైడ్రోథర్మల్ పేలుళ్లు అంటారని తెలిపింది. - లాస్ ఏంజిల్స్

చావలేదని నిరూపించేందుకు నేరం!

న్యూఢిల్లీ: ఓ వ్యక్తి మరణించినట్టు ప్రభుత్వ రికార్డులు చెప్తుండగా, తాను జీవించే ఉన్నానని నిరూపించుకోవడానికి ఆ వ్యక్తి నేరగాడిగా మారారు. రాజస్థాన్‌లోని బలోత్ర జిల్లా, సిరోరా గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థుడు బాబూరామ్ భీల్ మరణించినట్టు అధికారులు మరణ ధ్రువపత్రాన్ని జారీ చేశారు. తాను సజీవంగా ఉన్నానని, రికార్డుల్లో పొరపాటును సరిదిద్దాలని ఆయన అధికారులను అనేక విధాలుగా కోరారు. కానీ ఫలితం లేకపోయింది. దీంతో ఆయన ఈ నెల 19న గ్రామంలోని పాఠశాలకు వెళ్లి, ఇద్దరు టీచర్లను, మరో వ్యక్తిని కత్తితో పొడిచారు. కొందరు టీచర్లు, విద్యార్థులను నిర్బంధించారు. ఈ సమాచారాన్ని అందుకున్న పోలీసులు వచ్చి, ఆయనను అరెస్ట్ చేశారు. తాను మరణించినట్టు ధ్రువపత్రం జారీ చేశారని, తాను సజీవంగా ఉన్నట్టు నిరూపించడానికే ఈ విధంగా చేశానని భీల్ చెప్పారు.

కూలీకి దొరికిన రూ.80 లక్షల వజ్రం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని పన్నా జిల్లాలో రాజు గౌడ్ అనే కూలీకి అదృష్టం వరించింది. జీవనోపాధి కోసం గనులను కౌలుకు తీసుకునే రాజు ప్రతి రోజూ మాదిరిగానే బుధవారం కూడా మట్టిని తవ్వుతున్నారు. ఆ సమయంలో ఆయనకు 19.22 క్యారెట్ల వజ్రం కనిపించింది. వెంటనే దానిని ప్రభుత్వ అధికారులకు అప్పగించారు. పన్నా డైమండ్ కార్యాలయం అధికారి అనుపమ్ సింగ్ మాట్లాడుతూ, ఈ వజ్రాన్ని త్వరలో జరిగే వేలంలో విక్రయిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ సురేశ్ కుమార్ మాట్లాడుతూ, రాజుకు 19.22 క్యారెట్ల వజ్రం దొరికిందన్నారు. వేలంలో దీనికి రూ.80 లక్షలకుపైగా పలికే అవకాశం ఉందని చెప్పారు. ఈ వజ్రాన్ని అమ్మగా వచ్చే సొమ్ముతో తన పిల్లలను చదివిస్తానని రాజు చెప్పారు.

బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థ రెండో దశ పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ: స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన 'బాలిస్టిక్ మిస్సైల్ రక్షణ వ్యవస్థ' రెండో దశ ప్రయోగం సక్సెస్ అయ్యింది. 5 వేల కిలోమీటర్ల పరిధి కలిగిన శత్రు దేశ క్షిపణులను ఇది ఎదుర్కొగలదు. ఒడిశాలోని చాందీపూర్‌లో ఈ ప్రయోగం చేపట్టారు. క్షిపణి రక్షణ వ్యవస్థ పూర్తి సామర్థ్యాల ప్రదర్శించిందని రక్షణ శాఖ తెలిపింది. బాలిస్టిక్ క్షిపణిని పోలిన టార్గెట్ మిస్సైల్‌ను భూమి, సముద్రంపై ఏర్పాటు చేసిన రాడార్లు గుర్తించాయని, 'ఇంటర్‌సెప్టార్' వ్యవస్థతో దాన్ని కూల్చేశాయని పేర్కొన్నది.



బగ్ కారణంగానే ఆగిన కంప్యూటర్లు: క్రౌడ్‌స్ట్రైక్

వాషింగ్టన్: కంప్యూటర్లు సైరెస్లు, హ్యాకింగ్‌ల బారిన పడకుండా యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసే క్రమంలో ఓ బగ్ చేరిందని, దాని కారణంగా మా సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలోని వైరస్‌లను చూడని డాటా కొట్టుకుని కంప్యూటర్లలోకి చేరిందని క్రౌడ్‌స్ట్రైక్ సంస్థ వెల్లడించింది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా విమాన సేవలు, టెలివిజన్ ప్రసారాలు, బ్యాంకులు, దవాఖానల సేవలకు అంతరాయం ఏర్పడిందని వివరించింది. ఇకముందు ఇలాంటి అవాంతరాలు తలెత్తకుండా జాగ్రత్త వహిస్తామని తెలిపింది. ఏదైనా అప్‌డేట్ చేసేముందు వినియోగదారులకు సమాచారమిస్తామని, వాటిని అధిగమించే సామర్థ్యాన్ని కూడా కల్పిస్తామని పేర్కొంది.

కుప్వారాలో ఎన్‌కౌంటర్.. అమరుడైన సైనికుడు

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని కుప్వారాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ సైనికుడు అమరుడు కాగా, ఓ ఉగ్రవాది హతమయ్యాడు. సైన్యం తెలిపిన వివరాల ప్రకారం, ఉగ్రవాదుల కదలికలపై అందిన సమాచారం మేరకు కొద్ది రోజుల నుంచి లోలాబ్ ప్రాంతంలో సైన్యం, పోలీసులు ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దాక్కున్న ఉగ్రవాదులు భద్రతా దళాలపై కాల్పులు ప్రారంభించాయి. మంగళ-బుధవారాల మధ్య రాత్రి ఉగ్రవాదుల కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భద్రతా దళాలు ప్రతిస్పందించాయి. కాల్పుల్లో ఓ ఉగ్రవాది మరణించగా, సైనికుడు గాయపడ్డారు. ఆ తర్వాత ఆయన ప్రాణాలు కోల్పోయారు.

వాణిజ్య

72 వేల దిగువకు పసిడి

ఇంకో రూ.650 తగ్గిన తులం ధర



న్యూఢిల్లీ, జూలై 24: బంగారం కొనుగోలు చేయాలనుకుంటున్నారా అయితే ఇదే సరైన సమయం. పసిడి, వెండిలపై కస్టమ్ డ్యూటీని తగ్గిస్తూ కేంద్ర సర్కార్ తీసుకున్న నిర్ణయంతో వరుసగా రెండోరోజూ బుధవారం ధరలు భారీగా తగ్గాయి. అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతోపాటు దిగుమతి సుంకాన్ని తగ్గించడంతో పుత్తడి ధర రూ.72 వేల దిగువకు పడిపోయింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర మరో రూ.650 దిగొచ్చి రూ.71,650కి తగ్గాయని ఆల్ ఇండియా సరాఫ అసోసియేషన్ వెల్లడించింది. అంతకుముందు ఈ ధర రూ.72,300గా ఉన్నది. గడిచిన రెండు రోజుల్లోనే ధరలు రూ.4 వేల స్థాయిలో తగ్గినట్టు అయింది. కానీ, వెండి ధరలు యథాతథంగా రూ.87,500 వద్ద ఉన్నాయి. కానీ, హైదరాబాద్‌లో మాత్రం ధరల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు. 24 క్యారెట్ల పుత్తడి ధర రూ.70,860 వద్ద ఉండగా, 22 క్యారెట్ ధర రూ.64,950 వద్ద స్థిరంగా ఉన్నాయి. కానీ, వెండి మాత్రం రూ.500 తగ్గి రూ.92 వేలకు జారుకున్నది. కానీ, అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పుంజుకుంటున్నాయి. ఔన్స్ గోల్డ్ ధర ఆరు డాలర్లు పెరిగి 2,461.20 డాలర్లకు చేరుకోగా, వెండి 29.38 డాలర్ల వద్ద ఉన్నది.



బీఎండబ్ల్యూ మరో ఈవీ

సింగిల్ చార్జింగ్‌తో 460 కి.మీ. • ధర రూ.54.9 లక్షలు

న్యూఢిల్లీ, జూలై 24: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ..పలు ఎలక్ట్రిక్ వాహనాలను దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో ఎలక్ట్రిక్ మినీ కంట్రీమ్యాన్ ధర రూ.54.9 లక్షలు. ఈ కారు బ్యాటరీపై ఎనిమిదేండ్లు లేదా 1.60 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది. ఎలక్ట్రిక్ మినీ కంట్రీమ్యాన్ కారు కేవలం 8.6 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 462 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 29 నిమిషాల్లో 80 శాతం వరకు బ్యాటరీ రీచార్జి కానున్నది. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, డైనమిక్ స్టెబిలిటీ కంట్రోల్, క్రాస్ సెన్సార్, యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్, కార్నరింగ్ బ్రేక్ కంట్రోల్, రియర్ వ్యూ కెమెరా, టూ్యబ్‌లెస్ టైర్లు వంటి ఫీచర్‌తో రూపొందించింది. ఇదో జనరేషన్‌గా విడుదలైన ఈ కారు ముందస్తు బుకింగ్‌లు ప్రారంభించింది. దేశవ్యాప్తంగా కంపెనీకి ఉన్న డీలర్ల వద్ద బుకింగ్ చేసుకున్నవారికి సెప్టెంబర్ నుంచి డెలివరీ చేయనున్నట్టు తెలిపింది. దీంతోపాటు రూ.44.9 లక్షల ధర కలిగిన మినీ కూపర్ ఎస్ మాడల్‌ను కూడా విడుదల చేసింది.

ప్రీమియం ఈ-స్కూటర్

దేశీయ మార్కెట్లోకి ప్రీమియం ఎలక్ట్రిక్ స్కూటర్ సీఈ 04ని అందుబాటులోకి తీసుకొచ్చింది బీఎండబ్ల్యూ. ఈ స్కూటర్ ధర రూ.14.90 లక్షలు. కేవలం 2.6 సెకండ్లలో 50 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ స్కూటర్ గంటకు 120 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నది. దేశీయంగా తయారైన ఈ స్కూటర్ మెట్రోపాలిటన్ సిటీల్లో మాత్రమే విక్రయించనున్నది. బుకింగ్ చేసుకున్న వారికి సెప్టెంబర్ నుంచి డెలివరీ చేయనున్నది.



గిట్లయితే ఏం లాభం

పన్ను విధానంలో మార్పులు చేసినా ఫలితం శూన్యం

ట్యాక్స్‌పేయర్లకు దక్కని ఊరట



న్యూఢిల్లీ, జూలై 24: వ్యక్తిగత పన్నుల విధానాన్ని పాత, కొత్త అంటూ వర్గీకరించిన మోదీ సర్కారు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను మంగళవారం ప్రకటించిన తాజా బడ్జెట్‌లోనూ తాము ఇష్టపడి తెచ్చిన కొత్త పన్ను విధానాన్ని ఆకర్షణీయంగా మార్చలేకపోయింది. చివరకు స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50,000 నుంచి రూ.75,000 మార్చినా ఫలితం మాత్రం శూన్యమే. ఉదాహరణకు మహేశ్ వయసు 45 సంవత్సరాలు. నెలకు రూ.15 లక్షల వార్షిక ఆదాయం ఉన్నది. నెలకు రూ.8,000 అద్దె తోపాటు, మరో రూ.20,000 హోమ్ లోన్ ఈఎంఐ చెల్లిస్తున్నారు. అప్పుడు మహేశ్ పన్ను సహిత ఆదాయం ఎంత? దానికి చెల్లించాల్సిన పన్ను ఎంత? అన్నది ఒక్కసారి చూస్తే..

కొత్త పన్ను విధానం (రూ.లలో)

మొత్తం ఆదాయం : 15 లక్షలు
స్టాండర్డ్ డిడక్షన్ : 75 వేలు
పన్ను సహిత ఆదాయం : 14,25,000

పన్ను లెక్కింపు ఇలా..

3 లక్షల వరకు : పన్ను లేదు
3-7 లక్షలు : 20 వేలు (4 లక్షలపై 5%)
7-10 లక్షలు : 30 వేలు (3 లక్షలపై 10%)
10-12 లక్షలు : 30 వేలు (2 లక్షలపై 15%)
12-15 లక్షలు : 45 వేలు (2.25 లక్షలపై 20%)
నికర పన్ను : 1,25,000
ఆరోగ్య, విద్య సెస్సు: 5 వేలు (నికర పన్నుపై 4%)
మొత్తం చెల్లించాల్సినది: 1,30,000

పాత పన్ను విధానం (రూ.లలో)

మొత్తం ఆదాయం: 15 లక్షలు
స్టాండర్డ్ డిడక్షన్: 50 వేలు
హెచ్‌ఆర్‌ఏ మినహాయింపు: 1,20,000
గృహ రుణంపై వడ్డీ: 1,44,000
సెక్షన్ 80సీ మినహాయింపు: 1,44,000
పన్ను సహిత ఆదాయం: 10,42,000

పన్ను లెక్కింపు ఇలా..

2.5 లక్షల వరకు పన్ను లేదు
2.5-5 లక్షలు: 12,500 (2.5 లక్షలపై 5%)
5-10 లక్షలు: లక్ష రూపాయలు (5 లక్షలపై 20%)
10 లక్షలపైన: 12,600 (42 వేలపై 30%)
నికర పన్ను: 1,25,100
ఆరోగ్య, విద్య సెస్సు: 5,004 (నికర పన్నుపై 4%)
మొత్తం చెల్లించాల్సినది: 1,30,104

ప్రస్తుతం ఆదాయ పన్ను రేట్లు

పాత పన్ను విధానం

శ్లాబులు (రూ.ల్లో)	ఐటీ రేట్లు
2.50 లక్షల వరకు	లేదు
2,50,001-5,00,000	5%
5,00,001-10,00,000	20%
10 లక్షలపైన	30%

కొత్త పన్ను విధానం

శ్లాబులు (రూ.ల్లో)	ఐటీ రేట్లు
3 లక్షల వరకు	లేదు
3,00,001-7,00,000	5%
7,00,001-10,00,000	10%
10,00,001-12,00,000	15%
12,00,001-15,00,000	20%
15 లక్షలపైన	30%

ఇంట్రా-డే ట్రేడర్లకు నష్టాలే

- ప్రతి 10 మందిలో ఏడుగురికి ఇంతే
- సెబీ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 24: ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో ప్రతి 10 మంది వ్యక్తిగత ఇంట్రా-డే ట్రేడర్లకు ఏడుగురు లేదా 71 శాతం నష్టాలనే పరిమితమవుతున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను మార్కెట్ రెగ్యులేటర్ సెబీ చేపట్టిన తాజా అధ్యయనం ఇదే చెప్తున్నది మరి. ఇక 2018-19తో పోల్చితే 2022-23లో ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో ఇంట్రా-డే ట్రేడింగ్ చేసేవారు 300 శాతానికిపైగా పెరగడం గమనార్హం. అలాగే 30 ఏండ్ల కంటే తక్కువ వయసున్న వ్యక్తులు ఈ తరహా ట్రేడింగ్‌పై ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నట్టు కూడా బుధవారం సెబీ విడుదల చేసిన అధ్యయనం తెల్పింది. ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్ ఇంట్రా-డే ట్రేడింగ్‌లో ఇండివిడ్యువల్స్ భాగస్వామ్యం, వారిద్వారా జరుగుతున్న లాభనష్టాలను తెలుసుకోవడానికే ఈ అధ్యయనాన్ని నిర్వహించినట్టు సెబీ తెలియజేసింది. 2018-19, 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లోని తీరుతెన్నులను ఈ సందర్భంగా పరిశీలించింది. కరోనాకు ముందు, ఆ తర్వాత సరళిని కనిపెట్టేందుకే ఈ సంవత్సరాలను ప్రాతిపదికగా తీసుకున్నట్టు వివరించింది. కాగా, ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో దాదాపు 86 శాతం ఇండివిడ్యువల్ క్లయింట్లున్న టాప్-10 స్టాక్ బ్రోకర్ల క్లయింట్ల ఆధారంగా ఈ అధ్యయనం జరిగింది. వీరిలో ప్రతి ముగ్గురిలో ఒకరు ఇంట్రా-డే ట్రేడింగ్‌లో పాల్గొన్నట్టు తేలింది. ఈ క్రమంలోనే 2018-19తో చూస్తే 2022-23లో 30 ఏండ్ల దిగువ ఉన్నవారు 18 శాతం నుంచి 48 శాతానికి పెరిగినట్టు బయటపడింది. ఇదిలావుంటే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌వో) విభాగంలో ట్రేడింగ్ చేస్తున్న మదుపరులూ గణనీయంగా పెరుగుతున్నట్టు సెబీ స్పష్టం చేసింది. 2018-19లో 7.1 లక్షలుగా ఉన్న వ్యక్తిగత ట్రేడర్లు.. 2020-21లో 45.24 లక్షలకు ఎగబాకినట్టు సెబీ అధ్యయనం వెల్లడించింది.



వరుసగా నాలుగో రోజూ నష్టాలు

సెన్సెక్స్ 280, నిఫ్టీ 65 పాయింట్ల నష్టం

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగోరోజూ నష్టపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్, సెక్యూరిటీస్ లావాదేవీ పన్నును పెంచుతూ తీసుకున్న నిర్ణయం మదుపరులను షాక్ గురిచేసింది. దీంతో ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపడంతో ఒక దశలో 80 వేల దిగువకు పడిపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 280.16 పాయింట్లు నష్టంతో 80,148.88 వద్ద ముగిసింది. ఇటు ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ సైతం 65.55 పాయింట్లు నష్టపోయి 24,413.50 వద్ద స్థిరపడింది. 19 షేర్ల ఇండెక్స్‌లు నష్టపోగా, 11 షేర్ల ఇండెక్స్‌లు లాభాల్లో ముగిశాయి.

చారిత్రక కనిష్ఠ స్థాయికి

రూపాయి

రూపాయికి మరిన్ని చిల్లులు పడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 2 పైసలు కోల్పోయి చారిత్రక కనిష్ఠ స్థాయి 83.71కి జారుకున్నది. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో పాటు ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ఉండటం మారకంపై ప్రతికూల ప్రభావం చూపింది. 83.69 వద్ద ప్రారంభమైన డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు ఒక దశలో ఆల్‌టైం కనిష్ఠ స్థాయి 83.720 తాకింది. చివరకు రెండు పైసలు నష్టపోయి 83.71 వద్ద ముగిసింది. మరోవైపు మంగళవారంలో కూడా మారకం విలువ 3 పైసలు కోల్పోయిన విషయం తెలిసిందే.



టీ హబ్‌తో బియాండ్ ఒప్పందం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 24 (నమస్తే తెలంగాణ): మలేషియాకు చెందిన బియాండ్ 4తో వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది టీ హబ్. బుధవారం టీ హబ్ కార్యాలయంలో బియాండ్ 4 సీఈవో ఎస్‌టీ రుబనేశ్వరన్, టీ హబ్ సీఈవో ఎంఎస్ రావు ఒప్పంద పత్రాలపై ఇరువురు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా టీ హబ్ సీఈవో ఎంఎస్ రావు మాట్లాడుతూ.. బియాండ్ 4తో కుదుర్చుకున్న ఒప్పందంతో భారత్‌తోపాటు మలేషియాల మధ్య బలమైన స్టార్టప్ ఎకోసిస్టం పెంపొందించడానికి వీలు పడుతుందన్నారు. రెండు సంస్థలు కలిసి ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాయని, ఇదే సమయంలో పెట్టుబడులు మరింత సులభతరం కానున్నదన్నారు. బియాండ్ 4 మలేషియా సంస్థ సీఈవో ఎస్‌టీ రుబనేశ్వరన్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతున్నదని, ఆర్ఎం 345.9 బిలియన్ల పెట్టుబడులు పెట్టాలని కుంటున్నట్టు చెప్పారు.

'బ్యాంకుల్లో నగదు చెల్లింపుల నిబంధనలు కఠినతరం'

ముంబై, జూలై 24: బ్యాంకుల వద్ద నగదు చెల్లింపు సేవలను రిజర్వు బ్యాంక్ మరింత కఠినతరం చేసింది. ఇకపై బ్యాంకులు తమ వద్ద ఖాతాలేని వారికి ఇస్తున్న నగదు విషయంలో ఆ వ్యక్తుల రికార్డులను భద్రపరచాలని సెంట్రల్ బ్యాంక్ సూచించింది. దేశీయ నగదు లావాదేవీలకు సంబంధించి అక్టోబర్ 2011లో జారీ చేసిన నిబంధనలను సవరించింది, ఈ కొత్త నిబంధనలను నవంబర్ 1 నుంచి అమల్లోకి తేనున్నట్టు తెలిపింది. సవరించిన నిబంధనల ప్రకారం క్యాష్ పే ఔట్ సేవలకు సంబంధించి సొమ్ములు అందుకున్న వ్యక్తి పేరు, చిరునామా వివరాలను బ్యాంకులు భద్రపరచాలని ఆదేశించింది. అదే విధంగా నగదు డిపాజిట్ విషయంలోనూ సంబంధిత బ్యాంక్, ఆ వ్యక్తుల వివరాలతోపాటు ఫోన్ నంబర్ నమోదు చేయాలని సూచించింది.



బురదలో బడికెళ్లేదెట్లా ?

ఎడతెరిపిలేని వర్షాలకు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మల్యాపూర్ రోడ్డు బురదగా మారింది. బుధవారం మల్యాపూర్ విద్యార్థులను ముత్నూర్ గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలకు తరలిస్తున్న ఆటో ఆ బురదలో దిగబడింది. దీంతో విద్యార్థులు కిందికి దిగి బురదలో దిగబడిన ఆటోను బయటకు నెట్టారు. అనంతరం ఆటోలో బడికి వెళ్లారు. బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. -ఇంద్రవెల్లి



గొడుగుల కింద చదువులు

మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 54 మంది విద్యార్థులు ఉన్నారు. రెండు తరగతి గదులు చిన్నపాటి వర్షానికే కురుస్తుండగా.. విద్యార్థులు ఇంటి నుంచి గొడుగులు తెచ్చుకొని చదువుకుంటున్నారు. భారీ వర్షం పడితే పుస్తకాలు, బ్యాగులు తడిసి ముద్దవుతున్నాయి. గదుల్లో నీరు నిలుస్తుండటంతో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారని హెచ్ఎం ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. -నెన్నెల

'అంగన్‌వాడీ కోడిగుడ్డు'లో పురుగులు



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బంజారాహిల్స్ అంగన్‌వాడీ కేంద్రంలో 4రోజుల క్రితం అంగన్‌వాడీ టీచర్ శ్రీలత కోడిగుడ్లను పంపిణీ చేసింది. భూక్య అలినాయక్‌కు చెందిన చిన్నారులకు ఇచ్చిన కోడిగుడ్లను బుధవారం ఉడకబెట్టి పెంకు తీయగా అందులో పురుగులు కనిపించాయి. -భువనగిరి అర్బన్

బీఆర్ఎస్ స్థలంలో నిర్మాణాల నిలిపివేతకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా కోకాపేటలోని 230, 240 సర్వే నంబర్లలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి కేటాయించిన 11 ఎకరాల భూమిలో నిర్మాణాలు చేపట్టకుండా ఉత్తర్వులు జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఇప్పటికే ఆ భూమిలో బీఆర్ఎస్ ఏమైనా నిర్మాణాలను చేపట్టినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని పిటిషనర్లకు సూచించింది. ఆ భూమి తమకు వారసత్వంగా వచ్చిందని, దాన్ని బీఆర్ఎస్‌కు కేటాయించడం చెల్లదని పేర్కొంటూ కొందరు ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం విచారణ జరిపారు. ఈ వ్యాజ్యాలపై కౌంటర్ దాఖలు చేయాలని బీఆర్ఎస్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం కూడా వివరణ ఇవ్వాలని కోరుతూ.. తదుపరి విచారణను ఆగస్టు 2కు వాయిదా వేశారు.



హనుమకొండలో బీఆర్ఎస్‌కు స్థలం కేటాయింపుపై 30న తీర్పు

హైకోర్టు ప్రకటన

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): హనుమకొండలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యాలయ నిర్మాణం కోసం ఎకరం స్థలాన్ని కేటాయించిన వ్యవహారంపై ఈ నెల 30న తీర్పు వెలువరిస్తామని హైకోర్టు ప్రకటించింది. ఆ స్థలంలో నిర్మాణాలను చేపట్టడంపై గత నెల 25న మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జారీచేసిన నోటీసులను సవాలు చేస్తూ హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు డీ వినయ్ భాస్కర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం విచారణ జరిపారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ.. బీఆర్ఎస్‌కు కేటాయించిన స్థలంలో కాకుండా మరో స్థలంలో నిర్మాణాలు చేపట్టినట్టు చెప్పారు. ఆ భూమికి ప్రత్యామ్నాయంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఇంటికి సమీపంలో మరో స్థలాన్ని కేటాయించాలని బీఆర్ఎస్ కోరిందని, దీనిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకముందే ఆ పార్టీ నిర్మాణాలను చేపట్టిందని వివరించారు. వాస్తవానికి హనుమకొండలో బీఆర్ఎస్‌కు కేటాయించిన స్థలం కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (కుడా) పరిధిలో ఉన్నదని తెలిపారు. దీంతో ఆ స్థలంలోని నిర్మాణాల ఫొటోలను పరిశీలించిన న్యాయమూర్తి.. ఈ నెల 30న తీర్పును వెలువరిస్తామని స్పష్టం చేశారు.

రైతులకు గాయత్రిషుగర్స్ క్షమాపణలు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన
- కేవైసీ అప్‌డేట్‌తోనే ఇలా జరిగింది
- ఇరవై ఏండ్లుగా బ్యాంకు రుణాలు తీసుకుంటున్నాం
- రుణమాఫీ డబ్బులను తిరిగి రైతులకే చెల్లిస్తాం
- మీడియాతో ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్

నమస్తే ఎఫెక్ట్

నిజామాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): చెరుకు రైతులకు తెలియకుండా వారి పేరిట రుణాలు తీసుకున్న గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం అన్నదాతలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పింది. ట్రైపార్టీ ఒప్పందాల ముసుగులో రైతుల సమ్మతి లేకుండానే వారి పేరిట బ్యాంకు రుణాలు తీసుకున్న వైనాన్ని 'నమస్తే తెలంగాణ' బుధవారం వెలుగులోకి తెచ్చిన నేపథ్యంలో ఆ సంస్థ దిగొచ్చింది. రైతుల పేరిట తీసుకున్న రుణాలను పది రోజుల్లోపు బ్యాంకులకు చెల్లిస్తామని వెల్లడించింది. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని ఫ్యాక్టరీలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. 20 ఏండ్లుగా ఇలా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నామని, ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ తలెత్తలేదని చెప్పారు. ట్రైపార్టీ ఒప్పందంలో భాగంగానే యాజమాన్యం బ్యాంకులతోనూ రుణాల కోసం ఒప్పందం చేసుకుంటుందని, ఇదంతా పారదర్శకంగా చేపట్టినట్టు తెలిపారు. పది రోజుల్లోనే బ్యాంకులకు చెల్లింపులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కేవైసీ అప్‌డేట్ కావడం వల్లే ఇదంతా జరిగిందంటూ పొరపాటును వ్యవస్థపైనే నిందలు వేసేందుకు ఆయన ప్రయత్నించడం గమనార్హం.

విచారణకు కమిటీని ఏర్పాటు చేశాం

'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వచ్చిన కథనం ఆధారంగా గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో అవకతవకలు రుణమాఫీ అంశంపై విచారణకు ఆదేశాలు జారీ చేశాం. ఆర్డీవో, జిల్లా వ్యవసాయాధికారులకు ఈ బాధ్యతలను అప్పగించాం. రెండు రోజుల్లోనే విచారణ నివేదిక వస్తుంది. ఆ తర్వాత అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడిస్తాం.

- ఆశిష్ సంగ్వాన్, కామారెడ్డి జిల్లా కలెక్టర్

కదిలించిన 'నమస్తే తెలంగాణ' కథనం

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లోని దాదాపు 10 మండలాల్లో చెరుకు సాగు చేస్తుంటారు. ఆయా గ్రామాల్లో చెరుకు సాగు చేసే రైతులతో గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ ఒప్పందాలు చేసుకుంటుంది. ఫ్యాక్టరీకి చెందిన బాధ్యులు సదరు రైతులతో పలు డాక్యుమెంట్లపై సంతకాలు తీసుకుంటారు. అయితే, చెరుకు సాగుకు తప్ప రుణాల విషయంలో రైతులెవ్వరూ ఫ్యాక్టరీకి ఎలాంటి ఒప్పందాలను రాసివ్వరు. కానీ, ఇదే అదునుగా భావించి ఫ్యాక్టరీ నిర్వాహకులు రూ.కోట్లలో రుణాలను సేకరిస్తుండటం తాజాగా బయటపడింది. ఇందులో రుణమాఫీ పరిధిలోని రుణాలు కూడా ఉండటంతో రైతులంతా లబోదిబోమనగా వారికి 'నమస్తే తెలంగాణ' అండగా నిలిచింది. రైతులతో మాట్లాడి వారి వేదనకు అక్షర రూపం ఇచ్చింది. 'రైతు చేయని రుణాలూ మాఫీ', 'ఒప్పందాల పేరిట దారుణం' శీర్షికలతో బుధవారం ప్రచురించిన ప్రత్యేక కథనాలు జిల్లాలో కలకలం రేపాయి. వీటిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం వివరాలను ఆరా తీసింది. సంబంధిత అధికారులు సీరియస్ కావడంతో గాయత్రి షుగర్స్ యాజమాన్యం దిగొచ్చింది.

ట్రైపార్టీ అగ్రిమెంట్‌తో బురిడీ

గాయత్రి షుగర్ ఫ్యాక్టరీస్, రైతులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్య ట్రైపార్టీ అగ్రిమెంట్ 20 ఏండ్లుగా కొనసాగుతున్నది. ఇందులో రైతుల పాత్ర సూక్ష్మమే. పత్రాలపై సంతకాలతోనే సరిపెడతారు. కానీ, బ్యాంకు, షుగర్ ఫ్యాక్టరీ మధ్య ఒప్పందం అధికారికంగా జరుగుతుంది. ఈ విషయం సగానికంటే ఎక్కువ మంది రైతులకు తెలియదు. సంతకాలు పెట్టి ట్రైపార్టీ ఒప్పందాలు చేసుకోవడం మినహా ఇందులో బ్యాంకర్లు, షుగర్ ఫ్యాక్టరీ పాత్రపై ఎలాంటి అవగాహన రైతులకు లేదు. ట్రైపార్టీ అగ్రిమెంట్ ఆధారంగా చేసుకుని యూనియన్ బ్యాంకు నుంచి రుణాలను ఫ్యాక్టరీ స్వీకరించింది. ఇందులో ఫ్యాక్టరీ ఆస్తులను పూచీకత్తుగా యూనియన్ బ్యాంకు పరిగణనలోకి తీసుకున్నది. ట్రైపార్టీ కింద మంజూరైన రుణాలకు వాస్తవానికి రుణమాఫీ వర్తించదు. సర్కారు జారీచేసిన మార్గదర్శకాల్లోనూ ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. కానీ, బ్యాంకులు, వ్యవసాయాధికారులు మాత్రం రుణమాఫీ కింద వీటిని పరిగణించడంలో దాగి ఉన్న మర్మం ఏమిటో ఎవరికీ అంతుచిక్కడం లేదు.

పెదవి విప్పని ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో రైతులకు జరిగిన ఈ దోకాపై కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కనీసం పెదవి విప్పలేదు. అసెంబ్లీ సమావేశాల నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ తన సొంత నియోజకవర్గంలో జరిగిన తంతుపై స్పందించకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	32.0°c	24.0°c
హైదరాబాద్	26.6°c	23.6°c
ఆదిలాబాద్	29.2°c	23.9°c
వరంగల్	26.0°c	23.0°c
నల్లగొండ	30.0°c	22.0°c
కరీంనగర్	28.0°c	24.0°c
నిజామాబాద్	28.8°c	23.4°c
రంగారెడ్డి	28.9°c	21.6°c
మహబూబ్‌నగర్	28.0°c	22.7°c
మెదక్	27.9°c	22.3°c

మరో రెండు రోజులు వానలు

- హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడి



హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, హన్మకొండ, ములుగు, కామారెడ్డి, సంగారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, జనగామ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీచేశారు. హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై జల్లులు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా జూలై సాధారణ వర్షపాతం 229.1 మి.మీ ఉండగా, ఇప్పటి వరకు 238.9 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో అత్యధికంగా 10.02 సెం.మీ, ఆదిలాబాద్‌అర్బన్‌లో 6.46 సెం.మీ,ఇంద్రవెల్లిలో 4.56 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది.

ఇంకెంత కాలం మభ్యపెడతరు?

ఎస్సీ వర్గీకరణపై కేంద్రాన్ని నిలదీసిన వంగపల్లి



హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణపై రేపు మాపు అంటూ పదేండ్లు కాలం గడిపి ఇంకా పార్లమెంటులో బిల్లు పెట్టకుండా ఇంకెంత కాలం మభ్యపెడతారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. హైదరాబాద్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి, ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన బీజేపీ నేతలు అధికారంలోకి వచ్చి 11 ఏండ్లు అవుతున్నా ఆ అంశాన్ని ప్రస్తావించడమే లేదని మండిపడ్డారు. నిన్నటి కేంద్ర బడ్జెట్‌లో కూడా తెలంగాణకు మొండి చేయి చూపారని విమర్శించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టకపోతే బీజేపీ నేతలతో పాటు మాదిగ సామాజికవర్గంలోని ఇంటి దొంగలను బట్టలిప్పి బజారున నిలబెడతామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై తాడో పేడో తేల్చుకోవడానికి ఆగస్టు 6న ఢిల్లీలో దీక్ష చేయనున్నట్టు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోరుకునే సంస్థలు, సంఘాలు, మద్దతు ఇచ్చే పార్టీలు తమ దీక్షకు సంఘీభావం తెలపాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేత యాతాకుల భాస్కర్ మాదిగ, కోర్ కమిటీ సభ్యులు చింతమల్ల గణేశ్, పొట్టెపంగ రమేశ్, బంగారు శ్రీనివాస్, దుమ్ము శివరాజ్, సరికొండ అంజన్న, కొండ లక్ష్మయ్య, ఊరుమల్ల యాకయ్య, కొల్లూరి వెంకట్, వరిగడ్డ చందు, కే అంజన్న, దర్శనపు శ్రీకాంత్, ఎల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థికి పాముకాటు

రిమ్స్‌లో చికిత్స.. హైదరాబాద్‌కు తరలింపు

ఎదులాపురం, జూలై 24: ఆదిలాబాద్ ఎస్సీ గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న జాదవ్ సిద్ధు పాముకాటుకు గురయ్యాడు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలో గల గిరిజన గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న జాదవ్ సిద్ధు ఈ నెల 22న రాత్రి వసతి గృహంలో కింద పడుకున్నాడు. రాత్రి సమయంలో పాము కాటు వేసింది. ఈ విషయం నిద్రలో ఉన్న విద్యార్థికి తెలియదు. 23న ఉదయం తోటి మిత్రులు నిద్ర లేపగా.. సిద్ధు కండ్లలో నుంచి నీరు కారడం, ఒళ్లు నొప్పులు, కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ విషయం ఏఎన్ఎం విజయలక్ష్మికి చెప్పగా వెంటనే విద్యార్థిని ఏఎన్ఎం రిమ్స్‌కు తీసుకెళ్లింది. రిమ్స్ ఓపీ విభాగంలో వైద్యులు మందులు ఇచ్చి ఇంటికి పంపించారు. మధ్యాహ్నం విద్యార్థి బంధువు వచ్చి గ్రామానికి తీసుకెళ్లి నాటు వైద్యం చేయించారు. సాయంత్రానికి విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆ తరువాత కుటుంబ సభ్యులు రిమ్స్‌లో చేర్పించారు. ఈ విషయాన్ని ఎస్సీ గురుకులం ఆర్సీవో రాజ్యలక్ష్మి ఎస్సీ గురుకులం ఉన్నత అధికారులకు చెప్పడంతో వారి సూచనల మేరకు బుధవారం విద్యార్థిని హైదరాబాద్‌కు తరలించారు.

ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టాలి

- ఢిల్లీలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ ధర్నా
- దాడులు, హింసాత్మక ఘటనలపై ఆగ్రహం
- ఎస్పీ, ఏఐఏడీఎంకే, శివసేన (ఉద్ధవ్) పార్టీల మద్దతు
- కేంద్ర హోంశాఖ విచారణకు డిమాండ్



ఢిల్లీలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేస్తున్న దీక్షకు మద్దతు తెలుపుతున్న ఎస్పీ అధినేత అఖిలేశ్‌యాదవ్

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో దాడులు, హింసాత్మక ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రపతి పాలన పెట్టాలని వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న హింసాత్మక ఘటనలపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఆందోళన చేపట్టారు. ఈ ధర్నాకు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్‌యాదవ్, ఆ పార్టీ ఎంపీలు రాంగోపాల్‌యాదవ్, ప్రియాంక చతుర్వేది, శివసేన (ఉద్ధవ్ వర్గం) లోక్‌సభ ఫ్లోర్‌లీడర్ రాహుల్ షేవాలే, ఎంపీ సంజయ్‌రౌత్, ఏఐఏడీఎంకే ఎంపీ తంబిదురై తదితరులు స్వయంగా పాల్గొని మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం విపక్ష పార్టీ నేతలపై దాడులు చేస్తున్నదని మండిపడ్డారు. దాడులకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవద్దని పోలీసులకు ఆదేశాలిచ్చారని ఆరోపించారు. 45 రోజుల్లోనే 35 రాజకీయ హత్యలు జరిగాయని,వందల ఇండ్లను ధ్వంసం చేశారని చెప్పారు. అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉన్నదా ? అని ప్రశ్నించారు.

యూపీలోనూ ఇదే పరిస్థితి : అఖిలేశ్ యాదవ్


ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో ఆందోళనకరమైన పరిస్థితులున్నాయని ఎస్పీ అధినేత అఖిలేశ్‌యాదవ్ చెప్పారు. ప్రతీకార రాజకీయాలు మంచిదికాదని హితవు చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణ విషయంలో జగన్‌కు మద్దతిస్తామని స్పష్టంచేశారు. సంజయ్‌రౌత్ మాట్లాడుతూ.. ఏపీలో జరిగిన దాడులపై కేంద్ర హోంశాఖ ప్రత్యేక బృందాన్ని రాష్ట్రానికి పంపాలని డిమాండ్ చేశారు. రాహుల్ షేవాలే మాట్లాడుతూ.. ఏపీలో పరిస్థితి అత్యంత విచారకరమని, మణిపూర్ లాంటి పరిస్థితులు ఉన్నాయని, కేంద్ర హోంశాఖ చూస్తూ ఊరుకోవద్దని కోరారు. తంబిదురై మాట్లాడుతూ.. రాజకీయ దాడులు మంచిది కాదని హితవు చెప్పారు. తమిళనాడులోనూ ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నామని, దాదాపు 500 మందిని హత్య చేశారని ఆవేదన వ్యక్తంచేశారు.

రుణమాఫీ చెప్పిందెంత? చేసిందెంత?

- రైతుభరోసా రైతులకు ఇప్పటికీ లేకపోయె
- రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫైర్



పెద్దవంగర, జూలై 24: గత డిసెంబర్ 9న చేయాల్సిన రూ.2 లక్షల రుణమాఫీని ఏడు నెలలు ఆలస్యం చేసి.. రూ.31 వేల కోట్ల మాఫీ అని గొప్పలు చెప్పి.. తీరా రూ.6 వేల కోట్లు విదిల్చి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు వానకాలం సీజన్‌లో ఎకరానికి రూ.7500 చొప్పున రైతు భరోసా కింద ఇవ్వాల్సిన రూ.11,250 కోట్లు ఎగ్గొట్టి.. ఆ డబ్బుల్లోంచి రుణమాఫీ కింద రూ.6,098 కోట్లు విదిల్చి ఏదో ఘనకార్యం చేసినట్టు ప్రచారం చేసుకుంటున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పరిస్థితి కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు ఉందని ఎద్దేవా చేశారు. రైతుల రుణమాఫీపై కాంగ్రెస్ చెప్పిందెంత? రేవంత్‌రెడ్డి సర్కార్ ఇస్తున్నదెంత? అని ప్రశ్నించారు. కేసీఆర్ ఏమీ చేయలేదని, అంతా తామే చేస్తున్నామనే భ్రమల నుంచి కాంగ్రెస్ సర్కారు బయటకు రావాలని సూచించారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు, ధాన్యం కొనుగోళ్లు, రెండు విడతల్లో రూ.28 వేల కోట్ల రుణమాఫీ, మిషన్ కాకతీయ వంటి అనేక పథకాలు అమలు చేసి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రపంచ దేశాల ప్రశంసలు పొందారని గుర్తుచేశారు. జూన్‌లో వేయాల్సిన రైతు భరోసా జూలై వచ్చినా రైతు ఖాతాలో వేయలేదని, కౌలు రైతులకు ఇస్తామన్న రూ.15 వేలు ఇవ్వలేదని, రైతు కూలీలకు రూ.12 వేల హామీ ఇంకా అమలు చేయలేదని విమర్శించారు.



హైదరాబాద్‌లో సినిమా ట్రైలర్‌ను విడుదల చేస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

హరితహారం స్ఫూర్తితో సింబా!

- పర్యావరణ పరిరక్షణ కథాంశంతో సినిమా
- దర్శకుడు ఓదెలకు చెందిన సంపత్ నంది
- నిర్మాత జీలకుంటకు చెందిన దాసరి రాజేందర్‌రెడ్డి
- హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల

ఓదెల, జూలై 24: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన హరితహారం స్ఫూర్తితో.. పర్యావరణ పరిరక్షణ, వృక్షాల ప్రాధాన్యతను తెలియజేసేలా 'సింబా' సినిమాను తెరకెక్కించామని దర్శక, నిర్మాతలు తెలిపారు. ఈ సినిమాకు పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని ఓదెలకు చెందిన సంపత్ నంది దర్శకుడుగా, జీలకుంటకు చెందిన దాసరి రాజేందర్‌రెడ్డి నిర్మాతలుగా వ్యవహరించారు. కమర్షియల్ చిత్రంగా కాకుండా వృక్షాల వల్ల కలిగే లాభాలు, భవిష్యత్‌లో ఆక్సిజన్‌ను పొందే ఉన్న మార్గాలను వివరిస్తూ ప్రజలను చైతన్య పరిచేలా సంపత్ నంది టీమ్ వర్క్స్, రాజ్ దాసరి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కించారు. ప్రముఖ తారాగణం జగపతిబాబు, కస్తూరిలతో ప్రముఖ హీరోగా పేరు తెచ్చుకున్న వశిష్ట సింహా, ఇతర సినీ నటులతో షూట్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం కూడా ఎంతో సహకారం అందించిందని దర్శక, నిర్మాతలు తెలియజేశారు. మూడేండ్ల క్రితమే షూటింగ్ పూర్తికాగా విడుదల ఆలస్యమైంది. బుధవారం హైదరాబాద్‌లో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు.

16 మంది ఎంపీలకు చీరలు

బీఆర్ఎస్ సీనియర్ నేత బట్టు రాజశేఖర్ నిరసన

ఇబ్రహీంపట్నం, జూలై 24: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు బీజేపీ మొండి చెయ్యి చూపడం సరికాదని, రాష్ట్రం నుంచి గెలిచిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారో చెప్పాలని జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బట్టు రాజశేఖర్ ప్రశ్నించారు. తెలంగాణ ఎంపీలు రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ముందుకు వెళ్లాలని సూచించారు. బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా 'రాష్ట్రంలో మా పరిస్థితి ఇది' అని పేర్కొంటూ నిరసన తెలిపేందుకు చీర, గాజులు, నల్ల మాస్కులను కొరియర్ ద్వారా పంపుతున్నట్టు చెప్పారు. నిరసన తెలిపేందుకు బానిసత్వం అడ్డువస్తే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర, బీహార్ రాష్ట్రాల్లా తాము కూడా ప్రాంతీయ పార్టీ ఎంపీలను గెలిపించుకొని నిధులు తెచ్చుకుంటామని స్పష్టం చేశారు.బుధవారం ఆయన గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ఊసే లేకపోవడంపై రాష్ట్ర ఎంపీలు సిగ్గుపడాలని సూచించారు. ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రూ.15 వేల కోట్లు, బీహార్‌లోని నితీశ్ ప్రభుత్వం రూ.26 వేల కోట్లు తీసుకెళ్లిందని, తెలంగాణ నుంచి 17 మంది ఎంపీలుండి రాష్ట్రానికి రూపాయి కూడా తీసుకురాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎంపీలు ఢిల్లీకి, బీజేపీ ఎంపీలు గుజరాత్‌కు బానిసలయ్యారని విమర్శించారు.

కొత్త నేరచట్టాలను సమీక్షించాలి

- జడ్జీలు, న్యాయవాదుల సూచనలు స్వీకరించాలి
- బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్
- కేంద్ర న్యాయశాఖ మంత్రి మేఘ్వాల్‌కు వినతిపత్రం అందజేత

హైదరాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): కొత్త నేర చట్టాలను సమీక్షించి సవరణలు తేవాలని, పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ నోటరీల నియామకాలను వెంటనే చేపట్టాలని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నేతృత్వంలో న్యాయవాద బృందం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా పలు విషయాలను ఆయన దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. కొత్త నేర చట్టాల్లో స్వల్ప సవరణల విషయమై జిల్లా జడ్జీలు, జిల్లా కోర్టుల ప్రాక్టీసింగ్ సీనియర్ న్యాయవాదుల సూచనలను స్వీకరించాలని కోరారు. 2021లో వచ్చిన సెంట్రల్ నోటరీస్ నోటిఫికేషన్‌లో 2,000 మంది న్యాయవాదులు దరఖాస్తు చేసుకున్నారని, వాటిని వెంటనే పరిశీలించి, వెంటనే నియామకాలు కేంద్ర మంత్రిని ఎంపీ వద్దిరాజు కోరారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లును అమలు చేయాలని కోరారు. ఈ బృందంలో సీనియర్ న్యాయవాదులు తాళ్లూరి దిలీప్, నేరెళ్ల శ్రీనివాస్, సంక్రాంతి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తదితరులు